ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

1

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

బుధవారం 5 జూన్ 2024



నెల్లూరు నగరం

విజేత : పొంగూరు నారాయణ
పార్టీ : టీడీపీ
మెజారిటీ : 72,489
2014లో 19,087 (వైసీపీ)
2019లో 1,988 (వైసీపీ)




కోవూరు

విజేత : వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి
పార్టీ : టీడీపీ
మెజారిటీ : 54,583
2014లో 7,937 (టీడీపీ)
2019లో 39,769 (వైసీపీ)



నెల్లూరు రూరల్

విజేత : కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి
పార్టీ : టీడీపీ
మెజారిటీ : 34,480
2014లో 25,653 (వైసీపీ)
2019లో 19,804 (వైసీపీ)



కావలి

విజేత : డి.వెంకటకృష్ణారెడ్డి
పార్టీ : టీడీపీ
మెజారిటీ : 30,948
2014లో 4,969 (వైసీపీ)
2019లో 13,789 (వైసీపీ)



కందుకూరు

విజేత : ఇంటూరి నాగేశ్వరరావు
పార్టీ : టీడీపీ
మెజారిటీ : 17,818
2014లో 3,806 (వైసీపీ)
2019లో 14,936 (వైసీపీ)



సర్వేపల్లి

విజేత : సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
పార్టీ : టీడీపీ
మెజారిటీ : 16,288
2014లో 5,446 (వైసీపీ)
2019లో 13,866 (వైసీపీ)



ఉదయగిరి

విజేత : కాకర్ల సురేష్
పార్టీ : టీడీపీ
మెజారిటీ : 9,621
2014లో 3,622 (టీడీపీ)
2019లో 36,081 (వైసీపీ)



ఆత్మకూరు

విజేత : ఆనం రామనారాయణరెడ్డి
పార్టీ : టీడీపీ
మెజారిటీ : 7,648
2014లో 31,412 (వైసీపీ)
2019లో 22,963 (వైసీపీ)



బుచ్చిరెడ్డిపాళెం : ఖాజానగర్‌లో ఫ్యాన్‌కు టపాసులు కట్టి కాలుస్తున్న టీడీపీ శ్రేణులు



నెల్లూరు : టీడీపీ కార్యాలయం వద్ద కార్యకర్తల ఆనందం



నెల్లూరు : ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీలో ఈవీఎం యంత్రాలను ఏజెంట్లకు చూపిస్తున్న అధికారులు

కూటమి సునామి

జిల్లా తెలుగుదేశం చరిత్రలో అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. కూటమి సునామికి వైసీపీ చిత్తుచిత్తుగా ఓటమిపాలయ్యింది. బ్యాలెట్ పోరులో రెక్కలు తెగిన పక్షిలా ఫ్యాన్ గిలగిలలాడిపోయింది. ఉప్పెనలా సైకిల్ దూసుకెళ్లింది. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు ఎప్పుడూ కనీవినీ ఎరుగని రీతిలో అన్ని స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు జయకేతనం ఎగరవేశారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఏవగించుకున్నారో.. అప్పుల పాలైన రాష్ట్రానికి చంద్రబాబు అవసరం అని గుర్తించారో.. కారణం ఏదైనా సింహపురీయులు టీడీపీకి బ్రహ్మరథం పట్టారు. జిల్లా పరిధిలోని ఒక పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో భారీ విజయాన్ని కట్టబెట్టారు. సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేకుండా అందరికీ భారీ మెజారిటీలు కట్టబెట్టారు. ఉద్దండులైన వైసీపీ అభ్యర్థులను సైతం మట్టి కరిపించి టీడీపీ అభ్యర్థులను సింహాసనం ఎక్కించారు. రాజకీయ పార్టీల ఊహకు అందని విధంగా తెలుగుదేశం పార్టీకి అఖండ విజయం కట్టబెట్టారు. మంగళవారం కౌటింగ్ మొదలు పెట్టినప్పటి నుంచి ఆఖరు వరకు తెలుగుదేశం అభ్యర్థుల ప్రభంజనం కొనసాగింది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

- జిల్లాను చుట్టేసిన 'సైకిల్' ప్రభంజనం
- తెలుగుదేశం చరిత్రలో అరుదైన ఘటన
- 8కి ఎనిమిది స్థానాల్లో జయకేతనం
- నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డికి 2,45 లక్షల ఓట్ల మెజారిటీ
- నెల్లూరు సిటీలో నారాయణకు 72,489, కోవూరులో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి 54,583 ఓట్ల ఆధిక్యత
- సర్వేపల్లిలో సత్తాచాటుకున్న సోమిరెడ్డి
- ఆద్యంతం ఉత్కంఠ రేపిన ఆత్మకూరు కౌంటింగ్
- కూటమి శ్రేణుల్లో పెల్లుబికిన ఆనందం
- రంగులు పూసుకొని.. కేక్‌లు కట్ చేసి సంబరం



టీడీపీ కార్యాలయంలో సంబరం



విజయం మాదే : కాకర్ల ఆనందం



సిటీలో పాగా వేశాం : నారాయణ

● చరిత్ర సృష్టించిన నారాయణ

జిల్లాలో కనీవినీ ఎరుగని విధంగా 72,489 ఓట్ల భారీ మెజారిటీ సాధించడం ద్వారా పొంగూరు నారాయణ తన సత్తా చాటుకున్నారు. 2014 టీడీపీ ప్రభుత్వంలో మంత్రి హోదాలో నెల్లూరు నగరంలో 5వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేశారు. అయినా వైసీపీ గాలిలో కేవలం 1988 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. ఓడిన చోటే గెలవాలనే పట్టుదలతో ఈ ఎన్నికల్లో నెల్లూరు సిటీ నుంచే మళ్లీ బరిలో నిలిచారు. గత అనుభవాల దృష్ట్యా నారాయణను నగర ప్రజలు భారీ మెజారిటీ కట్టబెట్టారు. కౌంటింగ్ తొలి రౌండ్ నుంచి నారాయణ మెజారిటీ కొనసాగుతూనే రావడం గమనార్హం.

● ఆదాలను మట్టి కరిపించిన శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు జిల్లా ఫలితాలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తి కనిపించిన నియోజకవర్గం నెల్లూరు రూరల్. మాస్ లీడర్‌గా గుర్తింపు పొందిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మూడవసారి ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేయగా, రాజకీయ చతురుడిగా గుర్తింపు పొందిన ఆదాల ప్రభాకరరెడ్డి ఆయనకు ప్రత్యర్థిగా పోటీ చేయడంతో ఈ ఫలితాలపై సర్వత్రా ఆసక్తి కనిపించింది. విశేషమేంటే జిల్లా పరిధిలో ఈ నియోజకవర్గంపై భారీ ఎత్తున బెట్టింగ్‌లు జరగడమే ఇందుకు నిదర్శనం. పోటీ రసవత్తరంగా జరిగినట్లు కనిపించినా, కొంతమంది పనిగట్టుకొని కోటంరెడ్డికి వ్యతిరేకంగా రకరకాల ప్రచారాలు చేసినా ప్రజలు మాత్రం శ్రీధర్‌రెడ్డి పక్షమే నిలబడ్డారు. 31,971 ఓట్ల భారీ మెజారిటీతో మూడవ సారి కోటంరెడ్డిని రూరల్ ఎమ్మెల్యేగా గెలిపించారు.

● కోవూరులో ప్రశాంతిరెడ్డి ప్రభంజనం

కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి 54,583 ఓట్ల మెజారిటీ సాధించారు. ఈ నియోజకవర్గ చరిత్రలో ఇంత భారీ మెజారిటీ సాధించండి ఇదే తొలిసారి. బలమైన రాజకీయ కుటుంబం నలపరెడ్డి కుటుంబానికి చెందిన సీనియర్ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని భారీ ఓట్ల తేడాతో ఓడించడం మరో రికార్డు. ఎన్నికలకు, రాజకీయాలకు కొత్త అయినా ప్రచారంలో ప్రశాంతిరెడ్డి దూసుకుపోయిన తీరు ప్రజలను బాగా ఆకట్టుకుంది. తెలుగుదేశం గాలికి తోడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులు అభివృద్ధి చేస్తారని, ఆపదల్లో ఆదుకుంటారని ప్రజలు విశ్వసించడం, టిక్కెట్లు దక్కకపోయినా పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, ఆయన వర్గీయులు పనిచేయడం ఈమె విజయానికి కారణాలు.

● సర్వేపల్లిలో సరికొత్త చరిత్ర

ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అనుభవించినంత క్షోభ జిల్లాలో మరే టీడీపీ నాయకుడు అనుభవించి ఉండరు. రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అండ్ కో సామాజిక మాధ్యమాల ద్వారా సోమిరెడ్డిపై పైశాచిక దాడి చేసింది. అనునిత్యం అనుచరిత వ్యాఖ్యలతో మానసికంగా చిత్రవధకు గురిచేసింది. ఈ వేదనలు భరిస్తూనే మరోవైపు కాకాణి అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా సోమిరెడ్డి పోరాటం చేశారు. ఉదయగిరి నారాయణ బలవన్మరణం అయితేనేం, కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్, వరి ధాన్యం ధరల దోపిడీ, ఇసుక, గ్రానైట్ మాఫియాలపై నిరంతరం పోరాటం చేస్తూనే వచ్చారు. నిత్యం సర్వేపల్లి ప్రజల మధ్య గడిపారు. సోమిరెడ్డి కష్టం చూసి కదలిపోయిన సర్వేపల్లి ప్రజలు ఊహికందని మెజారిటీతో ఈయన్ను గెలిపించారు. కాకాణి బృందానికి ఓటుద్వారా సమాధానం చెప్పారు. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి కాకాణి గోవర్ధన్‌రెడ్డి 13,973 ఓట్ల మెజారిటీతో గెలిస్తే ఈ ఎన్నికల్లో 16,288 ఓట్ల తేడాతో కాకాణిని మట్టి కరిపించి సోమిరెడ్డిని సర్వేపల్లి సింహాసనంపై కూర్చోబెట్టారు.

● ఉత్కంఠ నడుమ ఆనం జయకేతనం

ఆత్మకూరు కౌంటింగ్ ఉత్కంఠ నడుమ సాగింది. మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ నియోజకవర్గం నుంచి పోరాడి గెలిచినట్లు అయ్యింది. సామాజికవర్గాల పరంగా వైసీపీకి ఆత్మకూరు బలమైనది. అయినా కూటమి బలం, ఆనం రామనారాయణరెడ్డి వ్యక్తిగత చరిష్మ, వీపీఆర్ కాంబినేషన్లు ఈ నియోజకవర్గంలో బాగా పని చేశాయి. మర్రిపాడు, అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాల కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు వైసీపీ లీడ్‌లో కొనసాగింది. అయితే గతంతో పోల్చితే ఈ మండలాల్లో మెజారిటీ గణనీయంగా తగ్గడంతో ఆనం గెలుపు ఖాయమనే అంచనాకు వచ్చారు. అయినా తెలియని ఉత్కంఠ కొనసాగుతూనే వచ్చింది. 10వ రౌండ్ వరకు వైసీపీ ఆధిక్యత కనిపించింది. ఆ తరువాత ఆనం హవా మొదలయ్యింది. ఈవీఎంల చివరి రౌండ్ ముగిసే సమయానికి ఆనం రామనారాయణరెడ్డి 7,648 ఓట్ల మెజారిటీ సాధించి ఆత్మకూరుపై జయకేతనం ఎగురవేశారు. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి వైసీపీ అభ్యర్థి మేకపాటి గౌతంరెడ్డి 22,276 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

● కావలిలో కృష్ణారెడ్డి ఘన విజయం

వైసీపీ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అవినీతి, అరాచకాలపై తిరుగుబాటు, పోల్‌మేనేజ్‌మెంట్‌లో టీడీపీ అభ్యర్థి దగుమాటి కృష్ణారెడ్డి సమర్థతలు కావలిలో టీడీపీకి భారీ మెజారిటీతో విజయం సాధించిపెట్టాయి. టీడీపీ అభ్యర్థి దగుమాటి కృష్ణారెడ్డి 30,135 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కావలిలో టీడీపీ గెలుపుపై రకరకాల అనుమానాలు వ్యక్తమైనా చివరికి అభ్యర్థి కృష్ణారెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రల సమష్టి కృషితో ఘన విజయం సాధించారు. ఈ నియోజకవర్గం నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి ఈ ఎన్నికల్లో ప్రజల ఆగ్రహం చవిచూడాల్సి వచ్చింది. గత ఎన్నికల్లో ఈయన 14,117 ఓట్ల మెజారిటీతో గెలుపొందగా ఈసారి 30,948 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు.

● ఉదయగిరి కోటపై కాకర్ల జెండా

ఉదయగిరి వైసీపీ కంచు కోటన్నారు. సామాజికవర్గాల వారీగా ఆ పార్టీకి 70 శాతానికిపైగా సంప్రదాయ ఓటర్లు ఉన్నారన్నారు. అది నిజమన్నట్లు గత ఎన్నికల ఫలితాలు అలాగే వచ్చాయి. ఉదయగిరి ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు జరిన ఎన్నికల్లో తెలుగుదేశం కేవలం రెండు పర్యాయాలు మాత్రమే గెలిచింది. వైసీపీకి ఇంత బలమైన నియోజకవర్గంలో అభ్యర్థి కాకర్ల సురేష్ కొత్తవాడు, నియోజకవర్గ మూలలు కూడా తెలియనివాడు ఎలా నెట్టుకొస్తాడోనని అందరూ అనుమానించారు. అయితే ఈ వాదనలన్నీ దూదిపింజల్లా తేలిపోయాయి. కూటమి గాలి ఉదయగిరి ప్రజలను కదిలించివేసింది. కాకర్ల సురేష్ కష్టం, ఇతర ముఖ్యనాయకుల కృషి ఫలించింది. ఎట్టకేలకు అసాధ్యం అనుకున్న పని సుసాధ్యమయ్యింది. 9వేల పైచిలుకు ఓట్లతో గెలుపొందారు. ఉదయగిరి కోటపై తెలుగుదేశం జెండాను ఎగురవేశారు.

● కదం తొక్కిన ఇంటూరి

బలమైన రాజకీయ కుటుంబాల ఆధిపత్యం కొనసాగుతున్న కందుకూరు నియోజకవర్గంలో తొలిసారిగా అడుగుపెట్టిన ఇంటూరి నాగేశ్వరరావు చరిత్ర తిరగరాశారు. రియల్ వ్యాపారాన్ని పక్కనపెట్టి రెండేళ్లుగా జనం మధ్య గడిపిన ఇంటూరిని కందుకూరు ప్రజలు ఆదరించారు. తెలుగుదేశం పార్టీలో ఇంత కాలం చక్రం తిప్పిన బలమైన కుటుంబాల సరసన తను స్థానం సంపాదించుకున్నాడు. తెలుగుదేశం పట్ల కందుకూరు ప్రజల అభిమానం ఏడాదిన్నర క్రితమే బహిర్గతం అయ్యింది. చంద్రబాబు పర్యటన సందర్భంగా పోటెత్తిన జనం అక్కడ టీడీపీ గెలుపు ఖాయమనే అభిప్రాయాన్ని అందరిలో కలిగించాయి. కందుకూరు ప్రజలు ఈ రోజు దానిని నిజం చేశారు. 17,813 ఓట్ల మెజారిటీతో ఇంటూరి నాగేశ్వరరావును గెలిపించారు. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి వైసీపీ అభ్యర్థి 14,936 ఓట్ల మెజారిటీ రాగా ఇప్పుడు టీడీపీకి అంతకన్నా ఎక్కువ వచ్చింది.



వీపీఆర్ దంపతుల విజయదరహాసం

విజయసాయికి ఘోర పరాజయం

రాజ్యసభ సభ్యుడు, వైసీపీలో నెం.2గా గుర్తింపు పొందిన విజయసాయిరెడ్డికి నెల్లూరు పార్లమెంట్ ఎన్నికల్లో ఘోర పరాజయం జరిగింది. కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చేతిలో 2,45,902 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈయనకు 5,20,300 ఓట్లు రాగా వీపీఆర్‌కు 7,66,202 ఓట్లు వచ్చాయి. మొత్తం పోల్ అయిన ఓట్లలో వీపీఆర్‌కు 55.5 శాతం ఓట్లు రాగా విజయసాయికి 38.02 శాతం ఓట్లు మాత్రమే పడ్డాయి.

గర్జించిన ఉద్యోగులు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు ద్వారా వైసీపీకి దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చారు. ఐదేళ్ల పాలనలో తమను బానిసలుగా చూపిన వైసీపీ ప్రభుత్వంపై ఓటుతో గర్జించారు. ఏకంగా మూడొంతల మంది ఉద్యోగులు కూటమి వైపు నిలబడ్డారు. కూటమి అభ్యర్థులకు వచ్చిన ఓట్లలో సగం కూడా వైసీపీ అభ్యర్థులకు దక్కలేదు. జిల్లాలో 24,223 మంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోగా అందులో 16,792 ఓట్లు టీడీపీ అభ్యర్థులకు పడ్డాయి. 7,151 ఓట్లు మాత్రమే వైసీపీకి లభించాయి. సాధారణంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 80 శాతానికి మించి పోలవ్వవు. కానీ ఈ దఫా రాష్ట్రంలోనే అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 95 శాతానికి పైగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగింది.

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాలు...

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	టీడీపీ	వైసీపీ
కందుకూరు	2689	1627	882
కావలి	3635	2265	1068
ఆత్మకూరు	3131	1922	1084
కోవూరు	3210	2320	774
నెల్లూరు సిటీ	3071	2425	449
నెల్లూరు రూరల్	5405	3388	1220
ఉదయగిరి	2827	1810	933
సర్వేపలి	1878	1035	741
మొత్తం	24223	16792	7151

అక్కడ వన్‌సైడ్.. ఇక్కడ ఉత్కంఠ

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టీ నెల్లూరుపైనే.. గత ఎన్నికల్లో వైసీపీ పదికి పది స్థానాలు గెలిచి క్లీన్ స్వీప్ చేయడంతో ఈదఫా ఫలితాలు ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తిగా మారింది. నెల్లూరులోని ప్రియదర్శిని కాలేజీలో ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు ఆరంభం నుంచే అందరూ ఆసక్తిగా గమనించారు. అయితే ఒక గంట సమయం గడిచి రెండు రౌండ్ల ఫలితాలు వెల్లడయ్యే నాటికి అంతా అర్థమైపోయింది. మొదట కొన్ని రౌండ్ల వరకు ప్రస్తుత జిల్లాలోని మొత్తం 8 నియోజకవర్గాల్లో నాలుగు నియోజక వర్గాలు కూటమి వైపు నిలబడగా మరో నాలుగు నియోజకవర్గాల్లో వైసీపీకి అనుకూలంగా ఫలితాలు వచ్చాయి. దీంతో ఉత్కంఠ పెరిగింది. నెల్లూరు సిటీ, కోవూరు, నెల్లూరు రూరల్, కావలి నియోజకవర్గాల్లో మొదటి రౌండ్ నుంచి టీడీపీ తన ఆధిక్యాన్ని కొనసాగించింది. కాబట్టే ఈ నియోజకవర్గాల్లో భారీ మెజారిటీలు నమోదయ్యాయి. ఈ ఫలితాలను గమనించిన వైసీపీ అభ్యర్థులు సగం రౌండ్లు పూర్తయ్యే సరికి కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోయారు. ఇక వారి ఏజెంట్లు కూడా నైరాశ్యంలో మునిగిపోయారు.

● అక్కడ టెన్షన్.. టెన్షన్..

కాగా సర్వేపల్లి, ఆత్మకూరు, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో మాత్రం టెన్షన్ వాతావరణం కనిపించింది. ముందుగా సర్వేపల్లి ఫలితాలు వెల్లడవుతూ వచ్చాయి. పొదలకూరు మండలానికి సంబంధించిన బూత్‌ల కౌంటింగ్ ప్రారంభం కావడంతో తొలి రౌండ్‌లో కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధిక్యం సాధించారు. అయితే రెండో రౌండ్‌లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధిక్యంలోకి వచ్చారు. ఇలా పొదలకూరు మండలం పూర్తయిన తొలి ఐదు రౌండ్ల వరకూ ఆధిక్యం దోబూచులాడింది. కానీ ఆరో రౌండ్ నుంచి సోమిరెడ్డి వెనకకు తిరిగి చూడలేదు. ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యత సాధిస్తూ వచ్చారు. అలానే ఆత్మకూరులోనూ ఉత్కంఠ కొనసాగింది. ఉదయగిరిలోనూ తొలి నాలుగైదు రౌండ్లలో వైసీపీ తన ఆధిక్యాన్ని కొనసాగించింది. కానీ ఆ తర్వాత టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ప్రతి రౌండ్‌లోనూ మెజారిటీ సాధిస్తూ వచ్చారు. కందుకూరులో కూడా ఇదే పరిస్థితి కనిపించింది. తొలి రెండు, మూడు రౌండ్లలో వైసీపీ అభ్యర్థి ఆధిక్యంలో కొనసాగగా ఆ తర్వాత టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పుంజుకున్నారు. ఇక చివరి వరకు ఆయన వెనదిరిగి చూడలేదు.

● తొలి ఫలితం సర్వేపల్లిదే !

కౌంటింగ్ ప్రక్రియను అత్యంత పటిష్ట బందోబస్తు మధ్య నిర్వహించారు. కలెక్టర్ హరినారాయణన్‌తో పాటు అబ్జర్వర్లు, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ అన్ని కేంద్రాల వద్దకు తిరుగుతూ కౌంటింగ్‌ను పర్యవేక్షించారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌ను తెరిచి లెక్కింపు ప్రారంభించారు. అయితే చాలా నియోజకవర్గాల్లో వీటి లెక్కింపు ఆలస్యమైంది. ఎక్కడా వివాదాలు, రీకౌంటింగ్‌లు లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఉదయం 11 గంటలకంతా ఫలితాల ట్రెండ్ అర్థమైపోయింది. సర్వేపల్లి కౌంటింగ్ వేగంగా జరిగింది. నెల్లూరు సిటీ ఫలితం తొలుత వెల్లడవ్వాల్సి ఉన్నప్పటికీ ఆ స్థానంలో సర్వేపల్లి నిలిచింది. మిగిలిన నియోజకవర్గాల్లో సాయంత్రం ఆరు గంటల కంతా ఈవీఎంల లెక్కింపు పూర్తి చేశారు.

హతవిధీ...!!

● మట్టికరిచిన వైసీపీ యోధులు

నెల్లూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలన ప్రజల్లో అశాంతి కలిగించిందో.. సంక్షేమం చాటున జరిగిన దోపిడీ కనికట్టును ప్రజలు పసిగట్టారో..! వైసీపీ నాయకుల తీరువల్ల ఊరు,రాష్ట్రం పాడైపోతోందని భావించారో..! ఏమనుకున్నారో...! ఏమో మహా మహులైన ఆ పార్టీ నాయకులను ఈ ఎన్నికల్లో మట్టి కరిపించారు. మొహం ఎత్తుకోలేని విధంగా ఓడించి కసి తీర్చుకున్నారు.



పోలింగ్ కేంద్రం నుంచి అర్థంతరంగా వెళ్లిపోతున్న విజయసాయిరెడ్డి

అయ్యో.. విజయసాయిరెడ్డి

రాజ్యసభ సభ్యత్వం ఇంకా నాలు గేళ్లు ఉన్నా దాన్ని వదులు కొని పార్ల మెంట్ ఎన్నికల బరిలోకి దిగిన విజయసాయి రెడ్డికి జిల్లాలో ఘోర పరాజయం ఎదురయ్యింది. టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర రెడ్డికి ఈయన దీటైన అభ్యర్థి అనుకున్నారు. విజయ సాయి పోటీలో ఉంటే వైసీపీ నాయకులు, శ్రేణులు ఉత్సాహంగా పనిచేస్తారని అధినాయకత్వం భావించింది. జిల్లాకు చెందినవాడే అయినా ఏనాడు ఎవరికీ ఉపయోగపడని విజయసాయిని జిల్లా ముద్దు బిడ్డగా ప్రజలకు పరిచయం చేస్తూ ప్రచారం చేసుకున్నారు. కానీ ఫలితం దక్కలేదు. కూటమి గాలి ముందు, టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి ప్రజల్లో ఉన్న మంచి పేరు ముందు విజయ సాయిరెడ్డి నిలవలేక పోయారు. వారిద్దరి మధ్య ఉన్న వ్యత్యాసాలను ప్రజలు బేరీజు వేసుకుని ఓటు వేశారు. దీంతో 2.45 లక్షల భారీ మెజారిటీతో వేమిరెడ్డికి పట్టం కట్టారు. ఒక్కటంటే ఒక్క రౌండ్‌లో కూడా విజయసాయికి మెజారిటీ ఇవ్వకుండా ఘోరంగా ఓడించారు.

పాపం ఆదాల:

నెల్లూరు ఎంపీగా ఉన్నారు. అసెంబ్లీకి వెళ్లాలని, అవకాశం ఉంటే మంత్రి కావాలనే ఆశతో నెల్లూరు రూరల్ నియోజక వర్గాన్ని ఎంచుకున్నారు. ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే హడావిడి చేశారు. చిన్న చిన్న అభివృద్ధి పనులు చేసి ప్రజల మనసు గెలుచుకోవాలనుకున్నారు. కానీ ప్రయోజనం కనిపించలేదు. వయస్సు మీద పడుతున్న తరుణంలో మంత్రిగా రాజకీయ జీవితానికి విరామం ప్రకటించాలనుకున్న ఆయన ఆశ నెరవేరలేదు. ఓటమి బాధతో రాజకీయ విరామం ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

హ్యాట్రిక్ అనుకున్నాడు.. ప్రజలు రెస్ట్ ఇచ్చారు

కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలి నుంచి ఈ సారి కూడా గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గుర్తింపు పొందాలనుకున్నారు. కానీ, ఆయనను ప్రజలు ఓడించి రెస్ట్ ఇచ్చారు. జిల్లాలో అతిపెద్ద అవినీతి ప్రజాప్రతినిధిగా ఈయన నిందలు మోశారు. తన వేధింపులకు తెలు గుదేశం కార్యకర్తలు ఆత్మహత్యలు చేసుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. నియోజకవర్గం లో పిడికెడు మట్టి కావాలన్నా, బండెడు ఇసుక కావాలన్నా, ఇల్లు కొనాలన్నా, అమ్మాలన్నా అన్నింటికి ఆయనకు ముడుపులిచ్చుకోవాల్సిందే. పదేళ్లుగా ఇలాంటివి చూసి విర్తకి చెందిన కావలి ప్రజలు దగుమాటిని దరిచేర్చుకున్నారు.

కాకాణి కల చెదిరే..!

వైసీపీలో బలమైన నాయకుడు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2014, 2019 ఎన్నికల్లో గెలిచారు. రెండున్నరేళ్లు మంత్రిగా పని చేశారు. కానీ జిల్లాకు చేసిన మేలు ఏమి లేదు. ప్రాజెక్టులు తేలేదు సరికదా కొండలు కొల్ల గొట్టాడన్న విమర్శలు మూటకట్టుకున్నారు. ఎదురు తిరిగిన కార్యకర్తలను, ప్రజలను కేసులతో వేధించారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. టోటల్‌గా ఎన్నికల సమాయానికి డబ్బు మనిషిగా పేరు తెచ్చుకున్నారు. ఇవన్నీ కలిసి సర్వేపల్లికి శాశ్వత ఎమ్మెల్యేగా ఉండిపోవాలనుకున్న ఆయన కలను చెరిపేశాయి. కాకాణి తీరుతో కలత చెందిన జనం సోమిరెడ్డికి జై కొట్టారు.

మేకపాటికి పరాభవం

మేకపాటి కుటుంబానికి గతంలో ఒక ఎంపీ, రెండు ఎమ్మెల్యే పదవులు ఉండేవి. 2019 ఎన్నికలు వచ్చే సరికి రాజమోహన్‌రెడ్డి ఎంపీ సీటు పోయింది. కుమారుని మరణంతో దక్కిన మంత్రి పదవి పోయింది. ఈ ఎన్నికలకు ముందు ఎమ్మెల్యేగా ఉన్న తమ్ముడు చంద్రశేఖర్‌రెడ్డి దూరమయ్యాడు. ఉదయగిరి టిక్కెట్టు కష్టపడి తెచ్చుకోవాల్సి వచ్చింది. అయినా ప్రయోజనం దక్కలేదు. ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలు రెండింటిలోనూ మేకపాటి కుటుంబీకులు ఓటమి పాలయ్యారు. దశాబ్దాల కాలం శాసనసభ, పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహించిన ఈ కుటుంబానికి ఈ సారి ఎక్కడా చాన్స్ లేకుండా పోయింది. మేకపాటి కుటుంబం రాజకీయ ప్రతిష్ఠ మసకబారిపోయింది.

నల్లపరెడ్డికి కోలుకోలేని దెబ్బ

నల్లపరెడ్డి కుటుంబానికి జిల్లాలో ఎంతో పేరుంది. ఆ కుటుంబ వారసుడిగా కోవూరును కేంద్రంగా చేసుకొని ప్రసన్నకుమార్‌రెడ్డి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. పలుసార్లు ఇక్కడి నుంచి గెలిచి పట్టు నిరూపించుకున్నారు. ఈ సారి కూడా గెలుపు తనదే అనుకున్నారు. ఊహించని విధంగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎదురయ్యింది. ఇంతకాలం పెత్తనం చేసిన వైసీపీ నాయకులపై కసి, కోపాన్ని ఓటు రూపంలో ప్రదర్శించుకునే అవకాశం ప్రజలకు దొరికింది. భారీ ఓట్ల తేడాతో ఓటమి అనివార్యం అయ్యింది. ఈ ఎన్నికల వరకే ఈ ప్రమాదం అనుకోవడానికి వీలు లేదు. ఇక ఈయన రాజకీయ జీవితం అంతా అన్ని విధాలా బలవంతులు, సమాజంలో మంచి వారుగా గుర్తింపు పొందిన వీపీఆర్ కుటుంబంతో తలపడాల్సి ఉంటుంది.

ప్రసన్నుడి గోశాలలో గడ్డివామి దగ్ధం

బిట్రగుంట, జూన్ 4: బోగోలు మండలం కొండబిట్ర గుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ గోశాలలోని గడ్డివామి మంగళవారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతైంది. ఆలయం పడమరవైపు దిగువన పొగతో కూడిన మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు కావలి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందచేశారు. ఈలోగా కొందరు స్థానికులు మంటలు అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న ఆలయ ఈవో రాధాకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 40 వేల వరకు నష్టం జరిగి ఉంటుందని ఈవో తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది చొరవతో మంటలు ఆర్పారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాక సిబ్బంది

బెట్టింగ్ రాయుళ్ల బెంబేలు

వరికుంటపాడు, జూన్ 4: ఎన్నికల చదరంగంలో రాజకీయ క్రీడను ముందస్తుగా ఊహించని బెట్టింగ్‌రాయుళ్లు మంగళవారం విడుదలైన ఫలితాలతో బెంబేలెత్తిపోయారు. తమ పార్టీలు, అభ్యర్థులపై ఉన్న అభిమానంతో మండలంలోని పలు గ్రామాల నుంచి రూ.లక్షల్లో బెట్టింగులకు సై అంటూ కొంతమంది ముందుకు దూకారు. ఎన్నికల అనంతరం కొంతమేర స్తబ్దుగా ఉన్నా ఎగ్జిట్ పోల్స్ విడుదల నుంచి బెట్టింగుల పర్వం మరింత జోరందుకుంది. అయితే అధిక శాతం సర్వేలు కూటమి వైపు మొగ్గు చూపడంతో ఆ పార్టీలకు అనుకూలంగా ఉన్న కార్యకర్తలు, నాయకులతో పాటు సామాన్యులు సైతం జై కొడుతూ బెట్టింగులకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో అధికారపార్టీ నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకు చేసిన ఊకదంపుడు ప్రగల్భాలతో పాపం ఆ పార్టీకి చెందిన సానుభూతిపరులే బలయ్యారు. వారికి తోడు అనుకూల సర్వేల మాయ మాటలు సైతం నమ్మిన కొంతమంది అధికార పార్టీనే తిరిగి విజయం సాధిస్తుందనే అపోహతో బెట్టింగులకు దిగి జేబులు ఖాళీ చేసుకున్నారు. అందులోనూ ఆ పార్టీలో కీలకంగా వ్యవహరించే కొంతమంది ఒక్కొక్కరుగా రూ.లక్ష నుంచి రూ.20లక్షల పైబడి వరకు బెట్టింగులు పెట్టి ఆర్థికంగా నష్టపోయారు. తమ పార్టీ నాయకుల మాటలు నమ్మి మోసపోయామంటూ లోలోన మదనపడుతున్నారు. విషయం బయటకు తెలిస్తే ఎక్కడ పరువు పోతుందోననే బెంగతో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా మౌనం వహిస్తున్నట్లు తెలిసింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	156
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	274
స్కిన్‌లెస్	304
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6857
వెండి కిలో ధర	రూ. 91,200
వెండి ఒక గ్రాము	రూ. 93.20

జోరుగా మద్యం విక్రయాలు

ఉదయగిరి రూరల్, జూన్ 4: ఉదయగిరి ప్రాంతంలో మంగళవారం అనధికారిక మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అధికారులు మద్యం దుకాణాలను మూసివేశారు. అయితే మద్యం బెల్టుషాపుల నిర్వాహకులు ముందుగానే షాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి నిల్వ చేసుకొన్నారు. షాపుల మూతపడడంతో మద్యం కోసం మందుబాబులు బెల్టుషాపులను ఆశ్రయించారు. నిర్వాహకులు ఒక్కో బాటిల్‌పై రూ.100 నుంచి రూ.150లు అదనంగా నగదును తీసుకున్నారు. ప్రధానంగా కూల్‌డ్రింక్స్ దుకాణాలు, నిర్మానుష్య ప్రాంతాల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. అనధికార మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నా సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరించడంపై పలువురు విమర్శలకు తావిస్తోంది.

ప్రమాదంలో ప్రకృతి

- కలుషితం చేస్తున్న రసాయనాలు
- నిబంధనలు గాలికొదిలేస్తున్న పరిశ్రమలు
- థర్మల్ కేంద్రాలతో పెరిగిన ఉష్ణోగ్రత
- ఇబ్బడిముబ్బడిగా వాహనాలు
- మేల్కొనకుంటే పెనుముప్పే!
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం



నెల్లూరు(వైద్యం), జూన్ 4 : విలాసవంతమైన జీవితం కోసం మానవులు చేసే తప్పిదాలు, పరిశ్రమలు నిబంధనలు పాటించకపోవడం వంటివి పర్యావరణానికి పెనుముప్పుగా మారుతున్నాయి. ఆధునిక సాంకేతికత, పారిశ్రామికీకరణ ముసుగులో ప్రకృతి వినాశనానికి పాల్పడు తుండటంతో ఏడాదికేడాదికి జీవుల మునగడ ప్రశ్నార్థక మవుతోంది. ప్రభుత్వాలు కూడా ఇలాంటి విధ్వంసకాలకు కొమ్ముకాస్తూ అవినీతికి పాల్పడటంతో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోంది. పర్యావరణానికి జరుగు తున్న హాని వల్ల జంతుజాలానికి ఆహారం దొరకని పరిస్థితి దాపురిస్తోంది.

వాతావరణంలో మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, గతి తప్పిన రుతువులు, సునామీలు, వరదలు, కరువులతో జీవావరణ సమతుల్యత లోపం, నీరు, గాలి, భూమి కలుషితం కావడం ప్రజారోగ్యం ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ దెబ్బతినడానికి కారణలవుతున్నాయి. కాలుష్యం, చెట్ల నరికివేత, సహజ నిక్షేపాల వెలికితీత వంటివి భూమిని మరింతగా కుంగదీస్తున్నాయి. పర్యవసానంగా భూకంపాలు, సునామీలు విరుచుకుపడుతున్నాయి. భూమికి కవచంలా ఉన్న ఓజోన్ పొర దెబ్బతింటోంది. భూమి, నీరు, గాలి కాలుష్యానికి గురవుతూ ప్రాణాలనే హరిస్తున్నాయి. కళ్ల ముందే ఇన్ని అనర్థాలు జరుగుతున్నా మనిషిలో మార్పు రావటం లేదు. ప్రాణ వాయువును అందించే మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదు. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి 1972 నుంచి పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించింది. ఏటా జూన్ 5వతేదీన పర్యావరణ దినోత్సవం జరుపుకోవాలని తీర్మానించింది.

జిల్లాలో పరిశ్రమలు ఎక్కువే..

జిల్లాలో ఒకప్పుడు 10లోపు పరిశ్రమలు ఉండేవి. వాటిలోనూ పర్యావరణ నిబంధనలు పాటించటంతో పర్యావరణానికి పెద్దగా ముప్పు వాటిల్లలేదు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. తీర ప్రాంతం మొత్తం పరిశ్రమల హబ్‌గా మారింది. ముత్తుకూరు నుంచి రామాయ పట్నం దాకా 80 కి.మీ విస్తరించి ఉన్న తీరంలో 13 కిలోమీటర్ల పరిధిలోనే 15 థర్మల్ విద్యుత్ పరిశ్రమలు నిర్మిస్తున్నారు. వీటిలో కొన్ని ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. ఆయా పరిశ్రమల నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో 2 నుంచి 5 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగి పంటల దిగుబడి 30 శాతం తగ్గుతోంది. ఈ నేపథ్యంలో ఆక్వా పరిశ్రమమే కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. థర్మల్ విద్యుత్ కేంద్రాల వల్ల రోజుకు 2 లక్షల టన్నుల బూడిద వెదజల్లబడి తాగునీరు కలుషితం అవుతోంది. థర్మల్ కేంద్రాల వల్ల పెరిగిన వేడి వల్ల సముద్రంలోని వేల టన్నుల రొయ్యలు, చేపలు చనిపోయి మత్స్యకారులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. ఇక వాహన కాలుష్యం, ధూళి వల్ల ప్రజలు శ్వాసకోశ సంబంధ వ్యాధులకు గురవుతున్నారు. గతంలో 42 డిగ్రీలకే అల్లాడిపోయిన జిల్లా ప్రజానీకం ఈ ఏడాది వేసవిలో సుమారు 46 డిగ్రీల వరకు ఎండను చవి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీటికితోడు ఫ్రిజ్‌లు, ఏసీల వాడకం పెరగడంతో క్లోరోఫ్లోరో కార్బన్ వాతావరణంలోకి వెదజల్లబడి ఓజోన్ పొరను దెబ్బతీస్తున్నాయి. వీటికితోడు విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం కూడా ప్రకృతికి పెద్ద సమస్యగా మారుతోంది. ప్రభుత్వ చర్యలకుతోడు ప్రజలు కూడా స్వచ్ఛందంగా పర్యావరణ పరిరక్షణ బాధ్యత వహించకపోతే భవిష్యత్తులో పెను ప్రమాదాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం



జిల్లాలో ఏర్పాటు చేసిన పరిశ్రమలు తప్పని సరిగా నిబంధనలు పాటించాలి. లేదంటే శాఖాపరమైన చర్యలు తప్పవు. ప్రతి పరిశ్రమలో 30 శాతం గ్రీన్ బెల్ట్ ఉండాలి. ఇందుకోసం మొక్కలు పెంచాలి. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఒక్కరు ప్రకృతి ప్రేమికులుగా మారి మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఏ పరిశ్రమకైనా అనుమతులు ఇచ్చే సమయంలో కాలుష్య నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రజల్లోనూ పర్యావరణంపై చైతన్యం తీసుకు వచ్చేలా కృషిచేస్తున్నాం.

\- సీహెచ్ రాజశేఖర్, కాలుష్య నియంత్రణశాఖ ఈఈ

వెండి నందిసేవపై ఆది దంపతుల వైభోగం

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 4: మండలంలోని జొన్నవాడ ఆలయం లో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి మంగళవారం పెద్ద వెండి నంది వాహనంపై ఊరేగు తూ భక్తులకు దర్శనమిచ్చారు. అత్యంత వైభవంగా సాగిన వెండి నందిసేవ ఊరేగింపులో స్వామి, అమ్మవార్లకు స్థానిక భక్తులు అడుగడుగునా నివేదనలు సమర్పించారు. ఉదయం గిన్నెభిక్ష గ్రామోత్సవంలో మల్లికా ర్జున స్వామికి భక్తులు బియ్యం, దక్షిణాతాంబూలం సమర్పించుకున్నారు. భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ వి గిరికృష్ణ ఉత్సవాలను పర్యవేక్షించారు.



పెద్ద వెండి నంది వాహనంపై ఊరేగుతున్న మల్లికార్జునస్వామి, కామాక్షితాయి

కనువిందు చేసిన పుష్పాలంకరణ

బ్రహ్మోత్సవాలలో మంగళవారం సాయంత్రం నెల్లూరుకు చెందిన నూనె మల్లికార్జున యాదవ్ ఆలయంలోని గర్భాలయం, అంతరాలయం, ముఖ మండపం ఆలయం వెలుపల, ప్రధాన ద్వారాలకు సువాసనలు వెదజల్లే పలురకాల ప్రత్యేక పుష్పాలంకరణ భక్తులకు కనువిందు చేసింది.

బ్రహ్మోత్సవాలలో నేడు

బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం మల్లికార్జునస్వామి, కామాక్షితాయి రథోత్సవం వైభవంగా జరగనుంది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలి రానున్నారు. రాత్రి గజ సింహ వాహనోత్సవాలు జరగనున్నాయి.

వైభవంగా కోదండరామస్వామి గ్రామోత్సవం

సంగం, జూన్ 4: రామచంద్రాపురం కోదండరామస్వామిని మంగళవారం భక్తులు, గ్రామస్థులు అశ్వవాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు చేపట్టిన స్వామిఅమ్మవారికి కల్యాణంలో భక్తులు పాల్గొన్నారు.



పశువైద్యం గాల్లో దీపం

● వేధిస్తున్న వైద్యుల కొరత ● పాడిరైతుల అవస్థలు

తోటపల్లిగూడూరు, జూన్ 4 : మండలంలో పశు వైద్యం గాల్లో దీపంలా మారింది. ఆసుపత్రుల్లో వైద్యుల కొరత కారణంగా పశువైద్యం అందక పాడి రైతులు అవస్థలు పడుతున్నారు. నిధుల కొరతతో పాడిరైతులకు కనీసం మందులు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామని పశు వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ ప్రధానమైంది. జిల్లాలో వ్యవసాయ ఆదాయం మొదటిగా ఆతర్వాత స్థానంలో పాడిపరిశ్రమ ఉంది. పాడి పరిశ్రమను పరిరక్షించడంలో, పశువైద్యాన్ని సమర్థవంతంగా అందించడంలో ప్రభుత్వంతో పాటు పశు సంవర్ధక శాఖ విఫలమైనట్లు విమర్శలున్నాయి. జిల్లావ్యాప్తంగా చూస్తే వైద్యుల పోస్టులు, అసిస్టెంట్ పోస్టులు, అటెండరు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. సాధారణంగా ప్రతి రెండు గ్రామాలకు పశువైద్య ఉపకేంద్రాలు ఉండాలి. మండలకేంద్రానికి ఒక ప్రధాన కేంద్రం ఉండాలి. అదేవిధంగా ఉపకేంద్రాల్లో ఒక అసిస్టెంట్ డాక్టర్, కాంపౌండర్ ఉండాలి. ప్రధాన కేంద్రంలో డాక్టర్, అసిస్టెంట్ డాక్టర్, అటెండర్, కాంపౌండర్ అందుబాటులో ఉండాలి. అయితే మండలంలో ఈ పరిస్థితి కనపడడంలేదు. 22 పంచాయతీలు ఉన్నా రెండు మాత్రమే కేంద్రాలు, మిగతావన్నీ ఉపకేంద్రాలుగా ఉన్నాయి. వైద్యుల కొరత కారణంగా కొన్ని కేంద్రాల్లో అటెండర్లు పశువైద్యం చేస్తున్నారు. కొత్తపాలెం, వెంకన్నపాలెం, విలుకానిపల్లి, కోడూరు, చింతోపు, నరుకూరు తదితర గ్రామాల్లో ప్రైవేటు వైద్యులైన గోపాలమిత్ర వైద్యులే ఆయా గ్రామాల్లో పర్యవేక్షించి పశువులకు వైద్యం చేస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో సరిపడినన్ని మందులు ఉండడం లేదు. దీంతో బయట మందులు తెచ్చుకుని వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువైద్యం అందించాలని పాడి రైతులు కోరుతున్నారు.

నెల్లూరు (హరనాథపురం), జూన్ 4 : నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ పదవికి

ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ పదవికి కామిరెడ్డి రాజీనామా

కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మంగళవారం రాజీనామా చేశారు. రాజీనామా ప్రతిని సహకారశాఖ రాష్ట్ర కమిషనర్‌కు పంపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామాచేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది.

సోమశిలలో 7.344 టీఎంసీల నీరు నిల్వ



అనంతసాగరం, జూన్ 4: సోమశిల డ్యాం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు మంగళవారానికి 7.344 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

సీతాలమ్మకు పొంగళ్లు

బిట్రగుంట, జూన్ 4: బోగోలు మండలం కడనూతల దళితవాడలో గ్రామదేవత సీతాలమ్మకు పొంగళ్ల కార్యక్రమాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేళతాలాలు, మంగళవాయిద్యాలు, తప్పెట్లతో ఉదయం గ్రామ సద్ది కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం గ్రామంలోని ప్రతి ఇంటింటి నుంచి మహిళలు పొంగళ్లను అమ్మవారి సన్నిధికి చేర్చి నైవేద్యంగా సమర్పించారు.

నీట్‌లో 'రత్నం' విజయం

నెల్లూరు (విద్య), జూన్ 4 : డాక్టర్ కిషోర్స్ రత్నం మెడికల్ అకాడమీ విద్యార్థులు 2024 నీట్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించారని ఆ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ కృష్ణకిషోర్ తెలిపారు. నగరంలోని ఆ విద్యా సంస్థలో మంగళవారం ఏర్పాటు అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాము మెడికల్ అకాడమీ ప్రారంభించిన తొలి ఏడాదిలోనే విద్యార్థులు నీట్ ఫలితాల్లో సత్తాచాటారన్నారు. తమ విద్యార్థిని సీహెచ్ నాగసింధు 646 మార్కులు, వీ సాయినిత్యశ్రీ 626, డీ శరణ్య 556, ఏ తన్మశ్రీ 526, వై బింధు 522, ఎం తిలగవతి 476 మార్కులు సాధించారన్నారు. అత్యుత్తమ విద్యావిధానంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని, మున్ముందు మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు వాసంతి కిషోర్, రోషిణి, జీఎం రామ్మూర్తినాయుడు, ప్రిన్సిపాల్ కేవీడీ మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న జీఎం, అకాడమీ సిబ్బంది

కలిగిరిలో దుకాణాల మూత

కలిగిరి : పోలీసుశాఖ ఆదేశాలతో పట్టణంలో మంగళవారం దుకాణాలు మూతపడ్డాయి. ఓట్లలెక్కింపు నేపథ్యంలో పోలీసులు ప్రతి దుకాణానికి వెళ్లి దుకాణాలు మూసివేసి శాంతిభద్రతలకు సహకరించాలని కోరారు. ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో తహసీల్దారు కార్యాలయం, కలిగిరమ్మ కూడలిలో పికెట్ ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంలో ప్రధాన రహదారి ఉదయం నుంచి నిర్మానుష్యంగా మారింది.



నిర్మానుష్యంగా ఉన్న కలిగిరి-వింజమూరు రహదారి

కలగా మిగిలిన కృష్ణపట్నం బీచ్ పర్యాటక అభివృద్ధి..!

ముత్తుకూరు, జూన్ 4 : దేవతలు నిర్మించిన ఆలయంగా ప్రసిద్ధి చెందిన పురాతన సిద్ధేశ్వరాలయం. సురక్షితమైన సముద్రతీరం. మార్గ మధ్యంలో లైట్‌హౌస్. ఈ ప్రాంతాన్ని సర్వాంగసుందరంగా అభివృద్ధి చేసి పర్యాటక ప్రదేశంగా మారుస్తామని ప్రజాప్రతినిధులు గుప్పించిన హామీలు మాటలకే పరిమితమయ్యాయి. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న కృష్ణపట్నం బీచ్ పర్యాటక అభివృద్ధి కలగా మారుతోంది. ఇరవై ఏళ్లుగా కృష్ణపట్నం బీచ్‌ని పర్యాటక ప్రదేశంగా మారుస్తామని, ఈ ప్రాంతంలో పర్యటించిన ముఖ్యమంత్రులు, మంత్రులు హామీలు ఇస్తూనే ఉన్నారు. కృష్ణపట్నం సముద్ర తీరం సురక్షిత ప్రాంతంగా ప్రసిద్ధి. ఆదివారాలు, పండుగ సమయాల్లో పలు ప్రాంతాల నుంచి సందర్శకులు సముద్ర స్నానాలకు కృష్ణపట్నం తీరానికి వస్తుంటా రు. శివరాత్రి సమయంలో ప్రసిద్ధి చెందిన సిద్ధేశ్వరాలయంతోపాటు, కృష్ణపట్నం సముద్ర తీరానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. జిల్లా కేంద్రం నుంచి కేవలం 26 కిలోమీటర్లు దూరం ఉండడం, నిరంతరం బస్సు సౌకర్యం ఈప్రాంత పర్యాటక అభివృద్ధికి అవకాశాలు అధికంగా ఉన్నాయి. మరి ఎందుకనో పాలకులు కృష్ణపట్నం పర్యాటక అభివృద్ధిపై సీతకన్ను వేశారు. గతంలో కృష్ణపట్నం బీచ్ పర్యాటక అభివృద్ధికి అంచనాలు సిద్ధం చేశారు. నిధులు మంజూరే ఆలస్యం అనుకునే పరిస్థితిలో అభివృద్ధి కాస్త అందలం ఎక్కింది. అప్పటి నుంచి కృష్ణపట్నం బీచ్ అభివృద్ధిని పట్టించుకునే వారు కరువయ్యారు. జిల్లాలో లైట్‌హౌస్ ఉన్న ప్రాంతాల్లో కృష్ణపట్నం తీరం ప్రధానమైంది. కృష్ణపట్నం గ్రామం వరకు ఇప్పటికే రహదారి సౌకర్యం ఉంది. గ్రామంలో నుంచి బకింగ్‌హాం కాలువ మీదుగా రెండు కిలోమీటర్లు గ్రావెల్ రోడ్డులో ప్రయాణిస్తే కృష్ణపట్నం సముద్ర తీరం చేరుకోవచ్చు. కొద్దిపాటి వసతులు కల్పించి, తీరం వద్ద సౌకర్యాలు ఏర్పాటుచేస్తే పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. తద్వారా స్థానికులకు ఉపాధి కలిగే అవకాశాలు మెరుగవుతాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి కృష్ణపట్నం బీచ్ పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

● హామీలకే పరిమితం



కృష్ణపట్నం తీరంలో సందర్శకుల కోలాహలం (ఫైల్)



ప్రసిద్ధిగాంచిన కృష్ణపట్నంలోని మునుపు సిద్ధేశ్వరస్వామి ఆలయం

స్పోర్ట్స్

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు ● బుధవారం 5 జూన్ 2024

అయ్యో.. జొకో

గాయంతో ఫ్రెంచ్ ఓపెన్ నుంచి అవుట్

సెమీస్‌కు గాఫ్, స్వియటెక్




పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో అనూహ్య పరిణామం. 25వ గ్రాండ్‌స్లామ్ వేటలోనున్న పురుషుల డిఫెండింగ్ చాంప్, వరల్డ్ నెంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ టోర్నీ నుంచి వైదొలిగాడు. కుడి మోకాలి గాయం కారణంగా జొకో క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ ఆడడం లేదని నిర్వాహకులు మంగళవారం ప్రకటించారు. ఫ్రాన్సిస్కోతో జరిగిన ప్రీక్వార్టర్స్ పోరును అతికష్టమ్మీద నెగ్గిన జొకోవిచ్.. ఆ మ్యాచ్‌లో పలుమార్లు ఇబ్బందిపడ్డాడు. ఈ క్రమంలో నొప్పితోనే ఆ మ్యాచ్‌ను కొనసాగించిన జొకో.. చివరకు ఐదుసెట్ల పాటు పోరాడి గట్టెక్కాడు. మ్యాచ్ తర్వాత ఎమ్ఆర్ఐ స్కానింగ్ తీయించగా, గాయమైనట్లు బయటపడింది. దీంతో జొకోతో క్వార్టర్‌ఫైనల్స్‌లో తలపడాల్సిన కాస్పర్ రూడ్ వాకోవర్‌తో నేరుగా సెమీఫైనల్ చేరాడు. క్వార్టర్స్‌కు ముందే నిష్క్రమించడంతో జొకోవిచ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తన నెంబర్‌వన్ స్థానాన్ని రెండోసీడ్ జానిక్ సిన్నర్‌కు కోల్పోనున్నాడు. ఇక, సిన్నర్ 6-2, 6-4, 7-6(3)తో దిమిత్రోవ్‌ను చిత్తుచేసి సెమీఫైనల్‌కు దూసుకెళ్లగా.. జ్వెరెవ్ 4-6, 6-1, 5-7, 7-6(2), 6-2తో హోల్గర్ రూన్‌ను ఓడించి క్వార్టర్స్ చేరాడు. మహిళల సింగిల్స్‌లో టాప్‌సీడ్ స్వియటెక్, మూడోసీడ్ కొకొ గాఫ్ సెమీఫైనల్లో అమీతుమీకి సిద్ధమయ్యారు. క్వార్టర్‌ఫైనల్స్‌లో స్వియటెక్ 6-0, 6-2తో ఐదోసీడ్ వొండ్రుసోవాను ఓడించగా.. గాఫ్ 4-6, 6-2, 6-3తో 8వ సీడ్ జెబ్యూర్‌పై విజయం సాధించింది.

వేటకు వేళాయె!

టీ20 ప్రపంచకప్‌లో తొలి పోరుకు భారత్ సై

నేడు ఐర్లాండ్‌తో ఢీ

రాత్రి 8 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



రోహిత్

న్యూయార్క్: భారత క్రికెట్ అభిమానులంతా ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న తరుణం రానేవచ్చింది. టీ20 ప్రపంచకప్ గ్రూప్ 'ఎ'లో భాగంగా బుధవారం తమ తొలి మ్యాచ్‌ను ఐర్లాండ్‌తో ఆడనుంది. 2007లో తొలి ప్రపంచకప్‌ను అందుకున్నాక భారత జట్టుకు ఈ మెగా టోర్నీ ఊరిస్తూనే ఉంది. కెప్టెన్ రోహిత్, విరాట్ కోహ్లీలాంటి అనుభవజ్ఞులు.. సూర్యకుమార్, పంత్, బుమ్రాలాంటి యువ ఆటగాళ్ల సహకారంతో ఈసారైనా కప్‌ను ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. ఇక తాజా టోర్నీలో చిన్న జట్లు అద్భుతంగా పోరాడుతున్న సమయంలో ఐర్లాండ్‌ను తక్కువగా అంచనా వేయడానికి లేదు. అలాగే ఈ జట్టుకు గతంలో పెద్ద జట్లకు షాకిచ్చిన అనుభవం కూడా ఉంది. ఆసీస్‌లో జరిగిన చివరి వరల్డ్‌కప్‌లో ఈ జట్టు ఇంగ్లండ్‌ను ఓడించింది. అలాగే ఇటీవల పాక్‌ను కూడా మట్టికరిపించింది. బల్బిర్నీ, స్టిర్లింగ్, వికెట్ కీపర్ టక్కర్‌లతో పాటు పేసర్ జోషువా లిటిల్ జట్టులో కీలక ఆటగాళ్లు. అటు స్థానిక నసౌ కౌంటీ క్రికెట్ స్టేడియంలో డ్రాప్ ఇన్ పిచ్ ఎలా స్పందిస్తుందనేది ఇరు జట్లకు సవాల్‌గా మారింది. ఐపీఎల్ మాదిరి ఇక్కడ బ్యాటర్లు చెలరేగుదామనుకుంటే బోర్లా పడక తప్పదు. మంగళవారం దక్షిణాఫ్రికా-శ్రీలంక మధ్య జరిగిన మ్యాచ్ ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఐర్లాండ్‌తో ఆడిన ఏడు టీ20ల్లోనూ భారత్ గెలిచింది.



స్టిర్లింగ్

ఓపెనింగ్ ఎవరో?: ఈ టోర్నీలో భారత్ ఓపెనర్లుగా ఎవరిని బరిలోకి దింపుతారనేది చర్చనీయాంశంగా మారింది. కోచ్ ద్రవిడ్ ఈ విషయమై స్పష్టత ఇవ్వకపోయినా.. రోహిత్‌కు జతగా కోహ్లీని ఆడించే అవకాశం ఉంది. అలా జరిగితే జైస్వాల్ బెంచీకే పరిమితమవుతాడు. ఐపీఎల్ ఫామ్‌ను విరాట్ ఇక్కడా కొనసాగిస్తే జట్టుకు లాభమే. వికెట్ కీపర్‌గా పంత్ ఆడడం ఖాయమే. సూర్యకుమార్‌తో పాటు శివమ్ దూబే, హార్దిక్ మిడిలార్డర్‌లో రానున్నారు. ఇక్కడి పిచ్ స్పిన్‌కు అనుకూలించనుండడంతో లెఫ్టామ్ స్పిన్నర్లు జడేజా, అక్షర్‌లతో పాటు కుల్దీప్‌ను సైతం ఆడించనున్నారు. అయితే బుమ్రాకు జతగా రెండో పేసర్‌గా సిరాజ్, అర్ష్‌దీప్‌లలో ఎవరిని ఎంపిక చేయాలనే డైలమాలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది. హార్దిక్ మూడో పేసర్‌గా సేవలందించనున్నాడు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, పంత్, సూర్యకుమార్, దూబే, హార్దిక్, జడేజా, అక్షర్, కుల్దీప్, బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్.

ఐర్లాండ్: బల్బిర్నీ, స్టిర్లింగ్ (కెప్టెన్), టక్కర్, టెక్టర్, కాంఫర్, డాకెరెల్, డిలానీ, అడెయిర్, మెక్‌కార్తి, యంగ్, లిటిల్.

పిచ్, వాతావరణం: పిచ్ స్పందనపై అనిశ్చితి కొనసాగుతోంది. చివరి మ్యాచ్‌లో శ్రీలంక 77 పరుగులకు కుప్పకూలింది. అటు సఫారీలు కూడా ఇబ్బందిపడ్డారు. స్పిన్, పేస్‌కు కూడా అనుకూలించడం సానుకూలాంశం.

ప్రణయ్‌కు రజావత్ షాక్

'ఇండోనేసియా'లో గాయత్రి జోడీ ముందంజ

జకార్తా: ఇండోనేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ హెచ్ఎస్ ప్రణయ్‌కు చుక్కెదురైంది. భారత్‌కే చెందిన యువ ఆటగాడు ప్రియాన్షు రజావత్ 21-17, 21-12తో మాజీ వరల్డ్ నెంబర్‌వన్ ప్రణయ్‌కు షాకిచ్చి రెండోరౌండ్ చేరాడు. మరో ఆరంభ రౌండ్ పోరులో లక్ష్యసేన్ 21-12, 21-17తో కెంటా సునెయామ (జపాన్)ను ఓడించాడు. ఇతర భారత షట్లర్లలో మహిళల డబుల్స్ ద్వయం గాయత్రి/ట్రీసా జాలీ, మిక్స్‌డ్ జోడీ సుమిత్/సిక్కి రెడ్డి ప్రత్యర్థులపై గెలిచి రెండోరౌండ్లో ప్రవేశించారు.

విహారికి ఎన్‌ఓసీ!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రంజీ జట్టు ఎంపికపై ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)-క్రికెటర్ హనుమ విహారి మధ్య గత సీజన్‌లో జరిగిన వివాదం గుర్తుందిగా! అప్పటి నుంచి తాను వేరే రాష్ట్రానికి ఆడతానని, ఇందుకోసం ఎన్‌ఓసీ (నిరభ్యంతర పత్రం) ఇవ్వాలంటూ రెండు నెలల్లో విహారి నాలుగుసార్లు ఈమెయిల్స్ పంపించినా స్పందించని ఏసీఏ.. ఏపీలో ఎన్నికల ఫలితాల్లో వైసీపీ పార్టీ ఘోరంగా ఓడడంతో ఒక్కసారిగా దిగొచ్చింది. ఈనెల 3వ తేదీన ఎన్‌ఓసీ జారీ చేసినట్టు లేఖ తయారు చేసి, విహారికి పంపించింది. కాగా, ఏపీ ఎన్నికల్లో గెలిచిన ఎన్డీఏ కూటమికి 'ఎక్స్'లో అభినందనలు తెలిపిన విహారి.. 'కర్మ ఎవరినీ ఉపేక్షించదు' అని పోస్ట్ చేయడం గమనార్హం.

ఐదేసిన ఫరూఖీ

● అఫ్ఘానిస్థాన్ శుభారంభం

● 125 పరుగులతో ఉగాండా చిత్తు



ప్రావిడెన్స్ (గయానా): టీ20 వరల్డ్‌కప్‌ను అఫ్ఘానిస్థాన్ ఘన విజయంతో ఆరంభించింది. రహ్మానుల్లా గుర్బాజ్ (76), ఇబ్రహీం జద్రాన్ (70) అర్ధశతకాలతోపాటు పేసర్ ఫజల్‌హక్ ఫరూఖీ (5/9) ఐదు వికెట్లతో విజృంభించడంతో.. గ్రూప్-సిలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో అఫ్ఘాన్ 125 పరుగుల తేడాతో ఉగాండాను చిత్తు చేసింది. తొలుత అఫ్ఘాన్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 183 పరుగులు చేసింది. కాస్మాస్, మసాబా చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఉగాండా 16 ఓవర్లలో 58 పరుగులకే కుప్పకూలింది. రాబిన్సన్ ఒబుయా (14), రియాజత్ అలీ షా (11) మాత్రమే డబుల్ డిజిట్ స్కోర్లు చేశారు. రషీద్, నవీనుల్ చెరో 2 వికెట్లు తీశారు.

బిజినెస్

మదుపరి షాక్.. సూచీలు షేక్



'పోల్' పంచ్‌కు రక్తమోడిన దలాల్‌స్ట్రీట్

- ఒకదశలో 6,234 పాయింట్లు పతనమై 70,000 స్థాయికి జారుకున్న సెన్సెక్స్
- చివరికి 4,390 పాయింట్ల నష్టంతో 72,079 స్థాయి వద్ద ముగిసిన సూచీ
- ఇంట్రాడేలో నిఫ్టీ దాదాపు 2,000 పాయింట్లు డౌన్
- చివర్లో 1,379 పాయింట్ల నష్టంతో 21,885 వద్ద క్లోజ్
- గడిచిన నాలుగేళ్లలో ఇదే అతిపెద్ద మార్కెట్ పతనం
- ఒకదశలో దాదాపు రూ.40 లక్షల కోట్ల సంపద ఉఫ్
- రూ.31 లక్షల కోట్ల నష్టంతో రూ.394.83 లక్షల కోట్లకు పడిపోయిన బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్

ముంబై: లోక్‌సభ ఎన్నికల ఫలితాలు స్టాక్ మార్కెట్‌ను భారీగా కుదిపేశాయి. ఎన్డీఏకు సీట్లు 300 కంటే తగ్గడంతోపాటు బీజేపీకి పూర్తి మెజారిటీ లభించకపోవడం మార్కెట్ వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇన్వెస్టర్లు అమ్మకాలు పోటెత్తించడంతో మంగళవారం సూచీలు కుప్పకూలాయి. నాలుగేళ్లలో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి. దాంతో ఎగ్జిట్ పోల్స్ జోష్‌తో సోమవారం ఆర్జించిన లాభాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఒకదశలో 6,234.35 పాయింట్ల (8.15 శాతం) వరకు క్షీణించి దాదాపు 5 నెలల కనిష్ఠ స్థాయి 70,234.43 వద్దకు పడిపోయింది. ఆ తర్వాత కాస్త కోలుకున్న సూచీ.. చివరికి 4,389.73 పాయింట్ల (5.74 శాతం) నష్టంతో రెండు నెలలకు పైగా కనిష్ఠ స్థాయి 72,079.05 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 1,982.45 పాయింట్లు (8.52 శాతం) పతనమై 21,281.45 వద్దకు పడిపోయింది. ట్రేడింగ్ నిలిచేసరికి సూచీ 1,379.40 పాయింట్ల (5.93 శాతం) నష్టంతో 21,884.50 వద్ద స్థిరపడింది. కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ విధించడంతో 2020 మార్చి 23న సెన్సెక్స్, నిఫ్టీ 13 శాతం మేర క్షీణించాయి. ఆ తర్వాత సూచీలకు ఇదే అతిపెద్ద ఒక్కరోజు నష్టం. అమ్మకాల సునామీలో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.31 లక్షల కోట్లకు పైగా హరించుకుపోయి రూ.394.83 లక్షల కోట్లకు (4.73 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. ఒకదశలోనైతే మార్కెట్ సంపద దాదాపు రూ.40 లక్షల కోట్ల మేర ఆవిరైంది.

మోదీ సర్కారు హయాంలో నిఫ్టీ అతిపెద్ద నష్టాలు

తేదీ	నష్టం	
	పాయింట్లు	శాతం
2024 జూన్ 4	1,379.40	5.93
2022 ఫిబ్రవరి 22	531.95	3.06
2021 నవంబరు 26	509.80	2.91
2021 ఏప్రిల్ 12	524.05	3.53
2021 ఫిబ్రవరి 26	568.20	3.76
2020 మార్చి 23	1,135.20	12.98
2020 మార్చి 16	757.80	7.61
2020 మార్చి 12	868.25	8.30
2020 మార్చి 9	538.00	4.90

మరిన్ని ముఖ్యాంశాలు..

- ఎన్నికల ఫలితాలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు అనుగుణంగా లేకపోవడంతో ఇన్వెస్టర్లు ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు, పవర్, యుటిలిటీస్, ఎనర్జీ, ఆయిల్ అండ్ గ్యాస్, క్యాపిటల్ గూడ్స్ షేర్లలో భారీగా లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. పలు ప్రభుత్వ రంగ షేర్లు పరిమితికి మించి పతనమవడంతో వాటిల్లో ట్రేడింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది.
- సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 27 నష్టపోయాయి. ప్రభుత్వ రంగ ఎన్‌టీపీసీ షేరు 15 శాతానికి పైగా క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఎస్‌బీఐ, ఎల్ అండ్ టీ, పవర్‌గ్రిడ్ సైతం రెండంకెల స్థాయిలో నష్టపోయాయి. ఎఫ్ఎంసీజీ రంగ దిగ్గజం హెచ్‌యూఎల్ మాత్రం 6 శాతం లాభపడి సెన్సెక్స్ టాప్ గెయినర్‌గా నిలిచింది. నెస్లే ఇండియా 3 శాతానికి పైగా పెరిగింది.
- బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 8.07 శాతం క్షీణించగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 6.79 శాతం నష్టపోయింది. ఎఫ్ఎంసీజీ మినహా మిగతా రంగాల సూచీలన్నీ నేలచూపులు చూశాయి. యుటిలిటీస్ 14.40 శాతం, పవర్ 14.25 శాతం పతనమవగా.. ఆయిల్ అండ్ గ్యాస్ 13.07 శాతం, సర్వీసెస్ 12.65 శాతం, క్యాపిటల్ గూడ్స్ 12.06 శాతం, ఎనర్జీ 11.62 శాతం నష్టపోయాయి.
- బీఎస్ఈలో 3,934 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 3,349 కంపెనీల స్టాక్ నష్టాలు చవిచూశాయి. 488 మాత్రం లాభపడ్డాయి. 97 యథాతథంగా ముగిశాయి. కాగా, 292 కంపెనీల షేర్లు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోగా.. 139 ఏడాది గరిష్ఠాన్ని చేరాయి.
- ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 37 పైసలు క్షీణించి 83.51 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో అమ్మకాలు పోటెత్తడంతో పాటు అంతర్జాతీయంగా డాలర్ బలపడటం ఇందుకు కారణమైంది.

అదానీ షేర్లు ధమాల్: నరేంద్ర మోదీకి అత్యంత సన్నిహిత కార్పొరేట్ ప్రముఖుడిగా పేరున్న గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ షేర్లు మహా పతనాన్ని చవిచూశాయి. ఇంట్రాడేలో అదానీ పోర్ట్స్ 25 శాతం వరకు క్షీణించింది. పలు కంపెనీల షేర్లు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. దాంతో గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ సంపద ఒక్కరోజులోనే రూ.3.64 లక్షల కోట్లు తగ్గి రూ.15.78 లక్షల కోట్లకు పడిపోయింది.

పీఎస్‌యూ స్టాక్స్ పరేషాన్: ప్రభుత్వ రంగ సంస్థలు(పీఎస్‌యూ), ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల(పీఎస్‌బీ) షేర్లు భారీగా కుదేలయ్యాయి. ఆర్ఈసీ షేరు ఏకంగా 24.07 శాతం క్షీణించగా.. పీఎఫ్‌సీ 21.62 శాతం, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 19.43 శాతం, భారత్ ఎలక్ట్రానిక్స్ 19.21 శాతం, ఓఎన్‌జీసీ 16.23 శాతం, కోల్ ఇండియా 13.54 శాతం, ఎన్‌టీపీసీ 14.52 శాతం నష్టపోయాయి. దాంతో నిఫ్టీ పీఎస్ఈ ఇండెక్స్ 16.38 శాతం పతనమై 9,475 స్థాయికి జారుకుంది. పీఎస్‌బీలదీ అదే పరిస్థితి. యూనియన్ బ్యాంక్ 17.65 శాతం, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 15.15 శాతం చొప్పున నష్టపోయాయి. కెనరా బ్యాంక్ 13.45 శాతం, ఎస్‌బీఐ 13.37 శాతం తగ్గాయి. దాంతో నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 15.14 శాతం దిగజారి 6,794.25 వద్దకు పడిపోయింది. పీఎస్‌బీలతోపాటు ప్రైవేట్ బ్యాంక్‌లూ భారీ నష్టాలను చవిచూశాయి. దాంతో నిఫ్టీ బ్యాంక్ సూచీ 7.95 శాతం క్షీణించి 46,928.60 వద్దకు జారుకుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,870 ▲	66,800 ▲	98,500 ▲
ముంబై	71,969 ▲	65,924 ▲	88,837 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	450
వరంగల్	482	గోదావరి	445
చిత్తూరు	563	విశాఖపట్నం	450
		డజను గుడ్లు రూ. 72	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	147	విజయవాడ	149
వరంగల్	147	గుంటూరు	149
కరీంనగర్	147	ఒంగోలు	149
మహబూబ్‌నగర్	147	చిత్తూరు	142
కర్నూలు	147	నెల్లూరు	142
విశాఖపట్నం	135	అనంతపురం	149
గోదావరి	149		



పవన్‌కల్యాణ్‌కు సినీ ప్రముఖుల అభినందనలు

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమితో పొత్తు కుదుర్చుకున్న పవన్ కల్యాణ్.. పిఠాపురంలో ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు జనసేన పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాలల్లోనూ(21) జయకేతనం ఎగురవేశారు. ఈ నేపథ్యంలో పవన్‌కు పలువురు టాలీవుడ్ సెలబ్రిటీల నుంచి అభినందలు వెల్లువెత్తాయి. "ఎవ్వరికి అందదు అతని రేంజ్.. రెప్ప తెరిచేను రగిలే రివెంజ్" అని పేర్కొంటూ.. 'ఓజీ' టైమ్ బిగిన్స్ అనే ఓ సినిమా పోస్టర్‌ను నిర్మాణ సంస్థ డీవీవీ మూవీస్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. "ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, హీరోలు బాలకృష్ణ, పవన్‌కల్యాణ్, బీజేపీ నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరికి హృదయపూర్వక అభినందనలు" అని తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, నిర్మాతల మండలి పేర్కొంది. మరోవైపు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకి మోహన్ బాబు శుభాకాంక్షలు తెలిపారు. "ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇంతటి ఘనవిజయం అందుకున్న నారా చంద్రబాబునాయుడుకు నా హృదయపూర్వక అభినందనలు. మీ పాలనలో రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తుందని .. ఉన్నత శిఖరాలను చేరుకుంటుందని విశ్వసిస్తున్నాను" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

ఒక అన్నగా గర్వంగా ఉంది



"డియర్ కల్యాణ్ బాబూ ..ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన నిన్ను, తగ్గావని ఎవరు అనుకున్నా అది ప్రజలని గెలిపించటానికే అని నిరూపించిన నిన్ను చూస్తుంటే ఒక అన్నగా గర్వంగా వుంది. నువ్వు గేమ్‌ఛేంజర్‌వి మాత్రమే కాదు, 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'వి కూడా అని అందరూ నిన్ను కొనియాడుతుంటే నా హృదయం ఉప్పొంగుతోంది.

- చిరంజీవి

హృదయపూర్వక శుభాకాంక్షలు

చిరస్మరణీయమైన విజయం అందుకున్న పవన్ కల్యాణ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు. ప్రజలకు నిరంతరం సేవ చేయాలన్న మీ కృషి, అంకితభావం, నిబద్ధత హృదయాన్ని హత్తుకునేలా ఉంటాయి. మీ కొత్త రాజకీయ ప్రయాణానికి అంతా మంచే జరగాలని కోరుకుంటున్నాను.

- అల్లుఅర్జున్

మీ గెలుపు స్ఫూర్తిదాయకం

రీల్ లైఫ్‌లోనూ.. రియల్ లైఫ్‌లోనూ అసలు సిసలు హీరో అయిన పవన్ కల్యాణ్‌కు అభినందనలు. ఈ గెలుపు కోసం మీరు చేసిన పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకంగా.. ఓ పాఠంలా ఉంది. మీరు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి.

- నాని

చరిత్రను సృష్టించారు

ఓ అభిమానిగా.. ఓ సోదరుడిగా నాకు ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. ఎన్నికల్లో చరిత్రను సృష్టించారు. మీ సత్తాతో కూటమిని నిలబెట్టారు. ఈ విజయానికి మీరు అర్హులు. మీరెప్పటికీ మా పవర్‌స్టారే.

- నితిన్

తగిన ప్రతిఫలం దక్కింది

శుభాకాంక్షలు పవన్ కల్యాణ్. మీ కృషికి, అంకితభావానికి తగిన ప్రతిఫలం దక్కింది.

- కాజల్ అగర్వాల్

ఓం బిర్లా రికార్డ్

» స్పీకర్‌గా చేసి మళ్లీ ఎంపీగా ఎన్నిక

న్యూఢిల్లీ, మే 4: లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన స్పీకర్ ఓం బిర్లా ఓ రికార్డ్ సాధించారు. స్పీకర్‌గా చేసి మళ్లీ లోక్‌సభకు ఎన్నికైన నేతగా నిలిచారు. గత 20 ఏళ్లలో ఈ ఘనత సాధించింది ఓం బిర్లానే. గతంలో కాంగ్రెస్‌కు చెందిన పీఏ సంగ్మా 1996లో లోక్‌సభ స్పీకర్‌గా చేసి, 1998లో మేఘాలయ రాష్ట్రంలోని తురా నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత ఈ ఫీట్ సాధించింది ఓం బిర్లానే. 1999లో ఏపీలోని అమలాపురం నుంచి టీడీపీ తరఫున గెలిచిన జీఎంసీ బాలయోగి లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. అనంతరం 2002లో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. బాలయోగి అనంతరం స్పీకర్‌గా ఎన్నికైన శివసేన నేత మనోహర్ జోషి.. 2004లో ముంబై నార్త్ సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీచేసి.. కాంగ్రెస్ అభ్యర్థి ఎక్‌నాథ్ గైక్వాడ్ చేతిలో ఓడిపోయారు. 2004లో బోల్‌పూర్ నియోజకవర్గం నుంచి గెలిచిన సీపీఎం నేత సోమ్‌నాథ్ చటర్జీ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. అనంతరం 2009లో సీపీఎంతో విభేదాలు రావడంతో ఆయన రాజకీయాల నుంచి నిష్క్రమించారు. 2009లో బిహార్‌లో ససరామ్ నియోజకవర్గం నుంచి గెలిచిన కాంగ్రెస్ సభ్యురాలు మీరా కుమార్ 15వ లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆమె ఓడిపోయారు. 2014లో స్పీకర్‌గా ఎన్నికైన బీజేపీ నాయకురాలు సుమిత్రా మహాజన్.. 2019 ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఆ తర్వాత 2019లో స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లా.. ఇప్పుడు మళ్లీ ఎంపీగా గెలిచి రికార్డు సృష్టించారు.

ఇండియా కొంప ముంచిన స్నేహపూర్వక పోటీ!

లేకుంటే కాంగ్రెస్ ఖాతాలో మరికొన్ని సీట్లు

» ఉమ్మడి అభ్యర్థులున్న చోట ఘన విజయం

» హిందీబెల్ట్‌లో ఫలించిన కాంగ్రెస్ వ్యూహం

» మిత్రుల పోటీతో పంజాబ్, బెంగాల్‌లో నష్టం

"బీజేపీని దెబ్బతీయాలంటే.. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలి. మనలో మనం పోటీ పడకూడదు.." గత ఏడాది జూలై 17న బెంగళూరులో జరిగిన ఇండియా కూటమి(40 పార్టీలు) సమావేశంలో సూత్రప్రాయంగా తీసుకున్న నిర్ణయం ఇది.! ఆ తర్వాత ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో ముంబైలో జరిగిన సమావేశంలోనూ ఇదే అంశంపై చర్చ జరిగింది.! క్షేత్రస్థాయిలో మాత్రం కొన్ని రాష్ట్రాల్లో ఇది సాధ్యం కాలేదు. 'స్నేహపూర్వక పోటీ'ని కూటమి పక్షాలు ప్రకటించుకున్నాయి. ఇప్పుడు ఆ స్నేహపూర్వక పోటీలే కూటమి కొంప ముంచాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మిత్రుల మధ్య పోటీతో నష్టం

ఇండియా కూటమిలోని వంచిత్ బహుజన్ అఘాడీ వంటి పలు చిన్న పార్టీలు కొన్ని చోట్ల కాంగ్రెస్‌పై తమ అభ్యర్థులను నిలిపాయి. వీటి ద్వారా కొంత మేర నష్టం జరగ్గా.. కేరళ, పశ్చిమబెంగాల్, పంజాబ్‌లలో మాత్రం పూడ్చలేని నష్టం వాటిల్లింది. 'ఉమ్మడి అభ్యర్థి' నిబంధనకు కట్టుబడి ఉంటే.. కాంగ్రెస్ కూటమికి ఈ మూడు రాష్ట్రాల్లో అదనంగా 11-16 సీట్లు వచ్చి ఉండేవని తాజా ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ స్నేహపూర్వక పోటీ పంజాబ్‌లో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు విజయాన్ని కట్టబెట్టింది. ఖదూర్‌సాహిబ్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థికి 3.76 లక్షల ఓట్లు రాగా.. అక్కడి ఆప్-కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్ల మొత్తం 5.25 లక్షలకు పైనే.! ఫరీద్‌కోట్‌లో కూడా 2.96 లక్షలతో ఇండిపెండెంట్ అభ్యర్థి అగ్రస్థానంలో నిలవగా.. అక్కడ కాంగ్రెస్, ఆప్‌కు వచ్చిన ఓట్ల మొత్తం 3.8 లక్షలు. బఠిండాలో శిరోమణి అకాలీదళ్ 3.75లక్షలతో విజయం సాధించగా.. అక్కడ కూడా ఆప్-కాంగ్రెస్‌లకు వచ్చిన ఓట్ల సంఖ్య 5.25 లక్షలు. పశ్చిమ బెంగాల్‌లో ఇండియా కూటమిలోని టీఎంసీ, కాంగ్రెస్, సీపీఎం పరస్పర పోటీ వల్ల 8-10 సీట్లలో బీజేపీ పాగా వేసింది. ఇక్కడ కూడా బీజేపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లతో పోలిస్తే.. విడివిడిగా కూటమికి వచ్చిన ఓట్ల సంఖ్య చాలా ఎక్కువ కావడం గమనార్హం.! కేరళలోని త్రిషూర్ నియోజకవర్గం నుంచి నటుడు, బీజేపీ అభ్యర్థి సురేశ్‌గోపీ ఘనవిజయం సాధించారు. అక్కడ కమ్యూనిస్టులకు, కాంగ్రెస్‌కు వచ్చిన మొత్తం ఓట్ల కంటే.. సురేశ్‌గోపీ సాధించిన ఓట్లు దాదాపు 2.06 లక్షల మేర తక్కువ కావడం గమనార్హం. కేరళలో కాంగ్రెస్ గెలిచిన స్థానాల్లో చాలా వరకు కమ్యూనిస్టులే రెండో స్థానంలో ఉన్నారు. అక్కడ విడివిడిగా పోటీచేయకుండా ఉండిఉంటే.. భారీ మెజారిటీ వచ్చేదనేది నిర్వివాదాంశం.



సురేశ్ గోపి

ఆ రాష్ట్రాల్లో గ్రాండ్ సక్సెస్..!

ప్రీపోల్ సర్వేలు మొదలు.. ఎగ్జిట్ పోల్స్ దాకా ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ హవా అంటూ ఫలితాలొచ్చాయి. మంగళవారం నాటి ఫలితాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. 80 స్థానాలున్న యూపీలో ఇండియా కూటమిదే పైచేయి అయ్యింది. 2014లో 77, 2019లో 62 సీట్లను సాధించిన బీజేపీ ఈ సారి 33 స్థానాలకే పరిమితమైంది. ఇందుక్కారణం.. 'ఉమ్మడి అభ్యర్థి' నిబంధనకు కట్టుబడి ఉండడమే.! బీజేపీ అధికారంలో ఉన్న యూపీలో ఈ ప్రయోగంతో గ్రాండ్ సక్సెస్ అయినట్లే. అంతే కాదు.. మహా వికాస్ అఘాడీ పేరుతో ముందు నుంచి కూటమిగా ఉన్న కాంగ్రెస్, ఎన్‌సీపీ(శరద్ వర్గం), శివసేన(ఉద్ధవ్ వర్గం) 48 లోక్‌సభ స్థానాలున్న మహారాష్ట్రలోనూ 'ఉమ్మడి' ధర్మాన్ని పాటించాయి. ఫలితంగా 29 స్థానాల్లో ఘనవిజయం సాధించాయి. రాజస్థాన్, ఝార్ఖండ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లోనూ ఈ ప్రయోగం ఫలించింది. హిందీబెల్ట్‌లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరాఖండ్ మినహా.. ఇండియా కూటమి మంచి ఫలితాలను సాధించింది. గత ఎన్నికల్లో ఈ బెల్ట్‌లో బీజేపీ ఏకపక్ష హవా కొనసాగిన విషయం తెలిసిందే..!

- సెంట్రల్ డెస్క్

భారీగా పుంజుకున్న కాంగ్రెస్

2014, 2019 ఎన్నికలతో పోలిస్తే.. కాంగ్రెస్ ఈసారి పుంజుకుంది. తాజా ఎన్నికల్లో ఆ పార్టీ ఒంటరిగా 99 స్థానాల్లో విజయం సాధించింది. నిజానికి 2014లో 44 సీట్లు.. 2019లో 52 స్థానాలను మాత్రమే సాధించిన కాంగ్రెస్.. లోక్‌సభలో విపక్ష పార్టీ హోదాను కూడా దక్కించుకోలేదు. ఓ దశలో బీజేపీ దూకుడుతో క్రమంగా కాంగ్రెస్ కనుమరుగవుతోందా? అనే అనుమానాలు రాజకీయవర్గాల నుంచి వ్యక్తమైన నేపథ్యంలో.. రాహుల్‌గాంధీ రెండుసార్లు చేపట్టిన 'భారత్ జోడో యాత్ర'లు ప్రజల్లో మళ్లీ ఆదరణను తెచ్చిపెట్టాయి. ముఖ్యంగా దక్షిణాదిన కేరళలో తిరిగి తన సత్తాను చాటుకోగా.. హిందీబెల్ట్‌లో ఆశించిన స్థాయిలో పురోగతిని నమోదు చేసుకుంది. వచ్చే ఎన్నికల్లోగా ఆ పార్టీ మరింత వేగంగా పుంజుకుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లోక్‌సభకు రామాయణ్ రాముడు.. రచన.. కంగన..

ఎన్నికల్లో వివిధ పార్టీల తరఫున మెరిసిన తారలు







న్యూఢిల్లీ, జూన్ 4: లోక్‌సభ ఎన్నికల్లో తారలు తళుక్కుమన్నారు. రామానంద్ సాగర్ రామాయణ్‌లో శ్రీరాముడి పాత్రధారి, బాలీవుడ్ నటుడు అరుణ్ గోవిల్ తొలిసారిగా చట్టసభలో అడుగుపెట్టనున్నారు. యూపీలోని మేరఠ్ నుంచి పోటీచేసిన ఆయన ఎస్పీ అభ్యర్థి సునీతా వర్మపై 9,366 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రముఖ సినీనటి, తెలుగులో 'కన్యాదానం', 'మావిడాకులు', 'నేను ప్రేమిస్తున్నాను' వంటి చిత్రాల్లో నటించిన రచనా బెనర్జీ టీఎంసీ తరఫున విజయం సాధించారు. బెంగాల్‌లోని హుగ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆమె 74,048 ఆధిక్యాన్ని సాధించారు. బెంగాల్‌లోని జాదవ్‌పూర్ నుంచి టీఎంసీ నుంచే బరిలో నిలిచిన బెంగాలీ సినిమా, టీవీ నటి సయానీ ఘోష్ 2.50 లక్షల ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థిపై గెలుపొందారు. ఇప్పటికే ఓసారి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించిన ప్రముఖ మలయాళీ నటుడు సురేశ్ గోపీ కేరళలోని త్రిషూర్‌లో విజయం సాధించి, లోక్‌సభలో అడుగుపెట్టనున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి స్థానం నుంచి బీజేపీ నుంచి రేసులో నిలిచిన బాలీవుడ్ నటి కంగనా రనౌత్ 74,755 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈశాన్య ఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసిన భోజ్‌పురి నటుడు మనోజ్ తివారీ సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి కన్హయ్య కుమార్‌పై 1,22,135 ఓట్ల ఆధిక్యాన్ని సాధించారు. బెంగాల్‌లోని అసన్సోల్ స్థానం నుంచి పోటీ చేసిన సిటింగ్ ఎంపీ, ఈసారి కాంగ్రెస్ తరఫున పోటీచేసిన బాలీవుడ్ సీనియర్ నటుడు శతృఘ్న సిన్హా, బీజేపీ అభ్యర్థి సురేంద్రజీత్‌పై విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి హేమామాలిని యూపీలోని మథుర స్థానం నుంచి 2.91లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రముఖ నటుడు, యూపీలోని గోరఖ్‌పూర్ సిటింగ్ ఎంపీ, రేసుగుర్రం సినిమాలో ప్రతినాయకుడు రవికిషన్(రవీంద్ర శుక్లా).. ఎస్పీ అభ్యర్థి కాజల్ నిషాద్‌పై లక్ష పైచిలుకు ఓట్లతో గెలుపొందారు. బెంగాల్‌లోని ఘటల్ నుంచి పోటీ చేసిన తృణమూల్ సిటింగ్ ఎంపీ, సినీనటుడు దీపక్ అధికారి బీజేపీ అభ్యర్థి హిరణ్మయి చటోపాధ్యాయపై 1.75 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అయితే భోజ్‌పురి నటుడు, నేపథ్య గాయకుడు పవన్ సింగ్‌కు బిహార్‌లోని కరాకట్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, ఓటమిపాలయ్యారు. యూపీలోని ఆజంఘడ్ నుంచి భోజ్‌పురి నటుడు దినేశ్ లాల్ యాదవ్ ఎస్పీ అభ్యర్థి ధర్మేంద్రయాదవ్ చేతిలో 1.6 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయారు. టీవీ నటిగా, మోడల్‌గా గుర్తింపు పొంది రాజకీయాల్లోకి అడుగుపెట్టిన స్మృతీ ఇరానీ.. అమేథీ నుంచి పోటీ చేసి, కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో 1.62 లక్షల ఓట్లతో ఓడిపోయారు. తమిళనాడులోని విరుద్‌నగర్ నుంచి బీజేపీ తరఫున పోటీచేసిన నటి రాధిక, అమరావతి నుంచి పోటీ చేసిన నవనీత్‌కౌర్ ఓడిపోయారు.

సందేశ్‌ఖాలీలో బీజేపీ ఓటమి

కోల్‌కతా, మే 4: సందేశ్‌ఖాలీ.. గత కొన్ని రోజులుగా వార్తల్లో విపరీతంగా వైరల్ అయిన స్థానం.. బెంగాల్ బీజేపీ నేతలు ఎక్కువగా ప్రస్తావించిన పేరిది.. ఈ నియోజకవర్గానికి చెందిన ఓ మహిళను టీఎంసీ నాయకులు లైంగికంగా వేధించారంటూ బీజేపీ పలు ఆందోళనలు చేసింది. కానీ, ఇవేవీ లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓట్లను రాల్చలేదు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన బశీర్‌హాట్ లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో సందేశ్‌ఖాలీ కూడా ఒకటి. ఈ నియోజకవర్గంలో బీజేపీ దారుణ పరాజయాన్ని చవిచూసింది. బీజేపీ అభ్యర్థి రేఖా పాత్రను టీఎంసీ అభ్యర్థి, ఆ పార్టీ సీనియర్ నాయకుడు హాజీ నూరుల్ ఇస్లాం దాదాపు రెండు లక్షల ఓట్ల తేడాతో ఓడించారు. ఈ సందర్భంగా హాజీ నూరుల్ ఇస్లాం మాట్లాడుతూ.. "నా విజయంతో సందేశ్‌ఖాలీ గురించి ప్రచారం చేసినవన్నీ అబద్ధాలేనని తేలిపోయింది. ప్రజలెవరూ వాటిని నమ్మలేదు. వైరల్ చేసిన వీడియోల వెనుక బీజేపీ పాత్ర ఉందని వారు భావించారు. అందుకే బీజేపీ పన్నిన కుట్రకు నా విజయంతో చక్కటి సమాధానం చెప్పారు" అని అన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పదును చూపిన ప్రజల విజ్ఞత

ఉత్కంఠకు, ఆకాంక్షలకు తగ్గట్టుగానే, ఎన్నికల ఫలితాలు సంభ్రమాశ్చర్యాలు కలిగించాయి. ఉక్కుపాదాల నుంచి, ఉక్కపోతల నుంచి, దుష్పరిపాలనల నుంచి ఉపశమనం కలిగించాయి. ఆగ్రహానికి, నిరాదరణకు పాత్రులైన నాయకులను, వారి ప్రభుత్వాలను నిర్దాక్షిణ్యంగా ప్రజారంగం నుంచి నెట్టివేశాయి. తిరుగులేని, ఎదురులేని నాయకులనుకున్న వారి ఒడ్డూపొడుపూ కత్తిరించి బుద్ధి చెప్పాయి. 2024 ప్రజల తీర్పు భారత రాజకీయరంగాన్ని తిరిగి సంచలనశీలంగా మార్చింది. పదేళ్ల ఏకపక్ష పాలన స్థానంలో తిరిగి సంకీర్ణ రాజకీయాలను ప్రవేశపెట్టింది. జాతీయ రంగస్థలం మీద తెలుగువారి ప్రమేయానికి పట్టం కట్టింది.

భారతీయ జనతాపార్టీకి మెజారిటీ బహుదూరంలోనే నిలిచిపోయింది. ఎన్‌డీఏలోని భాగస్వామ్యపక్షాల సహకారంతో మాత్రమే తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలదు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి సాగనంపారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి కనీవినీ ఎరుగని ఘనవిజయం సాధించింది. కేంద్రంలోని కొత్త ప్రభుత్వంలో తెలుగుదేశం, ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కీలకపాత్ర పోషించనున్నారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్‌కు నిరుత్సాహకరమైన ఫలితాలు వచ్చాయి. గత లోక్‌సభలో నాలుగు స్థానాలు పొందిన తెలంగాణ బీజేపీ తన బలాన్ని రెట్టింపు చేసుకుంది. గత సభలో మూడు స్థానాల బలమే ఉన్నప్పటికీ, ఇటీవల రాష్ట్రంలో అధికారం పొందినందున, మెరుగైన ఫలితాలు సాధించవలసిన కాంగ్రెస్ తన సంఖ్యను ఎనిమిదికి మించి పెంచుకోలేకపోయింది.

వైసీపీ ప్రభుత్వం ఘోరపరాజయం పూర్తిగా స్వయంకృతం. ప్రత్యర్థులు ఎన్నికల ప్రచారంలో ఏకరువు పెట్టిన జగన్ ప్రభుత్వ దుర్మార్గాలకంటే, ప్రజల అనుభవంలోకి వచ్చినవి కొన్ని రెట్లు ఎక్కువ అని ఈ ఫలితాలు చెబుతున్నాయి. వైసీపీ ని అనేక జిల్లాలనుంచి ఏకమొత్తంగానూ తుడిచిపెట్టారంటే, దుష్పరిపాలన తీవ్రత ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. రెండంకెల సంఖ్యకు కూడా చేరుకోలేక కునారిల్లుతూ, ప్రతిపక్ష స్థాయి కూడా దక్కనంత స్వల్పమైన ఉనికి మిగిలిన ఆ పార్టీ తన దుస్థితికి కారణాలను సమీక్షించుకుని సుదీర్ఘ కాలం నిరీక్షించవలసిందే.

కూటమి 21 లోక్‌సభ స్థానాలను సాధించగా, అందులో తెలుగుదేశం సొంతంగా 16 స్థానాలు సంపాదించింది. కేంద్రంలో మెజారిటీ కొరవడిన బీజేపీకి టీడీపీ ఇప్పుడు అత్యంత అవసరమైన, కీలకమయిన భాగస్వామి. బీజేపీ తరువాత అత్యధిక స్థానాలు సాధించిన ఎన్‌డీఏ భాగస్వామి తెలుగుదేశమే. గత రెండు పదవీకాలాల్లో కూడా పేరుకు ఎన్‌డీఏ ప్రభుత్వమే అయినా, తనకు సొంతంగా మెజారిటీ ఉన్నందున నామమాత్రపు సంకీర్ణంగా మాత్రమే వ్యవహరించిన బీజేపీ, ఈసారి అనివార్యంగా భాగస్వామిక రాజకీయాలను అంగీకరించవలసి వస్తుంది. తెలుగుదేశంపార్టీకి, బిహార్‌కు చెందిన జనతాదళ్ యునైటెడ్‌కు వాస్తవ అర్థంలో తగినప్రాధాన్యం విధిగా ఇవ్వవలసి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి విషయంలో అలక్ష్యం చూపుతున్నందుకు, బీజేపీ ఇతర విధానాలపై నిరసనగాను గతంలో ఎన్‌డీఏ ప్రభుత్వం నుంచి వెలుపలికి వచ్చిన తెలుగుదేశం పార్టీకి, ప్రస్తుత విజయాలు మంచి సానుకూలతను సమకూర్చాయి. రాజధాని, పోలవరం వంటి అభివృద్ధి అంశాల మీద కేంద్రం నుంచి తగిన స్పందనను రాబట్టగలిగే శక్తి టీడీపీకి ఇప్పుడున్నది. చంద్రబాబు నాయుడుకు ఉన్న అపారమైన అనుభవం, కార్యదక్షత వల్ల జాతీయ రంగంలో కూడా ఆయన క్రియాశీల బాధ్యతలు నిర్వహించగలరని, బీజేపీ ప్రభుత్వం దూకుడుకు కళ్లెం వేయగలిగేది కూడా చంద్రబాబేనని ఆశాభావాలు వ్యక్తమవుతున్నాయి.

బీజేపీ ఎనిమిది విజయాలను, బీఆర్‌ఎస్ సున్నా స్కోర్‌తో కలిపి చూస్తేనే తెలంగాణ ఫలితాలు అర్థమవుతాయి. గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పరాజిత బీఆర్‌ఎస్‌కు వచ్చిన సుమారు 37 శాతం ఓట్లు పార్లమెంటు ఎన్నికలలో ఎవరికి మళ్లుతాయన్న చర్చ జరుగుతూ వచ్చింది. గణనీయభాగం బీజేపీకి పోయినట్టు అర్థమవుతోంది. కేంద్రంలో మహాబలంతో బీజేపీ ప్రభుత్వం ఉండి ఉంటే, ఈ గెలుపులు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇబ్బందులు కలిగించి ఉండేవి. ఇప్పుడు, పరిమిత బలం కలిగిన కేంద్రమే ఉంటుంది కాబట్టి, తక్షణ ప్రమాదం లేదు కానీ, పరిస్థితిని మెరుగుపరుచుకోకపోతే కాంగ్రెస్‌కు, బీఆర్‌ఎస్‌కు కూడా ఇబ్బందులే ఎదురవుతాయి.



తెలుగు రాష్ట్రాల పరిణామాలకు మించిన ప్రాధాన్యం కలిగినవి, దేశ రాజకీయాల గతినే మార్చగలిగేవి పదిహేడో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు. తెలంగాణలో బీజేపీ, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించాయి కానీ, జాతీయస్థాయిలో బీజేపీకి తీవ్రమైన ఎదురుదెబ్బలు తగిలాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలలో ఆ పార్టీ కొత్తగా అధికారంలోకి రాగలుగుతోంది, మధ్యప్రదేశ్, గుజరాత్, ఒడిశా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలోనూ ఘనవిజయాలు సాధించింది. కేరళ వంటి రాష్ట్రంలో ఒక స్థానం గెలవగలిగింది. ఈ విజయాలన్నిటి కంటె, మెజారిటీ ఎదురైన కొరతే బీజేపీకి అతి పెద్ద నష్టం. గత లోక్‌సభలో 303 స్థానాల బలమున్న బీజేపీ, కొత్త లోక్‌సభలో 240 దరిదాపుల్లో సంతృప్తిపడవలసి వచ్చింది. మైనారిటీ ప్రభుత్వాన్ని నడపడం బీజేపీకి కొత్త కాదు. 1999 ఎన్నికలలో బీజేపీ 182 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. అయినా మిత్రపక్షాలతో కలిసి ఒకటో ఎన్‌డీఏ ప్రభుత్వం నడిపింది. కానీ, 2014లో 282, 2019లో 303 స్థానాలను గెలుచుకుని సంకీర్ణ ప్రభుత్వాల పేరుతో తన సొంత ప్రభుత్వాలనే నడిపింది. ఈ సారి, సొంతంగా 370 స్థానాలు గెలవాలని, మిత్రులతో కలసి 400 గెలవాలని ఆశించింది. అవి కేవలం సంఖ్యలు కావు. మూడింట రెండు స్థానాల మెజారిటీ కోసం 370, కాంగ్రెస్ 1984 రికార్డును అధిగమించడం కోసం 400 అంకెలను ఎంచుకున్నారు. అధిక మెజారిటీ కోరుకున్నది రాజ్యాంగ సవరణలకు వెసులుబాటు కోసమే కావచ్చు. ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి అదే ఆయుధంగా మారింది. రాజ్యాంగాన్ని మార్చబోతున్నారని, రాజ్యాంగం అట్టడుగు వర్గాలకు కల్పించిన ప్రత్యేక రక్షణలను తొలగించబోతున్నారని ప్రతిపక్షం చేసిన ఆరోపణ ఓటర్ల మీద తీవ్రంగా ప్రభావం చూపినట్టు, సామాజికవర్గాల వారీ ఓటింగ్ శాతాలు సూచిస్తున్నాయి.

పదిహేనేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని దాదాపు రెట్టింపు చేసుకోగలగడానికి ఆ పార్టీ మిత్రపక్షాలతో చూపించిన సర్దుబాటు వైఖరి, రాహుల్ జోడో యాత్రలు, విస్పష్టమైన విధానాలతో వైఖరుల రూపకల్పన ముఖ్యమైన కారణాలు. బీజేపీ విస్తరణను అడ్డుకోగలిగిన మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రేలను ప్రధానంగా చెప్పుకోవాలి. ప్రతిపక్ష పార్టీలను, మాజీ మిత్రపక్షాలను చీలికల ద్వారా బలహీనపరచాలనే ఆలోచనను ప్రజలు సమ్మతించరని మహారాష్ట్ర నిరూపించింది. ద్రవిడ వాదానికి తాను పెట్టనికోటనని తమిళనాడు మరోసారి నిరూపించుకుంది. దేశంలోని ఈ నాయక బాహుళ్యం ఎక్కడికక్కడ ఆత్మరక్షణ చేసుకోవడంతో పాటు, అవాంఛనీయమైన అధిక మెజారిటీలను నిరోధించగలిగింది. పాపం, నవీన్ పట్నాయక్ బీజేపీని సొంతంగా ఢీకొని, నష్టపోయారు.

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటికి, బీజేపీ ఘనవిజయమే ఖాయమన్న అభిప్రాయం దేశంలో నెలకొని ఉన్నది. అధికారపక్షం తగిన రాజకీయ నినాదాలతో సర్వసన్నద్ధంగా ఉన్నట్టు కనిపించింది. మొదటి రెండు దశల ప్రచారంలో సాధారణ అంశాలే వినిపించగా, మూడోదశనుంచి ప్రధాని మాటలో తీవ్రత, విభజనవాదం పెరిగాయి. ప్రధానిహోదాను కూడా ఖాతరు చేయకుండా, ఊహించని రీతిలో నరేంద్రమోదీ మాట్లాడసాగారు. ఆయన అట్లా మాట్లాడడానికి, ఓటర్లలో కనిపిస్తున్న అనాసక్తి కారణమన్న విశ్లేషణలు మొదలయ్యాయి. తక్కిన అన్నిదశలలోను, చివరి రోజుతో సహా, నరేంద్రమోదీ వివాదాస్పదమైన అంశాలే మాట్లాడుతూ వచ్చారు. మోదీ రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటున్నారని ఇండియా కూటమి, కాంగ్రెస్ కూటమి బీసీ, ఎస్సీల రిజర్వేషన్లు తగ్గించి ముస్లిములను ఇవ్వాలనుకుంటున్నదని మోదీ పరస్పర ఆరోపణలు సంధించుకున్నారు. మోదీ విభజన వాదానికి పెద్దగా ఆమోదం లభించలేదని ఫలితాలు సూచిస్తున్నాయి. అంతేకాదు, రామమందిర ప్రతిష్ఠను, రాజకీయాలను ప్రజలు వేరువేరుగానే పరిగణించారని తెలుస్తోంది. అయోధ్య (ఫైజాబాద్) స్థానంలో బీజేపీ ఓడిపోయిందంటే అర్థం ఏమిటి?

ఉమ్మడి పౌరస్మృతి, రాజ్యాంగం నుంచి సెక్యులర్ పదం తొలగింపు, ఒకే దేశం–ఒకే ఎన్నిక, నియోజకవర్గాల పునర్విభజన, జీఎస్టీ పరిధిలోకి పెట్రో ఉత్పత్తులు వంటి అనేక అంశాలు బీజేపీ ఎజెండాలో ఉన్నాయి. ఈ అంశాలపై ప్రతిపక్షాలకు, ప్రాంతీయ పార్టీలకు భిన్నాభిప్రాయాలు, సొంత ప్రతిపాదనలు ఉన్నాయి. వీటికి సొంతంగా అధిక మెజారిటీ కావాలి, రాష్ట్రాలలో కూడా సొంతప్రభుత్వాలు ఉండాలి. ప్రాంతీయ పార్టీలను సాధ్యమైనంతగా అప్రధానం, బలహీనం చేయాలన్నది మోదీ నాయకత్వంలోని బీజేపీ ఆశయం. తమ ప్రభుత్వాలు ఉన్నచోట తప్ప, ఇతర ప్రభుత్వాలు ఉన్న చోట, ముఖ్యంగా ప్రాంతీయపార్టీలు ఉన్న ప్రభుత్వాలు ఉన్నచోట నిధుల పంపకంలో గానీ, గవర్నర్ల జోక్యంతో కానీ ఇబ్బందులు కల్పించడం గత పదేళ్లుగా చూస్తూ ఉన్నదే. అయితే, అనుకున్నంత బలం సమకూరదేమోనన్న భయం ఏ మూలో ఉండడంతో బీజేపీ ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయపార్టీలతో కూటమిలోకి వచ్చింది.

ఎవరిమీదా ఆధారపడనక్కరలేని స్థితిలో, కేంద్రప్రభుత్వ దర్యాప్తు ఏజెన్సీలను ప్రతిపక్షాల మీద ప్రయోగించడానికి, రాజకీయనేతలను జైళ్లలో పెట్టడానికి బీజేపీ ప్రభుత్వానికి వెసులుబాటు లభించింది. రాష్ట్రాల అధికారాలను కుదించే అనేక నిర్ణయాలను కూడా గత పదేళ్లలో యథేచ్ఛగా తీసుకోగలిగారు. సంకీర్ణ ప్రభుత్వాలను నడిపేవారు ఏకాభిప్రాయ సాధనలో నిమగ్నం కావలసి ఉంటుంది. అందుకు వాజపేయి, మన్మోహన్ సింగ్‌కు ఉన్నటువంటి మృదు స్వభావం అవసరం. నరేంద్ర మోదీ తానే మూడోసారి ప్రధాని కాదలచుకున్నట్టు, మంగళవారం సాయంత్రం ఢిల్లీలో పార్టీ కార్యక్రమంలో ఇచ్చిన సందేశం సూచిస్తోంది. ప్రస్తుత విజయాన్ని ఎన్డీఏ విజయంగానే చెబుతున్నారు, రాబోయే ప్రభుత్వాన్ని ఎన్‌డీఏ ప్రభుత్వంగానే సంబోధించారు. అవినీతిపై చండశాసనంలో తగ్గేదే లేదని, వికసిత్ భారత్ లక్ష్యాల సాధనలో ముందుకే వెడతామని ఆయన గట్టిగా చెప్పారు. 2019 నాటి సంబరాలతో పోల్చినప్పుడు, ఇప్పటి పార్టీ కార్యక్రమం నీరసంగానే కనిపించింది.

లోక్‌సభ ఫలితాలు మోదీ పరాజయాన్నే సూచిస్తున్నాయని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. బీజేపీ ఎన్నికల ప్రచారం అంతా మోదీ వ్యక్తి ప్రతిష్ఠచుట్టూ జరిగినందున, మెజారిటీ పొందలేకపోవడం మోదీ వ్యక్తిగత అపజయంగా పరిగణించడంలో తప్పేమీ లేదు. మోదీ, అమిత్ షా ఇద్దరే మొత్తం పరిపాలనాచక్రాన్ని, రాజకీయచక్రాన్ని ఇంత కాలం తిప్పుతూ వచ్చినందున, సంప్రదింపులు, సమన్వయం అవసరమైన నూతన ప్రభుత్వాన్ని వారు సౌకర్యంగా నిర్వహించగలరా అన్న అనుమానం రావడం సహజం. తాను తప్పుకుంటానని మోదీ పార్టీ ముఖ్యుల ముందు ప్రస్తావించారేమో తెలియదు కానీ, ప్రస్తుతానికి పాత నాయకద్వయమే అగ్రపీఠాలపై కొనసాగుతారనిపిస్తోంది.

ఇండియా కూటమి నుంచి చంద్రబాబు నాయుడుకు, నితిశ్ కుమార్‌కు సూచనలు వెళ్లాయని చెబుతున్నారు కానీ, వారు అందుకు అంగీకరించే అవకాశం లేదు. ఈ తరుణంలో వారు తమ భాగస్వాములను మార్చుకోవడం నైతికం కాదు. కాకపోతే, ప్రజాస్వామిక సంప్రదాయాలను అనుసరించేట్టు, విభేదించేవారితోనూ విపక్షాలతోనూ వేధింపు ధోరణిలో వ్యవహరించకుండా బీజేపీని మిత్రపక్షాలు కట్టడి చేయగలిగితే బాగుండునని ప్రజాస్వామికవాదులు ఆశిస్తున్నారు.

ఈ ఎన్నికలు నిరూపించిన మరొక ముఖ్యమైన అంశం, మతం పేరుతో, జాతీయత పేరుతో ఎంతటి ఉద్వేగాలను వ్యాపింపజేసినా, అవి దైనందిన జీవన సమస్యల నుంచి ప్రజలను ఎంతోకాలం దృష్టి మళ్లించలేవు. ఈ ఎన్నికలఫలితాలు గ్రామీణ భారతంలోని సంక్షోభపరిస్థితులను సూచిస్తున్నాయని, ప్రజలు స్పష్టంగా ఒక సంకేతం పంపించారని విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రజాప్రతినిధుల అరాచక హింసోన్మాదాన్ని, అవినీతిని ఓటు ఆయుధంతో తిప్పి కొట్టిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు, తమ కొత్త ప్రభుత్వం ద్వారా విభజనానంతర సమస్యల పరిష్కరించుకుంటారని, అన్ని హంగుల రాజధానితో సహా అభివృద్ధి ఆకాంక్షలన్నిటిని సాధించుకుంటారని ఆశిద్దాం. ●

బాబు నాయకత్వానికి, కూటమి దక్షతకు పట్టం

చంద్రబాబు పాలనలో 2014–19 మధ్య అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాలు లబ్ధిపొందాయి. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం సమపాళ్లలో జరిగింది. ప్రజాస్వామ్యయుతంగా పాలన నడిచింది. 2019–24 మధ్య జగన్ పాలన చంద్రబాబు పాలనకు పూర్తి విరుద్ధంగా నడిచింది. ఆ తేడాను ప్రజలు అనుభవపూర్వకంగా అర్థం చేసుకున్నారు. జగన్‌ను గెలిపించి మోసపోయామని ప్రజలు బాధపడుతున్న సమయంలో అక్రమ కేసులతో చంద్రబాబును 53 రోజులు జైల్లో నిర్బంధించారు. భువనేశ్వరిని శాసనసభలో అవమానపరచడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. లోకేష్ ప్రజాగళాన్ని అడ్డుకోవడం, పవన్‌కళ్యాణ్ వ్యక్తిత్వంపై దాడి చేయడం ప్రజలకు కోపాగ్ని రగిల్చింది. అంతిమ నిర్ణేతలు ప్రజలేగాని నిర్బంధాలు, మద్యం పీపాలు కాదని ఈ ఎన్నికలు రుజువు చేశాయి.

ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ఇది అతిపెద్ద ప్రజా తీర్పు. జగన్‌కు ప్రతిపక్ష హోదాను కూడా ప్రజలు ఇవ్వలేదు. విధ్వంసం నుండి రాష్ట్రాన్ని చంద్రబాబు పాలన మాత్రమే గట్టెక్కించగలదని ప్రజలు భావించి ఇచ్చిన తీర్పు ఇది. మోసపోయిన పేదలు ఇచ్చిన తీర్పు. భవిత కోసం యువత ఇచ్చిన తీర్పు. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఇచ్చిన తీర్పు. తమ ఆస్తులు, ప్రాణాలు కాపాడుకోవడానికి సకల జనులు ఇచ్చిన తీర్పు. ప్రజాస్వామ్య పరిరక్షణకు మేధావులు ఇచ్చిన తీర్పు. మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నాయకత్వాలకు ప్రజలు పట్టం కట్టిన తీర్పు.

ఈ అధికారం చంద్రబాబుకు పూలబాట కాదు. రూ. 13 లక్షల కోట్లు అప్పుతో ఏడాదికి రూ.50 వేల కోట్ల వడ్డీ, అసలు వాయిదాల చెల్లింపు భారం మోయాల్సి వుంది. వివిధ వర్గాలకు జగన్ పెట్టిన బకాయిలు రూ.2 లక్షల కోట్ల చెల్లింపులు చేయాల్సి వుంది. మేనిఫెస్టో హామీలు అమలు చేయాలి. పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానం చేయాల్సి వుంది. అమరావతి నిర్మాణం చేసి ఉద్యోగాలు, సంపద సృష్టి చేయాల్సి ఉంది. నీలి మీడియా, జగన్ మాఫియా దుష్ప్రచారాలు, దాడులు ఎదుర్కోవాల్సి వుంటుంది. ఈ విజయంతో కూటమి శ్రేణులు నమ్రత పెంచుకుని ప్రజాభిమానాన్ని మరింత పెంచుకోవాలి.



2004లో చంద్రబాబు ఓడిపోకుండా వుంటే నేడు ప్రతి జిల్లా కేంద్రం మరో సైబరాబాద్ అయి వుండేది. 2019లో ఓడిపోకుండా వుంటే నేటికి 175 నియోజకవర్గ కేంద్రాలు ఉపాధి కల్పనా కేంద్రాలుగా అభివృద్ధి అయి వుండేవి. రాష్ట్రానికి జగన్ విధ్వంసం వల్ల కలిగిన నష్టాన్ని అధిగమించాలి. అందుకు చంద్రన్న నాయకత్వమే తగినదని ప్రజలు నిర్ణయించారు. అందుకే, క్లాసు, మాసు ఒక్కటై బందిపోట్ల ముఠాను చిత్తుచిత్తుగా ఓడించాయి. జగన్ అండ్ కో ఒక్కో కుటుంబంపై రూ.8 లక్షల భారం మోపాడు. విషపూరిత మద్యం పోసి 35 లక్షల మంది పేదల ఆరోగ్యాలను పాడు చేశాడు. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అగ్రవర్ణ పేదల అసైన్‌మెంట్ భూములు 10 లక్షల ఎకరాలు కొల్లగొట్టారు. లక్ష కోట్ల సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించాడు. పంచాయతీలు, మున్సిపాలిటీల నిధులు దారిమళ్లించి స్థానిక పాలనను నిర్వీర్యం చేశారు. పోలవరాన్ని గండికొట్టి కరువుకోరలకు ప్రజల్ని బలిపెట్టాడు. విశాఖ భూ కబ్జాల కోసం అమరావతిపై నిందలు మోపి ఉద్యోగాలు, సంపద సృష్టించే రాజధాని లేకుండా చేశాడు. ల్యాండ్, శాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం మాఫియాగా మారి రూ.10 లక్షల కోట్లు విలువ గల ప్రకృతి వనరుల్ని, ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టారు. ప్రయివేట్ ఆస్తుల్ని, భూముల్ని కబ్జా చేయడానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చారు. ప్రశ్నించిన పౌరుల్ని, మీడియాను, మేధావుల్ని, ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టి జైళ్లలో తోయించాడు. చిన్నాన్న హంతకుల్ని కూడా కాపాడే దుర్మార్గ స్థితికి దిగజారాడు. తన నేరాలు, ఘోరాల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికి కుల, మత, ప్రాంతీయ విద్వేషాల్ని రెచ్చగొట్టాడు. పదిచ్చి వంద గుంజుకొన్న వైనాన్ని పేదలు అర్థం చేసుకున్నారు. తన స్వార్థ రాజకీయం కోసం 30 మందికి పైగా పింఛన్‌దారుల ప్రాణాలు పోగొట్టి శవ రాజకీయం చేశాడు. గులకరాయి దాడి కథ నడిపి ఓ బీసీ బిడ్డను 45 రోజులు జైలుపాలు చేశాడు. కోడికత్తి డ్రామాతో దళిత యువకుణ్ణి ఐదేళ్ళు జైలుపాలు చేశాడు. పేదల్ని ఇలా కాల్చుకు తిని పేదల మనిషిగా కపట ప్రేమ ఒలకబోశాడు. పేదల ద్రోహి జగన్ అని, పేదల పెన్నిధి చంద్రన్న అని గుర్తించి వైకాపాకు పేదలు తగిన శాస్తి చేశారు. అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాలు కూటమికి అఖండ విజయం చేకూర్చాయి. రాష్ట్ర చరిత్రలో ప్రతిపక్ష నాయకత్వ హోదా కోల్పోయింది జగన్ ఒక్కడే.

– గురజాల మాల్యాద్రి
టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి

మోదీ మ్యాజిక్ ఏమయింది?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్


'రాసిన అక్షరం కన్నా ఉపన్యాసాలే జనాన్ని ప్రభావితం చేస్తాయని నాకు తెలుసు. మహా మహా రచయితలు సాధించలేని మార్పు ఈ భూమిపై గొప్ప వక్తలే సాధించారు' అని జర్మనీ నియంత హిట్లర్ తన ఆత్మకథ 'మెయిన్ కాంఫ్' (ఆంగ్లంలో 'మై స్ట్రగుల్') ముందుమాటలో రాశారు. కాని నేతలు ఎంత గొప్ప వక్తలైనా వారి మాటల్లో నిజాయితీ లేకపోతే, రోజుకో రకంగా మాట్లాడితే, మాట్లాడిన మాటల్లో అబద్ధాలున్నాయని తేలితే ప్రజలు ఆ మాటల్ని విశ్వసించరని ఎవరికి ఎప్పుడు ఎలా బుద్ధి చెప్పాలో వారికి బాగా తెలుసని మంగళవారం నాడు వెల్లడైన 18వ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఈ ఫలితాలను సువర్ణ ఘట్టంగా భావించవచ్చు.

ఒక దశాబ్ద కాలం (2014–24)లో దేశంలో అన్ని వ్యవస్థలపై పట్టు సాధించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ తానేమి చేసినా ప్రజలు హర్షిస్తారని, కేవలం తన ప్రచారంతోనే వారు మైమరిచిపోయి బీజేపీకి పట్టం కడతారని ఆశించినట్లు అర్థమవుతోంది. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా ఆయన దాదాపు 200 ఎన్నికల సభల్లో ప్రసంగించారు. వివిధ భాషల్లో కనీసం 50 టీవీ చానెల్స్‌కు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఎన్నికలు లేనప్పుడు కూడా ఆయన నెలకు కనీసం 20 ప్రసంగాలు చేశారు. టీవీ చానెల్స్, సోషల్ మీడియా యుగం కనుక తన హావభావాలతోనూ, ధ్యానముద్రలతోనూ కూడా జనాన్ని ఆయన ప్రభావితం చేయాలనుకున్నారు. తన పేరును తానే వందలసార్లు ఉచ్చరించారు. బీజేపీకి స్టార్ క్యాంపెయినర్లు ఎంతో మంది ఉన్నప్పటికీ మోదీయే అసలైన స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరించారు. నూతన పార్లమెంట్ భవనం ప్రారంభం నుంచి రాముడి ప్రాణప్రతిష్ఠ వరకు తానొక్కడే అన్నట్లుగా వ్యవహరించారు. పదే పదే ఒకే మాట చెబితే జనం నమ్ముతారేమోనని భావించి చార్ సౌ పార్ (400కు పైగా) సీట్లు సాధిస్తామని చెప్పుకున్నారు. కాంగ్రెస్ ఈ సారి 50 సీట్లు కూడా దాటదని చెప్పారు. తానేది చెబితే జనం అది నమ్ముతారని పరిపూర్ణంగా విశ్వసించిన మోదీ ప్రతిపక్షాలు ప్రజల వనరులను ముస్లింలకు పంచిపెడతారని చెప్పేందుకు కూడా వెనుకాడలేదు. మహాత్ముడిపై రిచర్డ్ అటెన్ బరో సినిమా తీయక ముందు గాంధీ ఎవరో లోకానికి తెలియదని చెప్పేందుకు కూడా ఆయన తెగించారు!

రోజురోజుకూ ఒక వ్యక్తి కేంద్రీకృత వ్యవస్థగా మారిన భారతీయ జనతా పార్టీకి మోదీ తిరుగులేని నాయకుడే కావచ్చు. అయన నాయకత్వానికి ఆయనే ముగ్ధుడై తనది కారణ జన్మ అని, దేవుడే తనను పంపించాడని చెప్పుకున్నారు. పూరీ జగన్నాథుడే మోదీ భక్తుడని బీజేపీ అధికార ప్రతినిధి ఒకరు వ్యాఖ్యానించారు. మోదీ నేతృత్వంలో భారతీయ జనతా పార్టీ నిర్మాణపరంగా ఎంతో ఎదిగిపోయిందని, దానికి ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థ అవసరం ఇక ఏ మాత్రం లేదని భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డాయే ప్రకటించారు. గంటకు పైగా ఇంటర్వ్యూలు చేయడం తప్ప ప్రజల మనసుల్లో ఉన్న ప్రశ్నలను లేవనెత్తాలని జర్నలిస్టుల రూపంలో వచ్చిన టీవీ ప్రతినిధులు కూడా అనుకోలేదు. ఏమైతేనేం దాదాపు 80 రోజులుగా జరిగిన ఎన్నికల ఘట్టంలో ఎన్నో నాటకీయ దృశ్యాలు, భావోద్వేగ ప్రసంగాలు, ఉత్కంఠభరితమైన సన్నివేశాలు చూసే అవకాశం కలిగింది. అంతిమంగా ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన దాదాపు డజన్ సంస్థలు ఎన్డీఏకు 350కి పైగా స్థానాలు లభిస్తాయని, మోదీ అన్నట్లుగా 400 దాటినా ఆశ్చర్యపోనక్కర్లేదని ప్రకటించడంతో ఈ దేశంలో మీడియా సంస్థల ధైర్యం ఎంత దిగజారిపోయిందో, ఎందుకు వారు భయోత్పాతానికి గురయ్యారో అర్థం అవుతుంది. కేవలం షేర్ మార్కెట్ పతనం కాకుండా ఉండేందుకే వారు అలా చేశారా అన్న అనుమానాలూ లేకపోలేదు.

నిజానికి మోదీని ఢీకొనడం అంత సులభం కాదని, ఆయన ఏ విధంగానైనా తాను అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని అనుకున్నవారే ఎక్కువగా ఉన్నారు. చండీగఢ్‌లో మేయర్ ఎన్నికల్లో బ్యాలట్ పేపర్లలో మార్పులు చేయడం, సూరత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పేరును ప్రతిపాదించినవారు రిటర్నింగ్ అధికారి వద్దకు రాలేకపోవడం, ఇండోర్‌లో నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి చివరి నిమిషంలో నామినేషన్ ఉపసంహరించుకోవడం, ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఇద్దరు ముఖ్యమంత్రులు అరెస్టు కావడం వంటి ఘట్టాల తర్వాత ఇక మోదీ ఘన విజయాన్ని ఎవరు ఆపగలరులే అని చాలా మంది భావించారు. ఈడీ, సిబిఐ వంటి సంస్థలు సృష్టించిన భయోత్పాతం అంతా ఇంతా కాదు. పార్లమెంట్‌లో చర్చలు లేకుండా, ప్రతిపక్షాలు లేకుండా బిల్లులు ఆమోదించడంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందనిపించింది. ఎన్నికల బాండ్లపై సుప్రీం తీర్పుతో బీజేపీ అక్రమ నిధుల వసూళ్ల గురించి జనానికి తెలిసినా పెద్దగా పట్టించుకోరేమో అనిపించింది. కాని ఆశ్చర్యకరంగా ఎన్నికల ఫలితాలను చూస్తే మోదీ మాయాజాలం చాలా మటుకు మాయమైపోయినట్లు అర్థమవుతోంది.

నిజానికి ఈ ఎన్నికల్లో ప్రతిపక్షాలు అవసరమైనంత సంఘటితంగా పనిచేయలేదు. ఇండియా కూటమి ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే ఆ పార్టీలో సీనియర్ నాయకుడు నితీశ్ కుమార్ ప్లేటు ఫిరాయించి మరోసారి బీజేపీతో చేతులు కలిపారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్‌లో ఇండియా కూటమి సభ్యులకు తగినన్ని సీట్లు ఇచ్చేది లేదని చెప్పేశారు. పంజాబ్‌లో కూడా కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చింది. కాంగ్రెస్ ఖాతాలను స్తంభింపచేయడంతో ఆ సంస్థ ఆర్థికంగా బలహీనపడింది. మధ్యప్రదేశ్, హర్యానాలాంటి చోట్ల బలమైన కాంగ్రెస్ నేతల్ని బీజేపీ తన వైపునకు తిప్పుకుంది. పశ్చిమ బెంగాల్‌లో ప్రతిపక్ష పార్టీలను నిలువునా చీల్చారు. ఎన్నో బలహీనతలు, సమస్యలు, వనరుల లోపాల మధ్య కొట్టుమిట్టాడుతూ ప్రతిపక్షాలు ప్రచారాన్ని నిర్వహించాయి. మోదీ, ఆయన దళం చేసిన భారీ ప్రచారం ముందు ప్రతిపక్షాల ప్రచారం వెలవెలబోయినట్లు కనిపించింది. అయినప్పటికీ ఇవాళ బీజేపీ గత రెండు ఎన్నికల్లో మాదిరి మెజారిటీ సీట్లు సాధించలేకపోవడం, ఇండియా కూటమికీ, ఎన్డీఏకు మధ్య సీట్ల వ్యత్యాసం బాగా తగ్గిపోవడం మోదీ ఏకచ్ఛత్రాధిపత్యాన్ని జనం కోరుకోవడం లేదని అనుకోవడానికి ఆస్కారం కలిగిస్తుంది.



నిజానికి బీజేపీ నుంచి గెలిచిన వారిలో ఒరిజినల్ బీజేపీ నేతలకన్నా బయటి పార్టీల నుంచి వచ్చిన వారు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారు. మోదీ మూలంగానే బీజేపీకి ప్రాభవం ఏర్పడిందని చెప్పడానికి వీల్లేదు. 2014లో కొన్ని సామాజిక, చారిత్రక, ఆర్థిక కారణాల వల్ల బీజేపీకి ప్రజలు పట్టం కట్టారు. పుల్వామా, బాలాకోట్ సంఘటనలు జరగకపోతే 2019లో బీజేపీకి మెజారిటీ వచ్చేది కాదేమో? కేవలం మోదీ పేరును మార్మోగిస్తే సరిపోదని 2024లో తేలిపోయింది.

ఉత్తరప్రదేశ్ లాంటి బీజేపీ కంచుకోటలో సగానికి సగం సీట్లు కోల్పోవడం, అయోధ్య భాగంగా ఉన్న ఫైజాబాద్‌లోనే బీజేపీ అభ్యర్థి ఓడిపోవడం దేనికి సంకేతం? గతంలో కూడా బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత జరిగిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ పరాజయం పాలైంది. అయోధ్యలో నాడు కూడా బీజేపీ అభ్యర్థి ఓటమి పాలయ్యారు. ఇప్పుడు రామమందిర నిర్మాణం తర్వాత కూడా యూపీలో బీజేపీ ప్రాభవం తగ్గిపోవడం ఏ సంకేతాలు పంపిస్తున్నాయి? రామమందిర నిర్మాణం కల్పించిన భావోద్వేగాలు పొంగే కాని, వాపు కాదని, ఈ దేశంలో మతాన్ని రాజకీయాలతో సమ్మిళితం చేయడాన్ని రాజ్యాన్ని ప్రజలు విశ్వసించడం లేదని అనుకోవాలా? లేక ప్రధానమంత్రి నరేంద్రమోదీ మతాన్ని తన స్వంత రాజకీయాలకు ఉపయోగించుకోవడాన్ని జనం హర్షించడం లేదని భావించాలా? నిజానికి మోదీ వన్ మాన్ షోను కొందరు ఆర్‌ఎస్‌ఎస్ నేతలే హర్షించలేదు. ఈ ఎన్నికల్లో మోదీకి సంపూర్ణ మెజారిటీ రాకపోతేనే మంచిదని, వస్తే తమను కూడా లెక్కచేయరని అనుకున్న ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలు కూడా ఉన్నారు. ఎందుకో నాగపూర్ కూడా ఈ సారి అన్యమనస్కంగానే వ్యవహరించింది. ఆర్‌ఎస్‌ఎస్ పూర్తిగా బీజేపీని వదిలేస్తే ఈ 240 సీట్లు కూడా వచ్చేవి కావని అనుకునేవారు ఉన్నారు.

నిజానికి బీజేపీ నుంచి గెలిచిన వారిలో ఒరిజినల్ బీజేపీ నేతలకన్నా బయటి పార్టీ నుంచి వచ్చిన వారు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారు. ఉదాహరణకు తెలంగాణలో బీజేపీ నుంచి గెలిచిన వారిలో సగానికి పైగా ఇతర పార్టీల నుంచి వచ్చినవారే. కేరళలో సినీనటుడు సురేష్ గోపి బీజేపీ బలంతో కన్నా తన వ్యక్తిగత ఆకర్షణ ఆధారంతో గెలిచారనవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం మద్దతు లేకపోతే బీజేపీకి అసెంబ్లీలో కాని, పార్లమెంట్‌లో కాని ఒక్క సీటు కూడా వచ్చే అవకాశం లేదు. అందువల్ల మోదీ మూలంగానే బీజేపీకి ప్రాభవం ఏర్పడిందని చెప్పడానికి వీల్లేదు. 2014లో కొన్ని సామాజిక, చారిత్రక, ఆర్థిక కారణాల వల్ల భారతీయ జనతా పార్టీకి ప్రజలు పట్టం కట్టారు. పుల్వామా, బాలాకోట్ సంఘటనలు జరగకపోతే 2019లో కూడా బీజేపీకి మెజారిటీ వచ్చేది కాదని చెప్పేవారు కూడా లేకపోలేదు. 2024లో కేవలం మోదీ పేరును మార్మోగిస్తే సరిపోదని తేలిపోయింది.

ఏమైతేనేం పది సంవత్సరాల తర్వాత దేశంలో మళ్లీ సంకీర్ణ రాజకీయాలు ప్రారంభమయ్యాయి. రెండుసార్లు అఖండమైన మెజారిటీతో బీజేపీని గెలిపించినప్పటికీ మోదీ మళ్లీ దేశం సంకీర్ణ యుగంలోకి వెళ్లకుండా చేయలేకపోయారు. ఇది కూడా మంచి పరిణామమే. రాష్ట్రాల ఆకాంక్షలను విస్మరించకుండా ఉండేందుకు ఇది తోడ్పడుతుంది. నిజానికి ఈ పదేళ్ల ప్రజాస్వామికంగా, ఏకాభిప్రాయ సాధనతో పరిపాలన సాగించి ఉంటే, ప్రతిపక్షాలనూ విశ్వాసంలోకి తీసుకుని ఉంటే, అన్ని వ్యవస్థల్నీ నియంత్రణలోకి తీసుకోకుండా వాటిని పారదర్శకంగా స్వేచ్ఛగా పని చేయించి ఉంటే, ఏడాదికి కనీసం ఒక్క విలేఖరుల సమావేశమైనా నిర్వహించి అరమరికలు లేకుండా మాట్లాడి ఉంటే, ప్రతిపక్షాలను అణచివేయాలన్న ఆలోచనను వదిలిపెట్టి ఉంటే మోదీ మళ్లీ భారీ మెజారిటీతో తిరిగి వచ్చేవారేమో. ఒక బలమైన వ్యవస్థ, బలమైన భావజాలం ఉన్నప్పటికీ అవి ఒక వ్యక్తి చుట్టూ తిరిగితే విజయవంతం కాలేవని ఈ ఎన్నికలు స్పష్టం చేశాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

స్వచ్ఛమైన పర్యావరణమే గొప్ప వారసత్వ ఆస్తి!

భూమిపై ఉన్న అన్ని జీవులకు పర్యావరణం ప్రాథమిక జీవన సహాయక వ్యవస్థ. ఇది సహజ, మానవ నిర్మిత భాగాల కలయిక. సహజ భాగాలలో గాలి, నీరు, భూమి, జీవులు ఉన్నాయి. రోడ్లు, పరిశ్రమలు, భవనాలు మొదలైనవి మానవ నిర్మిత భాగాలు. సహజ వాతావరణాన్ని నాలుగు ప్రధాన భాగాలుగా విభజించవచ్చు – బయోస్పియర్, లిథోస్పియర్, హైడ్రోస్పియర్, అట్మాస్పియర్. భూమిపై పొరను లిథోస్పియర్ అని పిలుస్తారు. ఇది రాళ్ళు, ఖనిజాలతో చేసిన నేల పలుచని పొర. హైడ్రోస్పియర్ సముద్రాలు, మహాసముద్రాలు, నదులు, సరస్సులు, చెరువులు మొదలైన నీటి వనరులను కలిగి ఉంటుంది. నీటి ఆవిరి, వాయువులు, ధూళి కణాలతో కూడిన వాతావరణం భూమిని చుట్టుముట్టే గాలి పొర. మానవులు, మొక్కలు, జంతువులతో కూడిన జీవ ప్రపంచం జీవగోళాన్ని ఏర్పరుస్తుంది. పర్యావరణాన్ని తయారు చేయడంలోనూ, విచ్ఛిన్నం చేయడంలోనూ మానవులు భారీ పాత్ర పోషిస్తున్నారు. భూమిపై అత్యున్నత మేధోశక్తిగా, మానవులు పర్యావరణ క్షేమాన్ని చాలావరకు ప్రభావితం చేస్తారు. అన్ని జీవులపై పర్యావరణ ప్రభావం మానవులు పర్యావరణంతో వ్యవహరించే విధానానికి నేరుగా అనులోమానుపాతంలో వుంటుంది. గాలి, నీరు లేదా భూమి లేకుండా ఎలాంటి ఉనికి సాధ్యం కాదు.

భూమిపై సంచరించే అన్ని రకాల ప్రాణుల ఉనికికి పర్యావరణమే ప్రాథమిక మూలం. అయితే, నేడు పర్యావరణం విపరీతంగా దోపిడీ చేయబడుతోంది, దీని కారణంగా పర్యావరణ పరిస్థితులు రోజురోజుకు అధ్వాన్నంగా మారుతున్నాయి. గాలి, నీరు మరియు భూమి కాలుష్యం, మైనింగ్, పారిశ్రామికీకరణ, ఆధునిక పట్టణీకరణ, అటవీ నిర్మూలన, రసాయన వ్యర్థాల విడుదల వంటివి పర్యావరణం క్రమంగా క్షీణించడానికి కారణమయ్యే కొన్ని ప్రధాన కారకాలు.

పర్యావరణపు వేగవంతమైన క్షీణతను తగ్గించడానికి ప్రపంచ నాయకులు కృషి చేస్తున్నారు. అలాగే ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు పర్యావరణ సమస్యలను అరికట్టడానికి ప్రజలకు అవగాహన కల్పించడానికి, చర్యలు తీసుకోవడానికి చొరవతో ముందుకు వచ్చాయి. ఈ కార్యక్రమాల్లో కొన్ని 2019 సస్టైనబుల్ డెవలప్‌మెంట్ సమ్మిట్, 2019 క్లైమేట్ యాక్షన్ సమ్మిట్, సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ కోసం 2030 ఎజెండా, పారిస్ ఒప్పందం, ఇంకా నదుల సంరక్షణ, అటవీ పెంపకం, తీర నిర్వహణ, చిత్తడి నేల పరిరక్షణ మొదలైన అనేక ఇతర కార్యక్రమాలు చేపట్టాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మొక్కుబడి కార్యక్రమాలు చేస్తున్నాయి. ప్రచార ఆర్భాటంగా పర్యావరణ దినోత్సవం రోజున కొన్ని మొక్కలు నాటుతున్నాయి. నాయకుల పర్యటనల సందర్భంగా అవి అడ్డుగా ఉంటున్నాయని అధికారులు కొన్ని చెట్లను నరికేస్తున్నారు. ఇలాంటి విధానాలకు స్వస్తి చెప్పాలి. చిత్తశుద్ధితో మొక్కలు నాటి, వాటి పోషణ భారాన్ని కూడా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో స్వీకరించాలి. కవులు, రచయితల నుండి పర్యావరణ సాహిత్యాన్ని ఆహ్వానించి, ప్రోత్సహించి పుస్తకాలుగా అచ్చేసి రేపటితరానికి అందించాలి. పర్యావరణం కేంద్రంగా పాఠ్యపుస్తకాలను రూపొందించాలి.

వన్యప్రాణులు, వివిధ జాతుల మనుగడ కోసం పర్యావరణాన్ని పరిరక్షించడం అవసరం. వాతావరణ మార్పుల వినాశకరమైన వేగంతో, కాలుష్యం – పర్యావరణం దోపిడీ ఫలితంగా, పర్యావరణానికి మరింత నష్టం జరగకుండా రక్షించే మార్గాలను కనుగొనడం మొదటి ప్రాధాన్యతగా వుండాలి. పర్యావరణాన్ని మానవ దోపిడీకి ముందున్న పూర్వ స్థితికి తీసుకురావడం చాలా ముఖ్యమైన, ఏకైక పరిష్కారం.

కొందరు తమ స్వార్థం కోసం కొండల్ని పిండి చేస్తున్నారు, చెట్లన్నీ నేల కూలుస్తున్నారు, నీటి నిల్వల్ని పీల్చేస్తున్నారు, జంతువుల్ని వేటాడి చంపుకు తింటున్నారు, పక్షుల్ని కాల్చుకు తింటున్నారు. మొత్తం పర్యావరణాన్ని దోచేసి ఆర్థిక నిల్వల్ని పెంచుకుంటున్నారు. రేపటి తరానికి అసలు పర్యావరణ పచ్చదనపు ఆనవాలు లేకుండా చేస్తున్నారు. మంచి గాలి, నీరు, భూమి, ఆహ్లాదం లేకుండా రేపటితరం ఎలా జీవించగలుగుతుంది? ఆస్తులుంటే సరిపోతుందా? పీల్చేందుకు ఆక్సిజన్ అవసరం లేదా? పర్యావరణ పరిరక్షణంతా ప్రభుత్వ బాధ్యతగానే భావించకుండా ప్రజలు కూడా తమవంతుగా కృషి చేయాల్సిన అవసరం వుంది. పచ్చని పర్యావరణాన్ని కొల్లగొట్టడం మాని, మనిషికొక మొక్కయినా నాటాలి. ఆ కోట్లాది మొక్కలు నేలపై తల ఎత్తుకు నిలబడి, మన ఆరోగ్యాన్ని అనారోగ్యం వైపునకు వాలిపోకుండా నిలబెడతాయి.

– కలిమిశ్రీ, నవ్యాంధ్ర రచయితల సంఘం
(నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా : నారాయణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): భారీ విజయాన్ని అందించిన నెల్లూరు నగర ప్రజలందరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఎమ్మెల్యేగా గెలుపొందాక కౌంటింగ్ కేంద్రంలో మంగళవారం ఆయన ఆర్వో వికాస్ మర్మత్ నుంచి డిక్లరేషన్ ఫారం అందుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. నగర ప్రజలు 72,489 ఓట్ల మెజారిటీతో తనను గెలిపించడం ఆనందంగా ఉందని, నగరంలోని సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. 2014 నుంచి 2019 వరకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని, మిగిలిపోయిన వాటిని వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయకుండా వదిలేసిందన్నారు. జగన్ అరాచక పాలన కారణం గానే ఈ ఎన్నికల్లో వైసీపీని ప్రజలు 11 స్థానాలకే పరిమితం చేశారన్నారు. టీడీపీ విజయానికి కార్యకర్తలు ఎంతో శ్రమించారని, వారికి అండగా ఉండాలన్న ఉద్దేశంతోనే తన కుటుంబ సభ్యులంతా కలిసి ఏడాదికి రూ.10 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.



నెల్లూరులోని కౌంటింగ్ సెంటర్‌లో ఆర్వో నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకుంటున్న పొంగూరు నారాయణ

నగరంలో నారాయణ మంత్రం

- 70 వేల మెజారిటీతో మాజీ మంత్రి ఘన విజయం
- ఏ రౌండ్‌లోనూ పోటీ ఇవ్వలేకపోయిన వైసీపీ

నెల్లూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : అందరూ ఊహించినట్లుగానే నెల్లూరు సిటీ నియోజకవర్గంలో కూటమి జెండా రెపరెపలాడింది. టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి పొంగూరు నారాయణ 72,489 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొంది రికార్డు బద్దలు కొట్టారు. వైసీపీ అభ్యర్థి ఎండీ ఖలీల్ అహ్మద్ ఏ దశలోనూ నారాయణకు పోటీ ఇవ్వలేకపోయారు. నారాయణకు ఈవీఎంల ద్వారా 1,18,126 ఓట్లురాగా, ఖలీల్‌కు 47,613 ఓట్లు వచ్చాయి. మొత్తం 18 రౌండ్లలోనూ టీడీపీ తన ఆధిపత్యాన్ని చూపింది. ప్రతి రౌండ్‌కూ ఆధిక్యత పెరిగింది తప్ప ఎక్కడా తగ్గలేదు. ఆ ప్రాంతం, ఈ ప్రాంతం అని లేకుండా నగర నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో కూడా టీడీపీ ఆధిక్యత కనిపించింది. పోస్టల్ బ్యాలెట్‌లోనూ టీడీపీ హవా కొనసాగింది. మొత్తం 3,071 పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు గాను 2425 ఓట్లు నారాయణకు దక్కడం విశేషం. ఖలీల్‌కు 449 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మాత్రమే దక్కాయి. మొత్తంగా 69 శాతం ఓట్లను నారాయణ దక్కించుకున్నారు. సిటీ నియోజకవర్గ చరిత్రలో ఇంత మెజారిటీ ఒక రికార్డుగా చెప్పుకుంటున్నారు. గత ఎన్నికల్లో 2 వేల ఓట్లలోపు స్వల్ప తేడాతో నారాయణ ఓటమి చెందిన విషయం తెలిసిందే. అయితే గడిచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో నెల్లూరు నగరవాసులు విసిగిపోయారు. అభివృద్ధి పనుల ఊసే కనిపించలేదు. పైగా కక్షసాధింపు రాజకీయాలకు వైసీపీ పాల్పడడంతో నగరవాసులు కసిగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. 2019తో పోలిస్తే ఐదు శాతానికిపైగా పోలింగ్ శాతం పెరగడం, ఆ ఓట్లన్నీ టీడీపీకి పడడంతో భారీ మెజారిటీ దక్కింది. పొంగూరు నారాయణ తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. నెల్లూరు సిటీ నుంచి మరో కొత్త వ్యక్తి ఎమ్మెల్యేగా ఎన్నికవడం విశేషం.

పేరు : పొంగూరు నారాయణ, **జననం :** 1956 జూన్ 15, నెల్లూరు

తల్లిదండ్రులు : సుబ్బరామయ్య, సుబ్బమ్మ, **విద్యాభ్యాసం :** ఎంఎస్సీ, పీహెచ్‌డీ

రాజకీయ నేపథ్యం : చదువు పూర్తయ్యాక నెల్లూరులోని వీఆర్ కాలేజీలో పార్ట్ టైం లెక్చరర్‌గా ప్రస్థానం ప్రారంభించారు. 1979లో హరనాథపురంలో ఓ చిన్న గదిలో నారాయణ ట్యూషన్ సెంటర్‌ను మొదలుపెట్టారు. అనతికాలంలోనే అది కోచింగ్ సెంటర్‌గా అభివృద్ధి చెందింది. పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించడంతో అక్కడి నుంచి నారాయణ వెను దిరిగి చూడలేదు. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా నారాయణ విద్యాసంస్థలు ఇప్పుడు దేశ వ్యాప్తంగా విస్తరించి ఉన్నాయి. 1998లో చంద్రబాబుతో పరిచయం నారాయణను రాజకీయాలవైపు అడుగులు వేసేలా చేసింది. తొలుత టీడీపీ సర్వే విభాగంలో పనిచేసిన నారాయణ, ఆ తర్వాత 2004-14 మధ్య కాలంలో పార్టీ అంతర్గత వ్యవహారాల్లో క్రియాశీలంగా పనిచేశారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీగా ఎంపికై చంద్రబాబు మంత్రి వర్గంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. రాజధాని అమరావతి నిర్మాణంలో కీలకంగా వ్యవహరించారు. 2019లో తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లో నారాయణ నెల్లూరు సిటీ నుంచి పోటీ చేశారు. తాజాగా ఎన్నికల్లో విజయం సాధించారు.

రూరల్‌లో కోటంరెడ్డి హ్యాట్రిక్

31 వేల మెజారిటీతో ఆదాలపై గెలుపు ● పోస్టల్ బ్యాలెట్‌లోనూ భారీ ఆధిక్యత



నెల్లూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరోసారి తన ఆధిపత్యాన్ని చాటారు. వరుసగా మూడో సారి ఎమ్మెల్యేగా గెలుపొంది రికార్డు సాధించారు. రూరల్ నియోజకవర్గంలో హ్యాట్రిక్ సాధించిన తొలి ఎమ్మెల్యే కోటంరెడ్డి కావడం విశేషం. వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిపై 34,480 వేల ఓట్ల తేడాతో విజయాన్ని అందుకున్నారు. నెల్లూరు నగరంలోని డివిజన్లతోపాటు రూరల్ మండలంలోని గ్రామాల్లో విస్తరించిన నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలు కోటంరెడ్డికి పట్టం కట్టాయి. శ్రీధర్‌రెడ్డికి ఈవీఎంల ద్వారా 1,06,587 ఓట్లు రాగా, ఆదాలకు 74,275 ఓట్లు దక్కాయి. తొలి రౌండు నుంచే శ్రీధర్‌రెడ్డి ఆధిక్యత మొదలైంది. ఆ తర్వాత ఎక్కడా కూడా ఆదాల ఆధిక్యంలోకి రాలేకపోయారు. ప్రధానంగా నెల్లూరు నగరం లోని డివిజన్లు కోటంరెడ్డికి భారీ మెజారిటీని అందించాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలకూ అందకుండా రూరల్‌లో వార్ వన్‌సైడ్‌గా కనిపించింది. పోస్టల్ బ్యాలెట్‌లో కూడా టీడీపీ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మొత్తం 5,418 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదుకాగా వాటిలో కోటంరెడ్డికి 3388 దక్కాయి. ఆదాలకు 1220 పోస్టల్ బ్యాలెట్లు దక్కగా 645 ఓట్లు తిరస్క రణకు గురికావడం విశేషం. మొత్తంగా 56.53 శాతం ఓట్లను శ్రీధర్‌రెడ్డి దక్కించుకున్నారు. నిత్యం ప్రజల్లో తిరగడం, వైసీపీ పాలక పక్షంలో ఉన్నప్పుడు కూడా ప్రజా సమస్యలపై పోరాడటం ఆయన విజయానికి ప్రధాన కారణాలుగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వైసీపీ తీరును నిరసిస్తూ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చాక శ్రీధర్‌రెడ్డి బలం మరింత పెరిగింది. అదే సమయంలో కూటమి గాలి వీయడంతో గత ఎన్నికలతో పోలిస్తే ఎక్కువ మెజారిటీని సాధించారు.

పేరు : కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, **జననం :** 1964 సెప్టెంబరు 26, సంగం మండలం పడమటిపాలెం, **తల్లిదండ్రులు :** కోటంరెడ్డి బేబిరెడ్డి, సరళమ్మ **విద్యాభ్యాసం :** డిగ్రీ

రాజకీయ నేపథ్యం : 1977లో తొలిసారి విద్యార్థి రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1981లో విద్యార్థి సంఘం నాయకుడిగా ఎన్నికయ్యారు. 1985లో వీఆర్ కాలేజీ స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్‌గా ఎన్నికై, కాలేజీ సమస్యలపై 13 రోజుల ఆమరణ నిరాహార దీక్ష చేశారు. 1986లో ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ సభ్యుడిగా ఎన్ని కయ్యారు. ఆ తర్వాత యూత్ విభాగం ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1987 నుంచి 2014 వరకు రాజకీయాల్లో చురుగ్గా ఉంటూ అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారు. సమగ్ర సోమశిల, కండలేరు, తెలు గుగంగ ప్రాజెక్టు కోసం పోరాటం, ఆల్మట్టి ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడుతూ నెల రోజులు జిల్లాలో రథయాత్ర, రైతులకు గిట్టుబాటు ధర కోసం పోరాటం, విజయ మహల్ గేటు వద్ద బాక్స్ టైప్ బ్రిడ్జి కోసం ఉద్యమం, టోల్ గేట్ ఏర్పాటుకు వ్యతి రేకంగా పోరాటం వంటివి కోటంరెడ్డి ఉద్యమాల్లో కీలకమైనవి. 2014లో వైసీపీ తరఫున రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి తొలి సారి ఎమ్మెల్యేగా ఎన్నిక య్యా రు. 2019లో రెండో సారి కూడా వైసీపీ తరఫున రూరల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2023లో వైసీపీ నుంచి బయటకు వచ్చి టీడీపీలో చేరి తాజా ఎన్నికల్లో ముచ్చటగా మూడో సారి కూడా ఎమ్మెల్యే పీఠం దక్కించుకున్నారు.



తన నివాసంలో కేక్ కట్ చేసి డాక్టర్ శివప్రసాద్‌కు తినిపిస్తున్న బీద రవిచంద్ర



టీడీపీ జిల్లా కార్యాలయానికి విద్యుత్ వెలుగులు



నారాయణ క్యాంపు కార్యాలయంలో పిల్లలతో కేక్ కట్ చేయిస్తున్న నారాయణ కుటుంబ సభ్యులు

గెలుపు సంబరాలు



బాణసంచా కాల్చుతున్న జనసైనికులు

నెల్లూరు(వైద్యం), జూన్ 4 : పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో తిరుగులేని ఫలితాలు రావడంతో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాల్లో మునిగాయి. కూటమిలో భాగస్వాములైన బీజేపీ, జనసేన పార్టీల కార్యాలయాల వద్ద కూడా సందడి నెలకొంది. టీడీపీ జిల్లా కార్యాలయంలో నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. పార్టీ జాతీయ కార్యదర్శి బీద రవిచంద్రకు, పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మిఠాయిలు తినిపించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యాలయంలో భారీ టెలివిజన్ స్క్రీన్ ఏర్పాటు చేయడంతో నేతలు, కార్యకర్తలు ఆ తెర మీద ఎన్నికల ఫలితాలు వీక్షిస్తూ సంబరాలు చేసుకున్నారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు నెల్లూరు పార్లమెంట్ స్థానాన్ని కూడా టీడీపీ కైవశం చేసుకోవటంపై నేతలు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే బీద రవిచంద్ర నివాసంలో కేక్‌కట్ చేసి విజయోత్సవం జరుపుకున్నారు. ఇందులో మాజీమంత్రి తాళ్లపాక రమేష్‌రెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజెర్ల వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ జెడ్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ జిల్లాలోనే అత్యధికంగా 72వేలకుపైగా మెజారిటీతో గెలుపొందటంతో నారాయణ క్యాంపు కార్యాలయంలో సంబరాలు జరిగాయి. నారాయణ సతీమణి రమాదేవి, కుమార్తెలు సింధూర, శరణి పిల్లలతో కేక్‌కట్ చేయించి అందరికీ పంచిపెట్టారు నారాయణ క్యాంపు కార్యాలయంతోపాటు, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కార్యాలయం, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కార్యాలయాల్లోనూ పెద్ద పెద్ద తెరలు ఏర్పాటు చేయడంతో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడ చేరారు. ఫలితాలు తెలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు. విజేతలకు శుభాకాంక్షలు తెలిపి సంబరాల్లో మునిగారు. నగరంలోని 47 డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ ధర్మవరపు సుజాతరావు ఆధ్వర్యంలో మహిళలు సంబరాలు చేసుకున్నారు.



ఉదయగిరిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



కందుకూరు : టీడీపీ కార్యకర్తల విజయోత్సవం

బీజేపీ కార్యాలయంలో...

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి భారీ విజయం సాధించడంతో నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయం ఎదుట నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి, ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో వరుసగా మూడోసారి ఎన్‌డీఏ కూటమి అధికారం చేపట్టనుండటం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడారని, రాజకీయాల్లో అహం ఉన్న వారికి ప్రజలు ఇలానే బుద్ధి చెబుతారన్నారు.



సంబరాలు చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు



సంగంలో మేళతాళాలతో అభిమానుల సంబరం



పొదలకూరు శివాలయంలో టెంకాయలు కొడుతున్న టీడీపీ నాయకురాలు ఆదాల సుగుణమ్మ, అభిమానులు

ఉద్యోగుల హర్షం

నెల్లూరు(హరనాథపురం), జూన్ 4 : టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభంజనంతో ఉద్యోగ వర్గాల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. తమకు స్వేచ్ఛ లభించిందంటూ వారు ఆనందపడ్డారు. కొత్త ప్రభుత్వంలో తమ ప్రయోజనాలకు పెద్ద పీటవేస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు.

రాబోవు ప్రభుత్వానికి శుభాకాంక్షలు



కొత్తగా ఏర్పాటు కాబోతున్న టీడీపీ ప్రభుత్వానికి శుభాకాంక్షలు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజ నాలను విస్మరిస్తే ఏ ప్రభుత్వానికైనా గుణపాఠం తప్పదు.. కూటమి ప్రభుత్వంలో ఉద్యోగుల ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తారని ఆశిస్తున్నాం.

- ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి

సంతోషదాయకం



టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు రాష్ట్ర వ్యాప్తంగా విజయ దుందుభి మోగించటం సంతోషదాయకం. ప్రభుత్వ ఉద్యోగులు కోల్పోయిన స్వేచ్ఛను తిరిగి పొందబోతున్నారు. ఉద్యోగులను అణచివేసిన ఏ ప్రభుత్వానికైనా గుణపాఠం తప్పదు.

- చేజర్ల సుధాకర్‌రావు, హంస జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రశాంత వాతావరణం

కూటమి ప్రభంజనంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రశాంత వాతావరణం ఏర్పడింది. ఉద్యోగులకు స్వేచ్ఛ లభిస్తుంది. కొత్తగా ఏర్పాటు కానున్న ప్రభుత్వానికి శుభాకాంక్షలు. ఉద్యోగుల ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వాలి.

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీ వెంకటరాజు, ప్రధాన కార్యదర్శి నాటకం తిరుమలయ్య

అభిమాని ఆనందం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 4: తెలుగుదేశం పార్టీ తరఫున అతను ఎన్నికల్లో పోటీ చేయలేదు... పార్టీలో ద్వితీయ, తృతీయ స్థాయి నాయకుడు కూడా కాదు.... పది మందిని పోగేసుకొని స్వీట్లు పంచిపెట్టి, బాణాసంచా చేసేంత డబ్బులు అతని వద్ద లేవు.... ఇవేవీ లేకపోయినా ఆ కార్యకర్తకు పార్టీ కోసం ప్రాణాలిచ్చేంత అభిమానం ఉంది. ఎన్నికల్లో టీడీపీ చరిత్రాత్మక విజయాన్ని సొంతం చేసుకోవడంతో శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన సింహాచలం అనే వ్యక్తి నెల్లూరు నగరంలో సైకిల్‌కు టీడీపీ జెండాలు కట్టుకొని ఎన్టీఆర్, బాలకృష్ణ ఫొటోలు పెట్టుకొని కళ్లద్దాలు ధరించి విక్టరీ సింబల్ చూపుతూ మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని నవాబుపేట నుంచి అయ్యప్పగుడి వరకు ఒక్కడే సైకిల్‌పై జై తెలుగుదేశం...జైజై తెలుగుదేశం అంటూ విజయోత్సవ ర్యాలీగా సాగాడు. నందమూరి తారక రామారావు అంటే ప్రాణమని, ఆయన పార్టీ స్థాపించినప్పటి నుంచి అందులోనే కొనసాగుతున్నానని సింహాచలం తెలిపాడు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన తాను ఉపాధి కోసం నెల్లూరు నగరానికి వచ్చానని, పార్టీ భారీ విజయం నమోదు చేయడంతో తనకు రూ.కోటి సంపాదించినంత ఆనందం కలుగుతోందని సంబరపడ్డాడు.


జెండాలతో సైకిల్‌పై ఒక్కడే ర్యాలీ



సొంత మండలంలోనే చతికిలా!

- మంత్రి కాకాణికి గట్టి దెబ్బ

పొదలకూరు, జూన్ 4 : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ ఎన్నికల్లో సొంత మండలంలోనే చతికిలపడ్డారు. 2014 ఎన్నికల్లో తన ప్రత్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై 5457 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఒక్క పొదలకూరు మండలంలోనే 5457 ఓట్లు రావడంతో అదే తన నియోజకవర్గ మెజారిటీగా నిలబడింది. అప్పట్లో కాకాణి విజయం సాధించ డంలో పొదలకూరు మండలం కీలక పాత్ర పోషించింది. తన సొంత మండలం లోని ఓటర్లు ఆదుకోకుంటే ఆ ఎన్నికల్లో కాకాణి ఓటమి చెందేవాడని పలువురు అభిప్రాయపడ్డారు. 2019 ఎన్నికల్లో మంత్రి కాకాణి తన ప్రత్యర్థి సోమిరెడ్డిపై 14వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. వీటిలో ఒక్క పొదలకూరు మండలంలోనే 4606 ఓట్లు ఆధిక్యత సాధించారు. అయితే ప్రస్తుత ఎన్నికల్లో మాత్రం కేవలం 55 ఓట్లు మాత్రమే మండలంలో మంత్రి కాకాణికి ఆధిక్యత లభించింది. మండలంలో 59,937 ఓట్లు ఉండగా 48,005 ఓట్లు పోల్ అయ్యాయి. మండ లంలోని 73 పోలింగ్ బూత్‌ల్లో ఆరు రౌండ్ల లెక్కింపులో మండలం మొత్తానికి 23,785 ఓట్లు మంత్రి కాకాణికి రాగా, టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి 23,730 ఓట్లు వచ్చాయి. అయితే గత ఎన్నికల్లో సొంత మండలం అయిన పొదలకూరు నుంచి కాకాణి అత్యధిక మెజారిటీ సాధిస్తూ వచ్చారు. గత ఎన్నికల్లో పొదలకూరు టౌన్‌లో 250 ఓట్లు టీడీపీకి ఆధిక్యం రాగా, ఈదఫా 1617 ఓట్లు టీడీపీకి ఆధిక్యం లభించింది. అయితే ఎన్నికల్లో పొదలకూరు నుంచే ఆయన పతనం ప్రారంభ మైందని రాజకీయ విశ్లేషకులు చెప్పుకొచ్చారు. మంత్రి కాకాణి ప్రధానంగా మండలంలో ప్రత్యర్థులను కేసుల్లో ఇరికించడం, ఆయన, అనుచరులు చేపట్టిన అవినీతి, అరాచకాలు, మండలంలో రూ.కోట్లలో తెల్లరాయి, ఇసుక, గ్రావెల్ దోపిడీ, డేగపూడి - బండేపల్లి కాలువ పనులు, కండలేరు లిఫ్ట్, లైనింగ్ పనులు పెండింగ్ ఇవన్నీ పొదలకూరు మండలంలో అతని మెజారిటీ తగ్గడానికి కారణాలుగా కొందరు పేర్కొంటున్నారు.



కోవూరులో తొలీగా నారీ.. జయభేరి!

- భారీ మెజార్టీతో ప్రశాంతిరెడ్డి విజయం

కోవూరు : కోవూరు నియోజకవర్గ శాసనసభ్యురాలిగా టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి 54,583 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. కౌంటింగ్ ప్రారంభమైన మొదటి రౌండ్ నుంచి సమీప ప్రత్యర్థి నల్లప రెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డిపై ఆధిక్యత కొనసాగారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం మునులపూడి నుంచి ఇందుకూరుపేట మండలం పంచాగ్నులవారి కండ్రిగ పోలింగ్‌బూత్‌ల వరకు లెక్కించిన అన్ని రౌండ్ల లోనూ మెజార్టీ కొనసాగింది, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, కొడవలూరు, విడవలూరు, ఇందు కూరుపేట మండలాల్లోని ఓటర్లు ఆమెకు బ్రహ్మరథం పట్టారు. పోస్టల్ బ్యాలెట్లలో సైతం ఆమె ఆధిక్యత సాగించారు.

- **చారిత్రక రికార్డు..**

కోవూరు అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పోటీచేయడం, భారీ మెజార్టీ సాధించడం చారిత్రక రికార్డుగా భావిస్తున్నారు. గత 2019 ఎన్నికలలో వైసీపీ అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డి 39,891 ఓట్ల మెజార్టీ సాధించారు. ఆయన రికార్డును అధిగమించి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి భారీ మెజార్టీ సాధించడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- **సాధారణ గృహిణి శాసనసభకు...**

సాధారణ గృహిణిగా జీవితం కొనసాగిస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శాసనసభలో అడుగు పెడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో భర్త రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ప్రోత్సాహంతో ఆమె తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి సభ్యురాలిగా పనిచేశారు. తిరుపతిలోని ఎస్వీ మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్ చదివే సమయంలో విద్యార్థి సంఘ ఎన్నికల్లో పోటీచేసి కార్యదర్శిగా గెలుపొందారు. అప్పటి నుంచే ఆమెకు రాజకీయాల్లో ఆసక్తి ఉన్నప్పటికీ చొరవ చూపలేకపోయారు. ధార్మిక కార్యక్రమాలకే పరిమితమయ్యారు. టీడీపీ నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలుపొందిన ఆమె భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ప్రోత్సాహంతో కోవూరు నియోజకవర్గ స్థానానికి పోటీకి దిగి విజయం సాధించారు.



- **దేశ, రాష్ట్ర రాజకీయాల్లో విశిష్ట స్థానం**

నెల్లూరు పార్లమెంటు స్థానం నుంచి గెలుపొందిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు నుంచి శాసనసభకు ఎన్నికైన ప్రశాంతిరెడ్డి దంపతులు దేశ, రాష్ట్ర రాజకీయాల్లో విశిష్ట స్థానాన్ని పొందే అవకాశముందని భావిస్తున్నారు. ఈ దంపతులపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. కోవూరు నుంచి ఓ మహిళ ఎన్నిక కావడం రాష్ట్ర రాజకీయాల్లో ప్రముఖ స్థానాన్ని పొందనున్నారనే సమాచారంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చివరి వరకూ ఉత్కంఠ !

● ఆత్మకూరులో ఆనం, ఉదయగిరిలో కాకర్లదే విజయం
● ఆనంకు 7,576 ఓట్లు, కాకర్లకు 9,566 ఓట్ల మెజార్టీ
● గట్టిపోటీనే ఇచ్చిన బాబాయ్.. అబ్బాయ్‌లు

ఆత్మకూరు, ఉదయగిరి జూన్ 4: ఉత్కంఠభరితంగా సాగిన ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల కౌంటింగ్‌లో టీడీపీ అభ్యర్థులు ఆనం రామనారాయణరెడ్డి, కాకర్ల సురేష్‌లు ఎట్టకేలకు విజయకేతనం ఎగురవేశారు. ఆనం తన ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డిపై 7,576ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 20రౌండ్లులో 8రౌండ్లు స్వల్ప తేడాతో వెనుకబడినా, తదనంతరం తన ఆధిక్యత పరంపరను కొనసాగించారు. ఉదయగిరిలో కాకర్ల సురేష్ 24రౌండ్లలో వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మధ్య పోటాపోటీగా ఫలితాలు వెలుబడ్డాయి. చివరికి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్‌కు విజయం వరించింది. కాకర్లకు 101,589 ఓట్లు పోలవగా, వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి 92,023 ఓట్లు వచ్చాయి. 9,566ఓట్లతో టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ విజయం సాధించారు. వైసీపీ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకత, ఆత్మకూరులో ఆయన చేపట్టిన అభివృద్ధి, కూటమి ప్రాబల్యమే విజయానికి బ్రహ్మాస్త్రంగా మారింది. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుపై ప్రజల్లో ఉన్న నమ్మకం, సూపర్‌సిక్స్ పథకాలు, సానుభూతి పవనాలే వీరికి విజయానికి అనుకూలంగా మారాయి.


గెలిచినట్టు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఆనం


ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కాకర్ల సురేష్

● ఆత్మకూరులో 83.49 శాతం పోలింగ్

నియోజకవర్గంలో 2,15,401 మంది ఓటర్లలో 1,79,829 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వేయడంతో 83.49శాతం పోలింగ్‌గా నమోదు అయ్యింది. అందులో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డికి 87,106ఓట్లు, వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డికు 80,226ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి చేవూరు శ్రీధర్‌రెడ్డికి 2812ఓట్లు, బీఎస్‌పీ అభ్యర్థి తోటగిరి కృష్ణయ్య 1066 ఓట్లు పడ్డాయి. మిగిలిన పార్టీల అభ్యర్థులకు చెప్పుకోదగ్గ ఓట్లు పోల్ కాలేదు. టీడీపీ అగ్రనేతలు, మాజీ ఎమ్మెల్యేలు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్య మేనల్లుడు తాళ్లూరు గిరినాయుడు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గూటూరు మురళీ కన్నబాబు వర్గీయులు ఐక్యంగా ఆనం విజయానికి కృషి చేశారు.

● వైసీపీ ఆధిపత్య మండలాల్లో ఆధిక్యతకు గండి

ఈ ఎన్నికల్లో వైసీపీ ఆధిపత్యం ఉన్న అనంతసాగరం, మర్రిపాడు, సంగం మండలాల్లో ఆధిక్యతకు గండి పడింది. ఆత్మకూరు, సంగం, చేజర్ల మండలాల్లో ఆనం తన ఆధిక్యతను కొనసాగించారు. సంగం మండలంలో 3,446 ఓట్లు, చేజర్ల మండలంలో 2,321, ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో 1,869 ఓట్లు, ఆత్మకూరు రూరల్‌లో 1,007ఓట్లు ఆధిక్యతను సాధించాడు. వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డికి తన సొంత మండలమైన మర్రి పాడులో 934 ఓట్లు, అనంతసాగరంలో 493, ఏఎస్‌పేట మండలంలో 691 ఓట్లు వచ్చాయి.

● ఉదయగిరిలో 81.92 శాతం పోలింగ్

ఉదయగిరి నియోజకవర్గంలో 2,41,861 మంది ఓటర్లు ఉండగా అందులో 1,20,108 మంది పురుషులు, 1,21,743 మంది మహిళలు, 10మంది ఇతర ఓటర్లు ఉన్నారు. 1,97,970 మంది ఓటు వినియోగించుకున్నారు. అందులో 99,413మంది పురుషులు, 98,554 మంది మహిళలు, 3 ఇతరులు తమ ఓటు హక్కు వినియోగించుకొన్నారు

● ప్రతిరౌండ్‌లోనూ పోటాపోటీ..

సీతారామపురం మండలంలో 14,715, ఉదయగిరిలో 24,238 ఓట్లు, దుత్తలూరు మండలంలో 18,152 ఓటు, వరికుంటపాడు మండలంలో 22,177 ఓట్లు, వింజమూరులో 26,093 ఓట్లు పోలయ్యాయి. కలిగిరి 31,637 ఓట్లు, కొండాపురంలో 28,455 ఓట్లు, జలదంకిలో 32,503 ఓట్లు పోలయ్యాయి.

టీడీపీ నాయకుల సంబరాలు

ఉదయగిరి రూరల్, జూన్ 4: ఓట్ల లెక్కింపులో టీడీపీ కూటమి రాష్ట్రంలో ప్రభంజనం సృష్టించడంతో పట్టణంలో టీడీపీ నాయకులు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ కాలనీ, చెంచలబాబు అతిథిగృహంలో కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, నరసింహ పాల్గొన్నారు.

కలిగిరి: స్థానిక పాతూరు ప్రాంతంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు కేకు కట్ చేసి చిన్నారులకు, మహిళలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఊసా మాల్యాద్రి, నిశ్శంకర సురేష్, బండారు మల్లికార్జున, గంగిశెట్టి నాగేంద్ర, కొండపల్లి వెంకట్రావు, కొండపల్లి వెంకటేశ్వర్లు, నిశ్శంకర రామయ్య, గొబ్బిళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : ఎన్డీఏ కూటమి అఖండ మెజారిటీతో గెలవడంతో టీడీపీ శ్రేణులు రంగులు చల్లుకొని, బాణసంచా కాల్చి సంబరాలు చేసుకొన్నారు. గానుగపెంట పంచాయతీలోని ఆదిమూర్తిపురంలోని శివాలయంలో టీడీపీ కార్యకర్తలు కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు.

ఆత్మకూరు: టీడీపీ అభ్యర్థి ఆనం గెలుపుతో పట్టణం, గ్రామాల్లో నేతలు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు.

ఏఎస్ పేట: పార్టీ నాయకుడు ఖాజామియ్య దర్గా సెంటర్‌లో భక్తులు, స్థానికులకు లడ్డూలు పంపిణీ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు అబ్బూరి రమేష్‌నాయుడు, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, కాటంరెడ్డి నర సిం హారెడ్డి, షేక్ షబ్బీర్, షేక్ జిలాని బాషా, వాకిచర్ల వీరప్రతాప్, యస్థానీ పాల్గొన్నారు.

సంగం: మండలంలో టీడీపీ నాయకులు కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు, బాణా సంచి కాల్చి మేళ తాళాలలతో సందడి చేశారు.

మర్రిపాడు: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో టీడీపీ నేతలు 108టెంకాయలు కొట్టారు. బస్టాండ్ సెంటర్‌లో కొండలరావు, వెంకటేశ్వర్లు, పుల్లయ్య, ఎరుకలయ్య మిఠాయిలు పంచారు.

అనంతసాగరం: మండలకేంద్రంతో పాటు సోమశిల, చిలకలమర్రిలో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. నెల్లూరుకు వెళ్లి ఆనం రామనారాయణరెడ్డిని అభినందనలు తెలిపారు.

కలువాయి: వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ విజయం సాధించడంతో నాయకులు కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకొన్నారు.

సీతారామపురం: మండల పార్టీ అధ్యక్షుడు దేవర వెంకటేశ్వర్లు పార్టీ కార్యాలయం ఆవరణలో బాణసంచా పేల్చి, మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో పెద్దగౌస్, రాజ శేఖర్, తోట మనోజ్, తోటమాల్యాద్రి, జయరాములు, మధు, నాగేశ్వరరావు, ఖాజామొద్దీన్ పాల్గొన్నారు.

వింజమూరు: మండలంలోని నాయకులు ప్రతి సెంటర్‌లో టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.


కలిగిరిలో సంబరాలు జరుపుకుంటున్న తెలుగు తమ్ముళ్లు


కొండాపురం : పార్లపల్లిలో ర్యాలీ చేస్తున్న టీడీపీ కార్యకర్తలు


మర్రిపాడులో పూజలు చేస్తున్న టీడీపీ నేతలు

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కావ్యకు ఊహకందని మెజారిటీ

● ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యం

కావలి, జూన్4: కావలి ఎమ్మెల్యేగా దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఊహకందని మెజార్టీతో విజయం సాధించారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజలలో ఉన్న వ్యతిరేకతతోపాటు కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆయన అనుచర వర్గంపై ఉన్న అవినీతి, ఆరోపణలు ఓటర్ల మనసుకు ఎక్కటంతో వారు ఓటు రూపంలో చూపించి క్రిష్ణారెడ్డికి అత్యధిక మెజార్టీ ఇచ్చారు. కౌంటింగ్ ప్రారంభమైన నాటి నుంచి 23 రౌండ్‌లలో క్రిష్ణారెడ్డి మెజార్టీ కొనసాగింది. ఇప్పటి వరకు ఎవరికీ రాని మెజార్టీ కావలిలో క్రిష్ణారెడ్డికి వచ్చింది. వ్యాపార వర్గాలు, యువత, ఉద్యోగులు, పింఛనర్లు, చిరువ్యాపారులు అధికంగా ఉండే కావలిలో ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆయన అనుచరుల ప్రవర్తన వేధింపులతో విసుగుచెందిన ప్రజలు కూటమి అభ్యర్థికి ఓట్లు వేయటంతో తిరుగులేని మెజార్టీ వచ్చింది. అలాగే నియోజకవర్గంలోని కావలి, కావలి రూరల్, బోగోలు, దగదర్తి,అల్లూరు మండలాల్లో ఎక్కువగా బీసీ సామాజికవర్గాలు ఉండటంతో వారంతా టీడీపీ వైపు మొగ్గు చూపారు. దాంతో క్రిష్ణారెడ్డికి తిరుగులేని మెజార్టీ వచ్చింది. జనసేన, బీజేపీ మద్దతుతో కూటమి అభ్యర్థిగా పోటీచేయటంతో ఆ పార్టీల ఓట్లు కలిసి వచ్చాయి కావలిలో టీడీపీకి దిక్కులేని సమయంలో ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించిన మాలేపాటి సుబ్బానాయుడు సహకారాలు అందించటం క్రిష్ణారెడ్డి విజయానికి సోపానాలుగా నిలిచాయి.

కావలి ఎమ్మెల్యే ప్రొఫైల్

పేరు: దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి(కావ్య కృష్ణారెడ్డి)
పుట్టిన తేదీ: 7-8-1967, పుట్టిన ఊరు : కావలి
విద్యార్హతలు: మాస్టర్స్ ఆఫ్ కామర్స్, ఎస్వీయూ, తిరుపతి
తల్లిదండ్రులు: దగుమాటి లక్ష్మీరెడ్డి, రమణమ్మ
కుటుంబ నేపథ్యం: భార్య శ్రీలత, కుమార్తెలు సంహిత, వెన్నెల
రాజకీయ అనుభవం: 2005-2006లో జలదంకి సొసైటీ ప్రెసిడెంట్. 2006-2011లో జలదంకి ఎంపీపీ.
వృత్తి : గురురాఘవేంద్ర ఇన్‌ఫ్రాస్టక్చర్ మేనేజింగ్ పార్టనర్, కేకేఆర్‌టీసీ ట్రస్ట్ యజమాని


ఆర్వో శీనానాయక్ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కావ్య క్రిష్ణారెడ్డి

కావలిలో అంబరాన్నంటిన సంబరాలు

కావలి, జూన్4: కావలి ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తిరుగులేని మెజార్టీతో గెలుపొందటంతో నెల్లూరులోని కౌంటింగ్ కేంద్రం వద్ద, కావలిలోనూ టీడీపీ కార్యకర్తల సంబరాలు అంబరాన్నంటాయి. ఇప్పటివరకు కావలిలో ఎవరు సాధించలేని మెజార్టీ సాధించడంతో అభిమానులు సంబరాలు చేసుకున్నారు. నెల్లూరు కౌంటింగ్ కేంద్రం వద్ద టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, క్రిష్ణారెడ్డికి మిఠాయి తినిపించి అభినందించారు. కావలిలో గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు,నాలుగు వార్డులు తప్ప అన్ని వార్డుల్లో మెజార్టీలు రావటంతో వార్డుల వారీగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కార్యకర్తలు మిఠాయిలు పంచుకుంటూ బాణసంచా కాల్చారు. వైకుంఠపురం, జనతాపేటలో మహిళలు, పురుషులు వేర్వేరుగా కేక్‌లు కట్ చేసుకుని సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ ఆధ్వర్యంలో కూడా సంబరాలు జరిపారు.

కావలిటౌన్ : కావ్య విజయంతో టీడీపీ జిల్లా రైతు ఉపాధ్యక్షుడు బొట్లగుంట శ్రీహరి నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ముసునూరులో పెద్దఎత్తున విజయోత్సవాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి 30కేజీల కేక్‌ను కట్ చేసి నేతలు, కార్యకర్తలకు తినిపించారు. కార్యక్రమంలో నేతలు శశినాయుడు, మాల్యాద్రి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కావలి రూరల్: టీడీపీ నేత కావ్య క్రిష్ణారెడ్డి గెలుపుతో మండలంలోని 17 పంచాయతీల్లో పార్టీ నేతలు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. కొత్తపల్లిలో తెలుగు యువత ఆధ్వర్యంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, కావ్య క్రిష్ణారెడ్డి ఫొటోలు, పార్టీ జెండాలతో తయారు చేసిన కేక్‌ను కట్ చేశారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. అలాగే ముసునూరులోని బ్రహ్మంగారిగుడి ఎదురుగా ఉన్న ఫ్యాన్సీ షాపు నిర్వా హకుడు కోడెల క్రిష్ణ కేక్ కట్ చేసి సంబరాలు చేశా రు. ముసునూరు కమ్మపాలెంలోని నేతలకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు.అనేక చోట్ల బైక్ ర్యాలీల తో విజయోత్సవాలు జరిపారు.

అల్లూరు : మంగళవారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో ఊహించని విజయాన్ని కైవసం చేసుకోవడంతో తెలుగు తమ్ముళ్ల సంతోషానికి అవధులు లేవు. కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి గెలుపొందడంతో సంతోషం మరింత రెట్టింపయింది. కూటమి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావ్య కృష్ణారెడ్డిలకు మండలంలో మెజార్టీని తీసుకురావడంలో బీద రవిచంద్ర, బీద గిరిధర్‌ల కృషి మరువలేనిదని కార్యకర్తలు పేర్కొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండల టీడీపీ కార్యాలయ ఆవరణంలో మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నేతలు కావ్య క్రిష్ణారెడ్డి గెలుపొందిన సందర్భంగా మంగళవారం సం బరాలు జరుపుకున్నారు. తెలుగు తమ్ముళ్లు ఒకరికి ఒకరు మిఠాయిలు పంచుకున్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కావలి రూరల్ సీఐ నాగభూషణం, ఎస్సై బోజ్య, సిబ్బందితో ఉదయం నుంచి 144 సెక్షన్ విధించారు. పలు పంచాయతీల్లో టీడీపీ నేతలు మిఠాయిల పంపిణీ చేసి, బాణసంచా కాల్చుతూ సంబరాలు జరుపుకున్నారు.కావ్య విజయంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.


కావలిలో సంబరాలు చేసుకుంటున్న కార్యకర్తలు


అల్లూరులో విజయోత్సవాలు


బిట్రగుంటలో...

కందుకూరు చరిత్రను తిరగరాసిన టీడీపీ

● రెండు దశాబ్దాల తరువాత 'దేశం' జెండా రెపరెపలు ● భారీ మెజారిటీతో ఇంటూరి ఘనవిజయం
● అన్ని మండలాల్లోనూ ఆధిక్యత ● పట్టణ ఓటర్ల మద్దతు కూడా నాగేశ్వరరావుకే..



కందుకూరు, జూన్ 4: కందుకూరు ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఘనవిజయం సాధించారు. యువకుడిగా రాజకీయ ప్రవేశంచేసి తొలిసారి ఎమ్మెల్యేగా పోటీచేసిన ఇంటూరి నియోజకవర్గ చరిత్రను తిరగరాసేలా అన్ని రికార్డులను బద్ధలుకొట్టారు ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి టీడీపీ స్పష్టమైన ఆధిక్యతను కొనసాగిస్తూ రౌండ్‌రౌండ్‌కు మెజారిటీ పెంచుకుంటూ ఘనవిజయం వైపు దూసుకుపోయింది. వైసీపీకి పట్టున్న ప్రాంతాలుగా అంచనా వేసిన చోట్ల కూడా టీడీపీ ఆధిక్యతను ప్రదర్శించటం ద్వారా కందుకూరు మున్సిపాలిటీలోను, ఐదు మండలాల్లోను ఆధిక్యత సాధించింది.

● పలు రికార్డులు బద్దలు

నియోజకవర్గ చరిత్రలో పలు రికార్డులను ఈ ఎన్నికల్లో ఇంటూరి బద్దలు కొట్టారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీగా తాజా మాజీఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డికి లభించిన 14936 ఓట్ల మెజారిటీ నమోదై ఉండగా, ఈ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్లను మినహాయించి ఇంటూరికి 17813 ఓట్ల మెజారిటీ లభించింది. పోస్టల్ బ్యాలెట్లలో నాగేశ్వరరావుకు 745 మెజారిటీ వచ్చింది. ఈ మెజారిటీ నియోజకవర్గ చరిత్రలో రికార్డు మెజారిటీగా నిలిచింది. ఇక టీడీపీ ఆవిర్భావం తర్వాత ఏ అసెంబ్లీ ఎన్నికల్లోను కందుకూరు మున్సిపాలిటీలో టీడీపీకి ఆధిక్యత రాలేదు. చరిత్రను తిరగరాస్తూ ఈ ఎన్నికల్లో మున్సిపాలిటీలో 7333 ఓట్ల భారీ ఆధిక్యత లభించగా, అలాగే ఎన్నడూ టీడీపీకి మెజారిటీ రాని గుడ్లూరు మండలంలో కూడా ఈ విడత 440 ఓట్ల మెజారిటీని పార్టీ కైవసం చేసుకుంది. పార్టీ ఆవిర్భావం తర్వాత 1994,1999లో రెండు విడతలు మినహా ఎన్నడూ విజయం సాధించకపోగా 20 ఏళ్ల తర్వాత ఇంటూరి ఘనవిజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో ఇంతవరకు మూడు కుటుంబాల మధ్యే ఎమ్మెల్యే పదవి దోబూచులాడగా మొదటిసారిగా రాజకీయనేపథ్యం లేని కుటుంబం నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఇంటూరి ఘనవిజయం సాధించటం మరో రికార్డుగా నిలిచింది.

కందుకూరు ఎమ్మెల్యే ప్రొఫైల్

పేరు : ఇంటూరి నాగేశ్వరరావు, **భార్య :** ఇంటూరి సౌజన్య
సంతానం : ఇద్దరు కుమారులు, **వయసు :** 47 సంవత్సరాలు
వృత్తి : కన్‌స్ట్రక్షన్స్ రంగం
ప్రత్యక్ష రాజకీయ ప్రవేశం : 2009 నుంచి క్రియాశీల రాజకీయాల్లో ఉన్నారు. 2013లో ఆయన సతీమణి ఇంటూరి సౌజన్య వలేటివారిపాలెం మండలం బడేవారిపాలెం పంచాయతీ సర్పంచిగా విజయం సాధించారు. 2022లో ఇంటూరి కందుకూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు.

ఊరూరా టీడీపీ విజయోత్సవాలు

కందుకూరు, జూన్ 4: నియోజకవర్గంలో రెండు దశాబ్దాల తర్వాత టీడీపీ ఘనవిజయం సాధించటంతో గ్రామగ్రామాన, వీధివీధినా సంబరాలు అంబరాన్నంటాయి. ఎవరికి వారు ఎక్కడికక్కడ కేకులు కట్‌చేసి, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని అనేక ప్రాంతాలలో పెద్దఎత్తున యువకులు బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. పట్టణంలోని కోవూరు రోడ్డు, సాయినగర్, తూర్పుపాలెం, పోతురాజుమిట్ట సెంటర్, త్యాగరాజస్వామి గుడి, కోటారెడ్డి నగర్ తదితర ప్రాంతాలలో విజయోత్సవాలు మిన్నంటాయి. పోతురాజుమిట్ట వద్ద గుర్రంవారిపాలెం, వరపర్లపాలెం యూత్ ఆధ్వర్యంలో 101 కొబ్బరికాయలు కొట్టి విజయోత్సవం జరుపుకున్నారు. విప్పగుంట రోడ్డులోని అంజనేయస్వామి గుడి, పంచాయతీరాజ్ ఆఫీసు బైపాస్ రోడ్డులోని ఆంజనేయ స్వామి గుడివద్ద స్థానికులు కొబ్బరికాయలు కొట్టి సంబరాలు చేసుకున్నారు.

లింగసముద్రం : టీడీపీ కూటమి విజయం సాధించడంతో స్థానిక టీడీపీ నేతలు అడపా రంగయ్య, అడపా నర్సయ్య, కిలారి రమణయ్య, కె యశ్వంత్, పెద సత్యం, గోపి, విష్ణు, రాఖీ తదితరులు మంగళవారం సాయంత్రం బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. జై చంద్రబాబు, జై పవన్ కళ్యాణ్ అంటూ నినాదాలు చేశారు.అలాగే జంపాలవారిపాలెంలో టీడీపీ నాయకులు జంపాల శివప్రసాద్, జంపాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామం నుంచి లింగసముద్రం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.అలాగే మండలంలోని పలు గ్రామాలలో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.

ఉలవపాడు : మండలంలో టీడీపీకి ఊహించని మెజారిటీ వచ్చింది. 20 ఏళ్ల తరువాత టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు భారీ మెజారిటీతో గెలవడంతో మండలంలోని తెలుగు తమ్ముళ్లు రంగులు చల్లుకుంటూ, బాణసంచా కాల్చారు. ఉలవపాడు ఎస్సీ కాలనీలోని మహిళలు, యువకులు ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద టెంకాయలు కొట్టారు. కొల్లూరుపాడు ఎస్సీ కాలనీలో కూడా టీడీపీ శ్రేణులు పోలేరమ్మ గుడి వద్ద టెంకాలు కొట్టారు.

లింగసముద్రం: మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ప్రజలు కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు బ్రహ్మరథం పట్టారు. మండలంలోని మొత్తం 30,953 ఓట్లకుగాను 28,015 ఓట్లు పోలయ్యాయి. ఇందులో కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు 15,020 ఓట్లు సాధించగా, వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ 12,129 ఓట్లను దక్కించుకున్నారు.దీంతో నాగేశ్వరరావుకు 2,891 ఓట్ల మెజారిటీ వచ్చింది. మండలంలో టీడీపీకి భారీ మెజారిటీ రావడంతో పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు.

వలేటివారిపాలెం: మండలంలో ఎన్డీఏ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావుకు 2756 ఓట్ల మెజారిటీ లభించింది. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో మొత్తం 35,265 ఓట్లకు గానూ 31,992 ఓట్లు పోలయ్యాయి. అందులో నాగేశ్వరరావుకి 15996 ఓట్లు రాగా, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్‌కు 13246 ఓట్లు లభించాయి దీంతో నాగేశ్వరావుకు 2756 ఓట్ల మెజారిటీ లభించింది. చుండి గ్రామ చరిత్రలో ఇప్పటివరకూ టీడీపీకి మెజారిటీ లభించలేదు. ఇప్పుడు జరిగిన ఎన్నికలల్లో 170 ఓట్లు టీడీపీకి మెజారిటీ రావడం విశేషం. కాగా ఎన్డీఏ కూటమి విజయకేతనం ఎగురవేయడంతో వలేటివారిపాలెంలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు టీడీపీ కార్యకర్తలు టపాసులు కాల్చి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

గుడ్లూరు : కందుకూరు ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరావు అత్యధిక మెజారిటీ గెలవడంతోపాటు రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో గుడ్లూరు మండలంలో మంగళవారం రాత్రి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బాణసంచాకాల్చి విజయోత్సవాలు జరిపారు. గుడ్లూరు మండలం మొత్తంలో 2150 ఓట్ల ఆధిక్యత టీడీపీకి వచ్చింది. మునుపెన్నడూలేని విధంగా మెజార్టీ మండల టీడీపీ నాయకులు ఆనందం వ్యక్తంచేశారు.


లింగసముద్రంలో బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు


ఉలవపాడు అంబేడ్కర్ నగర్‌లో విజయోత్సవం జరుపుకుంటున్న టీడీపీ శ్రేణులు


గుడ్లూరులో సంబరాలు చేసుకుంటున్న కూటమి నాయకులు

సర్వేపల్లిలో సోమిరెడ్డి అఖండ విజయం



ఎన్నికల అధికారి నుంచి డిక్లరేషన్ ఫాం తీసుకుంటున్న టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ముత్తుకూరు, జూన్ 4: సార్వత్రిక ఎన్నికల్లో సర్వేపల్లి నియోజక వర్గంలో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అఖండ విజయం సాధించారు. నియోజకవర్గ చరిత్రలో మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలి వ్యక్తిగా నిలిచారు. గత ఎన్నికలలో ఓటమి పాలైనా నియోజకవర్గంలో ప్రజల వెంటే ఉంటూ వారి సంక్షేమం కోసం పా టుపడ్డ సోమిరెడ్డిని సర్వేపల్లి ప్రజ లు ఆదరించారు. నియోజకవర్గం లో మంత్రిగా కాకాణి గోవర్దన్ రెడ్డి చేసిన అక్రమాలను, అరాచ కాలను ప్రజలకు వివరిస్తూ, వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడాలన్న సోమిరెడ్డి విన్నపానికి ప్రజలు స్పందించి ఆయనకు పట్టంకట్టారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 1,94,618 ఓట్లు పోల్ కాగా, సోమిరెడ్డికి 102243 ఓట్లు రాగా కాకాణికి 86249 ఓట్లు వచ్చాయి. గత రెండు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన సో మిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈసారి 15994 ఓట్ల భారీ ఆధిక్యంతో విజ యం సాధించారు. కాకాణికి పూర్తి పట్టు ఉన్న సొంత మండలం పొద లకూరులో కేవలం 332 ఓట్ల మెజార్టీకి ఆయనను పరిమితం చేశారు. టీపీగూడూరు, ముత్తు కూరు, వెంకటాచలం, మనుబోలు మండలాల్లో పూర్తిస్థాయిలో ఆధి క్యం ప్రదర్శించి తన పట్టును నిరూ పించుకున్నారు. ఎన్నికల ప్రచా రంలో కాకాణి అవినీతి, అక్ర మాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం తాను చేసిన కృషిని వివరించడం, నాలుగుసార్లుగా నియోజకవర్గంలో టీడీపీ తరపున తాను చేస్తున్న అలుపెరుగని పోరాటాన్ని గుర్తుచేస్తూ ప్రజల్లో సానుభూతిని సంపాదించుకోవడంలో సఫలీకృతులయ్యారు.

వెంకయ్యస్వామికి సోమిరెడ్డి పూజలు



గొలగమూడిలో పూజలు చేస్తున్న సోమిరెడ్డి

వెంకటాచలం: గొలగమూడి భగవాన్ శ్రీవెంకయ్య స్వామి ఆశ్రమాన్ని మంగళవారం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆశ్రమ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గుమ్మడి రాజాయాదవ్, బొమ్మి సురేంద్ర, పార్థసారథినాయుడు, సత్తార్ సాహెబ్, రవినాయుడు, శ్రీనివాసులు తదితరులున్నారు. అలాగే మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ ఆధ్వర్యంలో మండలంలోని అనికేపల్లి గ్రామంలోని వినాయకుని దేవస్థానంలో ఆపార్టీ నేతలు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దర్గాలో మైనార్టీ మహిళల పూజలు

సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి గెలుపొందడంతో వెంకటాచలంలోని నాగూర్ మీరయ్య జెండా నిషాన్ దర్గాలో మంగళవారం సాయంత్రం టీడీపీ నేతలు, కార్య కర్తలతో కలిసి ముస్లిం మైనార్టీ మహిళలు పూజలు చేశారు. అలాగే మండలంలోని కనుపూరు, కసుమూరు, చవటపాళెం, కాకుటూరు, చెముడుగుంట, గొలగమూడి, సర్వేపల్లి, నిడిగుంటపాళెం, ఈదగాలి, పూడిపర్తి, గూడ్లూరువారిపాళెం, పాలిచెర్లపాడు, కురిచెర్లపాడు, రామదాసుకండ్రిగ, కంటేపల్లి మొదలైన అన్ని గ్రామాల్లో ఆపార్టీ శ్రేణులు బాణా సంచాలు కాల్చారు. అన్ని గ్రామాల్లో సందడి నెలకొంది.

సోమిరెడ్డి విజయంతో వాడవాడలా టీడీపీ సంబరాలు



యాచవరంలో టీడీపీ శ్రేణుల సంబరాలు

మనుబోలు, జూన్ 4: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అనూహ్య విజయం సాధించారని తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి అన్నారు. సోమిరెడ్డి విజయంతో మండల కేంద్రమైన మనుబోలు, పలు గ్రామాలలో తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. యాచవరంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు సాని వెంకటరమణయ్య ఆధ్వర్యంలో, హైస్కూల్ సెంటర్‌లో మోపూరు ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో, కోదండరామపురం సెంటర్‌లో జనసేన అధ్యక్షుడు పెనుబాక ప్రసాద్ ఆధ్వర్యంలో కేక్‌లు కట్‌చేసి యువత సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చేరెడ్డి పట్టాభిరామిరెడ్డి, కలికి రమేష్‌రెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, ప్రసాద్, అంకయ్య గౌడ్, కోటీశ్వర్‌రెడ్డి, చింతల వెంకటేశ్వర్లు, నరేష్, విక్కీ, సతీష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు: మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి తోటపల్లిగూడూరు మండల ప్రజానీకం జై కొట్టింది. వైసీపీ ప్రభుత్వం ఈ ఐదు సంవత్సరాలలో చేసిన అరాచకాలకు కోడూరు, వరకవిపూడి గ్రామాలలో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోయారు. అంతేగాక ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రజలకు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అండగా నిలిచారు. దీంతో ఎన్నికల్లో ప్రజలు ఆయనకు జై కొట్టారు.

పొదలకూరు : సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడి విజయం సాధించడంతో మండలంలోని టీడీపీ నాయకులు, తెలుగు యువత సంబరాలు చేసుకున్నారు. తొలుత సంగం రోడ్డులోని ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ జమీర్‌బాషా ఇంటి వద్ద నుంచి ద్విచక్ర వాహనాలలో ర్యాలీగా బయల్దేరి స్థానిక పంచాయతీ బస్టాండ్‌లో సంబరాలు చేసుకున్నారు. జమునా హాలు సెంటర్‌లో బాణాసంచా కాల్చి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాక్షస పాలన అంతమొందిందని రాష్ట్రానికి మంచిరోజులు వచ్చా యని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు, బక్కయ్య నాయుడు, మల్లినేని వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలుపొందడంతో పొదలకూరు మండలం చెర్లోపల్లికి చెందిన నాగెళ్ల వెంకటేశ్వర్లునాయుడు, కాకాణి రమణారెడ్డి కాలనీకి చెందిన రాపూరు బాబు, కేతు సుధాకర్‌రెడ్డిలు మంగళవారం తిరుమలకు కాలినడకన బయలుదేరారు. పొదలకూరు మండల మహిళా అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, మరికొందరు మహిళలతో కలిసి స్థానిక విఘ్నేశ్వర ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ముత్తుకూరు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజయంతో మండలంలో టీడీపీ నాయకులు ప్రధాన కూడళ్లలో సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా పే లుళ్లు, డప్పుల మోతలతో గ్రామాలు సందడిగా మారాయి.

రాపూరు(డక్కిలి) : వెంకటగిరి ఎమ్మెల్యేగా కురుగొండ్ల రామకృష్ణ విజయం సాధించడంతో అన్ని గ్రామాల్లో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. గ్రామ శక్తి పోలేరమ్మ గుడి వద్ద 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. మండల కేంద్రాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి ఆనంద వ్యక్తం చేశారు.

టీడీపీది ప్రజా విజయం : బొమ్మి

తోటపల్లిగూడూరు: తెలుగుదేశం పార్టీది ప్రజా విజయమని, ప్రజలు ఆదరించి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర పేర్కొన్నారు. అలాగే మండలంలోని చింతోపు మంగలదొరువు, సౌత్ ఆములూరు, వీలు కానిపల్లి, కొత్తపాలెం, కోడూరు, నరుపూరు గ్రామాలలో టీడీపీ నాయకులు కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ప్రశాంతిరెడ్డి గెలుపుతో టీడీపీ నేతల సంబరాలు



ఎన్నికల అధికారి నుంచి డిక్లరేషన్ ఫాం తీసుకుంటున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు, జూన్ 4 : వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపొందడంతో మంగళవారం మండల పరిధిలోని ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కోవూరు, పడుగు పాడు, పోతిరెడ్డిపాళెం గ్రామాల్లో బాణా సంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక మహ లక్ష్మమ్మ గుడి సమీపంలో ప్రశాంతిరెడ్డి చిత్రంతో తయారు చేసిన భారీ కేకును కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. స్థానిక బజారు కూడలి, మైథిలి సెంటర్, పీఆర్‌ఆర్ కాలనీ, ఎన్ఎస్ఆర్ కాలనీల్లో మిఠాయిలు పంచారు. పాటూరు, మోడేగుంట, చెర్లోపాళెం, లేగుంటపాడు, ఇనమడుగు, పోతిరెడ్డి గ్రామాల్లో యువకులు సంబరాలు చేసుకున్నారు.



కోవూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చినగర పంచాయతీలోని పెద్దూరు, 9వార్డు, శాంతినగర్, ఖాజానగర్, మండలంలోని రేబాల, దామరమడుగు పలు గ్రామాలలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కేక్‌లు కట్‌చేసి, బాణాసంచాలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో చెల్లాయపాళెం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు, కోవూరు ఎమ్మెల్యేగా విజయదుందుభి మోగించిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని పలువురు బుచ్చి పట్టణం, గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు నెల్లూరులోని వారి నివాసానికి వెళ్లి కలిశారు. పుష్పగుచ్చాలు అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

కొడవలూరు : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించిన సందర్భంగా మంగళవారం మండలంలో 24 పంచాయతీల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బాగంగా గుండాలమ్మపాళెం గ్రామంలో టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అలాగే నియోజకవర్గంలో ప్రజలు కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి పెద్ద ఎత్తున మద్దతు తెలిపి పట్టంకట్టారన్నారు.



పార్లపల్లిలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

విడవలూరు: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొందడంతో పాటు వేమిరెడ్డి దంపతులు భారీ మెజార్టీతో గెలుపొందడంతో విడవలూరు, ఊటుకూరు, రామతీర్థం, దండిగుంట, పార్లపల్లి, చౌకచర్ల, ము దివర్తి, అన్నారెడిపాలెం గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకలు జరుపుకున్నారు. ఊటుకూరు గ్రామంలో టీడీపీ నాయకులు రామిరెడ్డి విజయభానురెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు కేక్ కట్ చేసి పేదలకు పంచారు.

ఇందుకూరుపేట : మండలంలోని అన్ని గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ సంబరాలు మంగళవారం జరుపుకున్నారు. కొత్తూరులోని పార్టీ కార్యాలయంలో మండల ప్రధాన కార్యదర్శి మునగాల రంగారావు ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి స్వీట్లు పంచుకుని విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పేడూరు రామచంద్రయ్య, ఉదయ్‌కుమార్, నరసయ్య, పరమేష్, పోలయ్య, వెంకటరమణయ్య, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి ప్రజలకు రుణపడి ఉంటా : కురుగొండ్ల



రాపూరులో టీడీపీ శ్రేణుల సంబరాలు

రాపూరు(డక్కిలి) : తన విజయాన్ని వెంకటగిరి నియోకవర్గ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆయన తన ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిపై 15,454 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. రామకృష్ణకు 1,02,716 ఓట్లు పోలవగా వైసీపీ అభ్యర్థికి 87,262 ఓట్లు పడ్డాయి. ఈ సందర్భంగా కురుగొండ్ల ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. 2019లో తాను ఓటమి చెందినా వెంకటగిరి ప్రజలకు దూరం కాలేదన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో ప్రజలు భారీ మెజార్టీని అందించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తప్పక అమలుచేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే ఉంటానని చెప్పారు.

రాపూరు(డక్కిలి) : స్థానిక టీడీపీ నాయకులు కురుగొండ్ల రామకృష్ణ విజయంపై టపాసులు కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో చెన్ను తిరుపాల్ రెడ్డి, దండవోలు వెంకటటేశ్వర్లు రెడ్డి, భాస్కరరెడ్డి, కొండ్లపూడి రాఘవరెడ్డి, నువ్వుల శివరామకృష్ణ, ఖాజా, ఏదోటి కోటేశ్వర నాయుడు పాల్గొన్నారు.

సైదాపురం: వెంకటగిరి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిపై విజయం సాధించడంతో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కేక్‌లు కట్ చేసి బాణ సంచా పేల్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి, పెమ్మసాని దిలీప్ చౌదరి పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



చందనాలంకారంలో ఆంజనేయస్వామి

ముత్తుకూరు, జూన్ 4: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారు చందనా లంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభించి రామనామ ఏకాహ దీక్షతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు నారాయణం రామకృష్ణ ఆచార్యులు స్వామివారిని చందనాలంకారంతో తీర్చిదిద్దారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి విజయోత్సవం



టీడీపీ కార్యాలయం ముందు కార్యకర్తల ఆనందం

టీడీపీ గెలుపుతో సంబరాలు

సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల్లో టీడీపీ ఘన విజయంతో వివిధ వర్గాల నుంచి హర్షం వ్యక్తం అవుతోంది.



ప్రత్యక్ష దైవానికి ప్రణామం : కౌంటింగ్ కేంద్రం వద్ద సూర్యుడికి నమస్కరిస్తున్న కోటంరెడ్డి

విజేతలకు కళా శుభాకాంక్షలు

నెల్లూరు (సాంస్కృతికం): ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అఖండ విజయం సాధించినందుకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు గంధవళ్ల ఉమాశంకర్ కళా శుభాకాంక్షలు తెలిపారు. రావి ఆకులపై నరేంద్రమోదీ, చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ చిత్రాలు చెక్కి, అభినందనలు తెలియజేశారు.

పీఆర్‌టీయూ అభినందనలు

నెల్లూరు (విద్య) : కూటమికి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డీ వెంకటరాజు, నాటకం తిరుమలయ్య ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగులు రాజేసిన అగ్ని గుండంలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా చలి కాచుకున్నారన్నారు.

న్యాయవాదులు స్వీట్ల పంపిణీ

నెల్లూరు (లీగల్): టీడీపీ విజయంతో హర్షం వ్యక్తం చేస్తూ టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు షేక్ అన్వర్ బాషా, చెన్నమనేని మురళి, ఈదూరు భాస్కరయ్య, కేవీఆర్ నాయుడు, చల్లా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జనసేన సంబరాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 4: ఎన్‌డీఏ కూటమి విజయంతోపాటు జనసేన పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థులందరూ గెలుపొందడంతో నగరంలోని జనసేన కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ సంబరాలు జరిపారు. పార్టీ నగర అధ్యక్షుడు సుజయ్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసపాలన అంతమొందించడంలో జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ కీలక పాత్ర పోషించారన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు రాష్ట్రాభివృద్ధిని చూస్తారన్నారు. సర్వేపల్లిలో ఘన విజయం సాధించిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి మంగళవారం సాయంత్రం రాష్ట్ర బ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యురాలు సుధ, ఆమె భర్త రవీంద్ర తిరుమల ప్రసాదాన్ని అందజేశారు.

రూరల్లో టీడీపీ శ్రేణుల సంబరాలు

నెల్లూరు రూరల్, జూన్ 4 : నెల్లూరు రూరల్లో టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధ ర్‌రెడ్డి వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామాల్లో టీడీపీ నాయకు లు, కార్యకర్తలు స్థానిక ఆలయాల్లో మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం ప్రియదర్శిని కళాశాల వద్ద ఉన్న లెక్కింపు కేంద్రానికి తరలి వచ్చారు. ఫలితాలు తెలుసుకుని సంబరాల్లో మునిగితేలారు. అక్కడించి ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకుని తోటివారితో సంతోషాన్ని పంచుకున్నారు. భారీ స్ర్కీన్లు ఏర్పాటు చేయడంతో రౌండ్ల వారీగా వస్తున్న ఫలితాలతో శ్రేణులంతా కేరింతలు కొట్టారు. స్థానిక డివిజన్లలో నిర్వహించిన సంబరాల్లో మహిళలు సైతం పాల్గొన్ని కేక్ కట్ చేసి విజే తలకు శుభాకాంక్షలు తెలిపారు.



పెద్ద చెరుకూరులో మిఠాయిలు పంచుకుంటున్న నాయకులు, కార్యకర్తలు

కౌంటింగ్‌కు ఇలా..



ఏమీ లేవుగా? : కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించే ముందు తనిఖీ



పెద్ద క్యూనే! : పాసులతో కౌంటింగ్ ఏజెంట్ల క్యూ



హద్దు దాటనివ్వం : రక్షణ కవచాలతో పోలీసు బలగం

కనుల పండువగా రంగడి ప్రాకారోత్సవం



నెల్లూరు (సాంస్కృతికం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న వసంతోత్సవాల్లో మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి ప్రాకారోత్సవం కన్నుల పండువగా జరిగింది. తొలుత స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా హారతులు, ఆస్థాన సేవ, దివ్యనాలాయిర ప్రబంధఘోష్టి గానం జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. ఈ కార్యక్రమాలను ఛైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

హంసపై హనుమ



నెల్లూరు (సాంస్కృతికం) : సంతపేట అంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం విశేష పూజలు, అర్చనలు జరిగాయి. సాయంత్రం ప్రత్యేక పూజలు, పూలంగిసేవతో పాటు స్వామి వారికి హంస వాహనంలో జరిగిన ఉత్సవం భక్తులకు కనువిందు చేశాయి.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న వాకర్స్

నెల్లూరు (విద్య), జూన్ 4 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వేసవి క్రీడాశిక్షణ శిబిరాల్లో సాధన చేస్తున్న క్రీడాకారులకు వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పౌష్టికాహారాన్ని అందచేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బ రాజు మాట్లాడుతూ క్రీడాకారులను ఆటల్లో ప్రోత్సహించడమేకాక మంచి ఆహారాన్ని అందిం చాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో తొలిరోజు పౌష్టికాహార దాత డాక్టర్ అంకిరెడ్డి, అసోసియేషన్ వ్యవస్థాపకుడు మేకల నరేంద్రరెడ్డి, సభ్యులు జయదేవ్, రాఘవేంద్రషెట్టి, రవిచంద్ర, గోపినాథ్, బలరామయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది తన్నీరు కోటయ్య మృతి



కోటయ్య (ఫైల్)

నెల్లూరు (లీగల్), జూన్ 4 : బీసీల కోసం అహరహం శ్రమించిన మానవతావాది, సీనియర్ న్యాయవాది తన్నీరు కోటయ్య మంగళవారం అనారోగ్యంతో మరణించారు. ప్రకాశం జిల్లా కందుకూరుకు చెందిన కోటయ్య చిన్నతనంలోనే నెల్లూరు నగరానికి వచ్చి న్యాయవాది గా ఎదిగి మంచి పేరు తెచ్చుకున్నారు. 42 ఏళ్లుగా అయన న్యాయవాద వృత్తిలో ఉన్నారు. ఐలు జిల్లా నాయకుడిగానూ పనిచేశారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ఏ స్వామి స్థాపించిన లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జిల్లా అధ్యక్షుడిగా కూడా కోటయ్య వ్యవహరించారు. న్యాయవాద వృత్తిలో ఎంతో మందికి ఆదర్శవంతంగా నిలిచారు. ప్రజా స్వామ్య హక్కుల కోసం వామపక్ష భావజాలంతో పీడిత ప్రజల తరపున అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. కోటయ్య మృతికి రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీ ఉమామహేశ్వర్ రెడ్డి, పీ సుందరయ్య యాదవ్, మాజీ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు రామిరెడ్డి రోజారెడ్డి, గోళ్ల బాలసు బ్రహ్మణ్యం, ఐలు జిల్లా కమిటీ, సీనియర్ న్యాయవాదులు షేక్ నన్నేసాహెబ్, జల్లి పద్మాకర్, పీసీ కృష్ణయ్య, గుంజి దయాకర్ తదితరులు సంతాపం తెలిపారు. ఆయన పార్థివదేహాన్ని పలువురు న్యాయవాదులు సందర్శించి నివాళులర్పించారు.

బాలుకు ఘన నివాళి

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 4 : గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 78వ జయంతిని చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. నగరంలోని ఆదిత్యనగర్‌లో ఉన్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మున్సిపల్ పార్కులో ఉన్న బాలూ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన మధుర స్మృ తులను గుర్తు చేసుకున్నారు. బాలూ ఎప్పటికీ చిరంజీవి అని, ఆయన అందరి హృదయాల్లో ఉన్నారని వక్త లు పేర్కొన్నారు. చేతన సంస్థ కార్యదర్శి వై శేషగిరీశం, కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఎం సుబ్రహ్మణ్యం, వై విశ్వ నాథం, గట్టుపల్లి ఆదిశేషు, ఎస్ సుబ్బారాయుడు, నాట్య గురువు దివ్యపావని, గాయనీమణులు ఎన్ పద్మావతి, కే విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




ఎస్పీ బాలు విగ్రహానికి నివాళులర్పిస్తున్న అభిమానులు



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 1
తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 5 జూన్ 2024

- తిరుపతి ఎంపీగా మళ్లీ గురుమూర్తికే పట్టం
- భూమనను కరుణించని తిరుమల వెంకన్న
- చంద్రగిరిలో చెవిరెడ్డి వారసుడికి ఆశాభంగం
- సత్యవేడులో గెలిచి చూపిన ఆదిమూలం
- శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్ భారీ విజయం
- డాక్టర్ విజయశ్రీని ఎంచుకున్న సూళ్లూరుపేట
- పాశం సునీల్‌కే దక్కిన గూడూరు
- వెంకటగిరి కోటలో మళ్లీ కురుగొండ్ల జెండా

అయిదేళ్ల అధికార అహం.. ప్రజల తీర్పు ముందు తల వంచి మోకరిల్లక తప్పలేదు. దాడులు, బెదిరింపులు, పథకాలు విదిల్చిన రూకలు, పంచిన డబ్బులు.. ఇవేవీ జనాన్ని మాయచేయలేక పోయాయి. అభివృద్ధి గాలికొదిలేసి సాగించిన అరాచకం మెప్పించలేకపోయింది. తిరుపతి జిల్లాలో జగన్ పార్టీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది. మంగళవారం ఉదయం ఈవీఎం పెట్టెలు తెరవగానే మొదలైన ఓట్ల ఉప్పెన ధాటికి ఫ్యాను తునాతునకలై కొట్టుకుపోయింది. గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు, తిరుపతి, చంద్రగిరి.. అన్ని నియోజకవర్గాల్లోనూ కూటమి విజయదుందుభి మోగింది. తిరుమల శ్రీవేంకటేశ్వరుడి సాక్షిగా వైసీపీ అభ్యర్థులంతా పరాజితులయ్యారు. వ్యూహాల ఉచ్చులు ఎన్ని పన్నినా తిరుపతిలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు భారీ ఆధిక్యతను నమోదు చేశారు. నగరిలోనూ రోజా ఫైర్ లేని బ్రాండ్‌గా మిగిలిపోవడం 2024 ఎన్నికల విశేషం. ఎంపీ స్థానం మాత్రం మళ్లీ దక్కడం ఒక్కటే వైసీపీకి ఊరట.



ఫ్యాన్ రెక్కలు తునా తునకలు






కౌంటింగ్ పూర్తయ్యాక ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నుంచి గెలుపు పత్రాలను అందుకుంటున్న గురుమూర్తి - ఆరణి శ్రీనివాసులు-పులివర్తి నాని-ఆదిమూలం

డిక్లరేషన్ పత్రాలు అందుకుంటున్న విజేతలు




ఆర్వోల నుంచి గెలుపు పత్రాలను అందుకుంటున్న బొజ్జల సుధీర్ రెడ్డి, నెలవల విజయశ్రీ




రిటర్నింగ్ అధికారుల నుంచి డిక్లరేషన్ పత్రాలను అందుకుంటున్న పాశం సునీల్‌కుమార్- కురుగొండ్ల రామకృష్ణ

టీడీపీలో ఇద్దరు వారసుల విజయం

టీడీపీ నుంచీ ఈ పర్యాయం ఇద్దరు రాజకీయ కుటుంబాల వారసులు ఎన్నికల్లో విజయం సాధించారు. సూళ్ళూరుపేటలో మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం కుమార్తె డాక్టర్ నెలవల విజయశ్రీ ఎన్నికల్లో గెలిచి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు. అలాగే శ్రీకాళహస్తి నుంచీ మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తనయుడు సుధీర్ రెడ్డి మొదటిసారి ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీలో ప్రవేశించబోతున్నారు.

ఏ నియోజకవర్గంలో ఎవరికెన్ని ఓట్లు ?

నియోజకవర్గం	పోలైన ఓట్లు	టీడీపీ కూటమి	వైసీపీ	కాంగ్రెస్	ఆధిక్యం	(పార్టీ)
తిరుపతి	191,557	1,21,205	60,950	620	62,031	(జనసేన)
చంద్రగిరి	2,51,788	1,40,861	98,304	2,957	42,557	(టీడీపీ)
శ్రీకాళహస్తి	2,06,914	1,21,565	78,261	3,002	43,304	(టీడీపీ)
సత్యవేడు	1,83,686	84,626	81,311	5,424	3,315	(టీడీపీ)
సూళ్లూరుపేట	2,01,179	1,11,048	81,933	3,622	29,115	(టీడీపీ)
గూడూరు	1,93,430	1,00,844	80,929	3,276	19,915	(టీడీపీ)
వెంకటగిరి	1,96,986	1,27,717	87,262	1,916	15,455	(టీడీపీ)

తిరుపతి ఎంపీ	14,25,540 పోలైన ఓట్లు	6,32,228 వైసీపీ	6,17,659 కూటమి	65,523 కాంగ్రెస్	16,118 మెజారిటీ



తిరుపతి - రేణిగుంట రోడ్డులోని టీడీపీ కార్యాలయం వద్ద నాయకుల సంబరాలు

తిరుపతి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ఫలితాల్లో అధికార పార్టీ రివర్స్ స్వీప్ చేసింది. గత ఎన్నికల్లో మొత్తం ఏడుకు ఏడు అసెంబ్లీ స్థానాలూ భారీ ఆధిక్యతతో గెలిచిన వైసీపీ తాజా ఎన్నికల్లో తుడిచిపెట్టుకుపోయింది. సత్యవేడు మినహా అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ భారీ తేడాతో పరాజయం పాలైంది. సత్యవేడులో స్వల్ప తేడాతో వైసీపీ అభ్యర్థి ఓటమి చెందారు. కేవలం తిరుపతి ఎంపీ స్థానానికి మాత్రమే వైసీపీ పరిమితమైంది. అక్కడ కూడా మోస్తరు ఆధిక్యతతో చావుతప్పి కన్నులొట్టపోయిన చందంగా గెలిచి జిల్లాలో ఉనికి చాటుకుంది. కాగా జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ టీడీపీ కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్ళూరుపేట, గూడూరు, వెంకటగిరి తదితర ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ టీడీపీ జయకేతనం ఎగురవేసింది. చంద్రగిరి నుంచీ పులివర్తి నానీ, శ్రీకాళహస్తి నుంచీ బొజ్జల సుధీర్‌రెడ్డి, సత్యవేడు నుంచీ కోనేటి ఆదిమూలం, సూళ్ళూరుపేట నుంచీ నెలవల విజయశ్రీ, గూడూరు నుంచీ పాశం సునీల్‌కుమార్, వెంకటగిరి నుంచీ కురుగొండ్ల రామకృష్ణ టీడీపీ తరపున, తిరుపతిలో ఆరణి శ్రీనివాసులు జనసేన తరపున పెద్ద ఆధిక్యతలతో విజయాన్నందుకున్నారు.



తిరుపతిలో జనసేన అభ్యర్థి శ్రీనివాసులు పూజలు

తుడిచిపెట్టుకుపోయిన వైసీపీ

జిల్లాలో చంద్రగిరి నుంచీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, తిరుపతి నుంచీ భూమన అభినయ్, సత్యవేడు నుంచీ రాజేశ్, వెంకటగిరి నుంచీ నేదురుమల్లి రామ్‌కుమార్, గూడూరు నుంచీ మేరిగ మురళీధర్ తొలిసారి ఎన్నికల బరిలోకి దిగి పరాజయం మూటగట్టుకోగా శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేటల నుంచీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య ఓటమిపాలయ్యారు. అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ ఓటమితో వైసీపీ జిల్లాలో తుడిచిపెట్టుకుపోయినట్టయింది.

వైసీపీలో వారసుల ఘోరపరాజయం

మాజీ సీఎం నేదురుమల్లి జనార్దన రెడ్డి తనయుడు రామ్‌కుమార్, తిరుపతి సిట్టింగ్ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తనయుడు అభినయ్, చంద్రగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి తనయుడు మోహిత్‌రెడ్డి ఘోర పరాజయం చవిచూశారు. కాగా చెవిరెడ్డి కుటుంబంలో తండ్రీతనయులిద్దరూ ఓటమిపాలు కావడం గమనార్హం. చెవిరెడ్డి ఒంగోలు ఎంపీగా పోటీ చేసి పరాజయం పాలైన సంగతి తెలిసిందే.

చంద్రగిరిలో పాతికేళ్ళ తర్వాత టీడీపీ జెండా రెపరెపలు

చంద్రబాబు స్వంత నియోజకవర్గమైన చంద్రగిరిలో పాతికేళ్ళ తర్వాత టీడీపీ జెండా ఎగిరింది. ఇక్కడ హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ 40 వేలకు పైగా ఆధిక్యతతో ఘన విజయం సాధించారు. ఇక్కడ టీడీపీ 1994లో చివరిసారిగా గెలిచింది. అప్పట్లో చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు టీడీపీ తరఫున చివరిసారిగా గెలిచారు. తర్వాత 1999, 2004, 2009, 2014, 2019 వరుస ఎన్నికల్లో టీడీపీ ప్రతిసారీ ఓటమి పాలైంది. గత ఎన్నికల్లో ఓటమి చెందిన పులివర్తి నానీ గత ఐదేళ్ళుగా నియోజకవర్గంలోనే మకాం వేసి జనం మధ్యే గడిపారు. శ్రేణులకు అందుబాటులో వుంటూ అటు ప్రజా సమస్యలపై ఇటు శ్రేణుల సమస్యలపై స్పందించి పోరాడుతూ వచ్చారు. దీంతో శ్రేణుల్లో ఆత్మస్థైర్యం పెంచగలిగారు. టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ ఆయనకు ప్రాధాన్యత ఇవ్వడం కలసివచ్చింది. ఈ నేపథ్యంలో ప్రతిష్ఠాత్మకంగా జరిగిన చంద్రగిరి ఎన్నికల్లో నానీ గత రికార్డులను బద్దలు కొడుతూ మెజారిటీ సాధించారు. గత ఎన్నికల్లో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సాధించిన 41 వేల మెజారిటీని అధిగమించి భారీ ఆధిక్యతతో నానీ గెలుపొందారు. దీంతో పాతికేళ్ళ సుదీర్ఘ విరామం తర్వాత నియోజకవర్గంలో టీడీపీ జెండాలు అధికారికంగా రెపరెపలాడుతోంది.

చంద్రగిరిలో తారుమారైన చెవిరెడ్డి వ్యూహాలు

చంద్రగిరి నియోజకవర్గంలో గత పదేళ్ళుగా ఎమ్మెల్యేగా కొనసాగిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి రాజకీయ వ్యూహాలకు పెట్టింది పేరు. దీర్ఘకాలిక లక్ష్యాలు పెట్టుకుని ఓపికగా, భారీ ఆర్థిక వనరులు వెచ్చించి పని చేయడం ఆయనకు అలవాటు. అలాగే సర్వేలకు కూడా ఆయన వైసీపీలో పేరుమోశారు. ఆ కారణంగానే ఆయన వైసీపీ అధినేత జగన్‌కు చేరువయ్యారు. గడచిన పదేళ్ళుగా నియోజకవర్గంలో ప్రజలకు, ప్రత్యేకించి కొన్ని వర్గాలకు తాయిలాలు పంచిపెడుతూ పట్టు పెంచుకునేందుకు యత్నిస్తూ వచ్చారు. 2014లో స్వల్ప తేడాతో గెలిచిన ఆయన తనదైన పనితీరుతో నియోజకవర్గంలో పాతుకుపోయేందుకు యత్నించారు. 2019లో వైసీపీ సానుకూల పవనాల కారణంగా 41 వేల మెజారిటీతో గెలిచారు. తాయిలాల పంపిణీని మరింత విస్తృతం చేశారు. భారీ ఎత్తున ఆర్థిక వనరులు వెచ్చించారు. ఎన్ని వ్యూహాలు పన్నినా, ఎంతగా శ్రమించినా, ఎంత భారీగా ఖర్చు చేసినా తాజా ఎన్నికల్లో అవేవీ పనిచేయలేదు. గత ఎన్నికల్లో తాను సాధించిన మెజారిటీకి మించి ప్రత్యర్థి పులివర్తి నానీ గెలవడంతో చెవిరెడ్డి వ్యూహాలేవీ పనిచేయలేదని నిరూపణైంది.

సత్యవేడులో ఫలించని మంత్రి పెద్దిరెడ్డి మంత్రాంగం

సత్యవేడులో సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చివరి క్షణంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. ఆయన వైసీపీని వీడిన సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అదే ఊపులో టీడీపీ టికెట్‌పై ఎన్నికల బరిలో దిగారు. దీంతో కోనేటి ఆదిమూలాన్ని ఎలాగైనా ఓడించాలని మంత్రి పెద్దిరెడ్డి వర్గం ఇక్కడ మకాం వేసింది. మాజీ మంత్రి కుతూహలమ్మ సోదరి కుమారుడైన రాజేశ్‌ను తిరుపతి నుంచీ తీసుకొచ్చి వైసీపీ అభ్యర్థిగా బరిలోకి నిలిపింది. ఎన్నికల్లో అతడికి ఆర్థిక వనరులు సమకూర్చి ఆదిమూలం ఓటమికి శక్తివంచన లేకుండా యత్నించింది. ఓ దశలో ఆదిమూలం ఓటమి ఖాయమన్న మాట కూడా నియోజకవర్గంలో వినిపించింది. అయితే ఆటంకాలన్నింటినీ అధిగమించి ఆదిమూలం స్వల్ప తేడాతోనే అయినా విజయం సాధించారు. దీంతో ఆయన్ను ఓడించేందుకు మంత్రి పెద్దిరెడ్డి మంత్రాంగం ఏమాత్రం పనిచేయలేదని తేలిపోయింది.

తొలిసారి ఎమ్మెల్యేలుగా ముగ్గురికి అవకాశం

జిల్లాలో తాజా ఎన్నికల్లో ముగ్గురు తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. సూళ్ళూరుపేట నుంచీ విద్యాధికురాలైన డాక్టర్ నెలవల విజయశ్రీ, శ్రీకాళహస్తి నుంచీ బొజ్జల సుధీర్‌రెడ్డి, చంద్రగిరి నుంచీ పులివర్తి నానీ తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు.



హతవిధీ...!!

• మట్టికరిచిన వైసీపీ యోధులు

నెల్లూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలన ప్రజల్లో అశాంతి కలిగించిందో.. సంక్షేమం చాటున జరిగిన దోపిడీ కనికట్టును ప్రజలు పసిగట్టారో..! వైసీపీ నాయకుల తీరువల్ల ఊరు,రాష్ట్రం పాడైపోతోందని భావించారో..! ఏమనుకున్నారో...! ఏమో మహా మహులైన ఆ పార్టీ నాయకులను ఈ ఎన్నికల్లో మట్టి కరిపించారు. మొహం ఎత్తుకోలేని విధంగా ఓడించి కసి తీర్చుకున్నారు.



పోలింగ్ కేంద్రం నుంచి అర్ధంతరంగా వెళ్లిపోతున్న విజయసాయిరెడ్డి

అయ్యో.. విజయసాయిరెడ్డి

రాజ్యసభ సభ్యత్వం ఇంకా నాలు గేళ్ల ఉన్నా దాన్ని వదులు కొని పార్ల మెంట్ ఎన్నికల బరిలోకి దిగిన విజయసాయి రెడ్డికి జిల్లాలో ఘోర పరాజయం ఎదురయ్యిం ది. టీడీపీ అభ్యర్థి వేమి రెడ్డి ప్రభాకర రెడ్డికి ఈయన దీటైన అభ్యర్థి అనుకున్నారు. విజయ సాయి పోటీలో ఉంటే వైసీపీ నాయకులు, శ్రేణులు ఉత్సాహంగా పనిచేస్తారని అధినాయకత్వం భావిం చింది. జిల్లాకు చెందినవాడే అయినా ఏనాడు ఎవరికీ ఉపయోగపడని విజయసాయిని జిల్లా ముద్దు బిడ్డగా ప్రజలకు పరిచయం చేస్తూ ప్రచారం చేసుకున్నారు. కానీ ఫలితం దక్కలేదు. కూటమి గాలి ముందు, టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి ప్రజల్లో ఉన్న మంచి పేరు ముందు విజయ సాయిరెడ్డి నిలవలేక పోయారు. వారిద్దరి మధ్య ఉన్న వ్యత్యాసాలను ప్రజలు బేరీజు వేసుకుని ఓటు వేశారు. దీంతో 2.45 లక్షల భారీ మెజారిటీతో వేమిరెడ్డికి పట్టం కట్టారు. ఒక్కటంటే ఒక్క రౌండ్‌లో కూడా విజయసాయికి మెజారిటీ ఇవ్వకుండా ఘోరంగా ఓడించారు.

పాపం ఆదాల:

నెల్లూరు ఎంపీగా ఉన్నారు. అసెంబ్లీకి వెళ్లాలని, అవకాశం ఉంటే మంత్రి కావాలనే ఆశతో నెల్లూరు రూరల్ నియోజక వర్గాన్ని ఎంచుకున్నారు. ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే హడావిడి చేశారు. చిన్న చిన్న అభివృద్ధి పనులు చేసి ప్రజల మనసు గెలుచుకోవాలనుకున్నారు. కానీ ప్రయోజనం కనిపించలేదు. వయస్సు మీద పడుతున్న తరుణంలో మంత్రిగా రాజకీయ జీవితానికి విరామం ప్రకటించాలనుకున్న ఆయన ఆశ నెరవేరలేదు. ఓటమి బాధతో రాజకీయ విరామం ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

హ్యాట్రిక్ అనుకున్నాడు.. ప్రజలు రెస్ట్ ఇచ్చారు

కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలి నుంచి ఈ సారి కూడా గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గుర్తింపు పొందాలనుకున్నారు. కానీ, ఆయనను ప్రజలు ఓడించి రెస్ట్ ఇచ్చారు. జిల్లాలో అతిపెద్ద అవినీతి ప్రజాప్రతినిధిగా ఈయన నిందలు మోశారు. తన వేధింపులకు తెలు గుదేశం కార్యకర్తలు ఆత్మహత్యలు చేసుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొ న్నారు. నియోజకవర్గం లో పిడికెడు మట్టి కావాలన్నా, బండెడు ఇసుక కావాలన్నా, ఇల్లు కొనాలన్నా, అమ్మాలన్నా అన్నింటికి ఆయనకు ముడుపులిచ్చుకోవాల్సిందే. పదేళ్లుగా ఇలాంటివి చూసి విర్తకి చెందిన కావలి ప్రజలు దగుమాటిని దరిచేర్చుకున్నారు.

కాకాణి కల చెదిరే..!

వైసీపీలో బలమైన నాయకుడు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2014, 2019 ఎన్నికల్లో గెలిచారు. రెండున్నరేళ్లు మంత్రిగా పని చేశారు. కానీ జిల్లాకు చేసిన మేలు ఏమీ లేదు. ప్రాజెక్టులు తేలేదు సరికదా కొండలు కొల్ల గొట్టాడన్న విమర్శలు మూటకట్టుకున్నారు. ఎదురు తిరిగిన కార్యకర్తలను, ప్రజలను కేసులతో వేధించారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. టోటల్‌గా ఎన్నికల సమాయానికి డబ్బు మనిషిగా పేరు తెచ్చుకున్నారు. ఇవన్నీ కలిసి సర్వేపల్లికి శాశ్వత ఎమ్మెల్యేగా ఉండిపోవాలనుకున్న ఆయన కలను చెరిపేశాయి. కాకాణి తీరుతో కలత చెందిన జనం సోమిరెడ్డికి జై కొట్టారు.

మేకపాటికి పరాభవం

మేకపాటి కుటుంబానికి గతంలో ఒక ఎంపీ, రెండు ఎమ్మెల్యే పదవులు ఉండేవి. 2019 ఎన్నికలు వచ్చే సరికి రాజమోహన్‌రెడ్డి ఎంపీ సీటు పోయింది. కుమారుని మరణంతో దక్కిన మంత్రి పదవి పోయింది. ఈ ఎన్నికలకు ముందు ఎమ్మెల్యేగా ఉన్న తమ్ముడు చంద్రశేఖర్‌రెడ్డి దూరమయ్యాడు. ఉదయగిరి టిక్కెట్టు కష్టపడి తెచ్చుకోవాల్సి వచ్చింది. అయినా ప్రయోజనం దక్కలేదు. ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలు రెండింటిలోనూ మేకపాటి కుటుంబీకులు ఓటమి పాలయ్యారు. దశాబ్దాల కాలం శాసనసభ, పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహించిన ఈ కుటుంబానికి ఈ సారి ఎక్కడా చాన్స్ లేకుండా పోయింది. మేకపాటి కుటుంబం రాజకీయ ప్రతిష్ఠ మసకబారిపోయింది.

నల్లపరెడ్డికి కోలుకోలేని దెబ్బ

నల్లపరెడ్డి కుటుంబానికి జిల్లాలో ఎంతో పేరుంది. ఆ కుటుంబ వారసుడిగా కోవూరును కేంద్రంగా చేసుకొని ప్రసన్నకుమార్‌రెడ్డి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. పలుసార్లు ఇక్కడి నుంచి గెలిచి పట్టు నిరూపించుకున్నారు. ఈ సారి కూడా గెలుపు తనదే అనుకున్నారు. ఊహించని విధంగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎదురయ్యింది. ఇంతకాలం పెత్తనం చేసిన వైసీపీ నాయకులపై కసి, కోపాన్ని ఓటు రూపంలో ప్రదర్శించుకునే అవకాశం ప్రజలకు దొరికింది. భారీ ఓట్ల తేడాతో ఓటమి అనివార్యం అయ్యింది. ఈ ఎన్నికల వరకే ఈ ప్రమాదం అనుకోవడానికి వీలు లేదు. ఇక ఈయన రాజకీయ జీవితం అంతా అన్ని విధాలా బలవంతులు, సమాజంలో మంచి వారుగా గుర్తింపు పొందిన వీపీఆర్ కుటుంబంతో తలపడాల్సి ఉంటుంది.

ప్రసన్నుడి గోశాలలో గడ్డివామి దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాక సిబ్బంది

బిట్రగుంట, జూన్ 4: బోగోలు మండలం కొండబిట్ర గుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ గోశాలలోని గడ్డివామి మంగళవారం మధ్యా హ్నం అగ్నికి ఆహుతైంది. ఆల యం పడమరవైపు దిగువున పొగతో కూడిన మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు కావలి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందచేశారు. ఈలోగా కొందరు స్థానికులు మంటలు అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న ఆలయ ఈవో రాధాకృష్ణ సంఘటనా స్థలానానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 40 వేల వరకు నష్టం జరిగి ఉంటుందని ఈవో తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది చొరవతో మంటలు ఆర్పారు.

బెట్టింగ్ రాయుళ్ల బెంబేలు

వరికుంటపాడు, జూన్ 4: ఎన్నికల చదరంగంలో రాజకీయ క్రీడను ముందస్తుగా ఊహించని బెట్టింగ్‌రాయుళ్లు మంగళవారం విడుదలైన ఫలితాలతో బెంబేలెత్తిపోయారు. తమ పార్టీలు, అభ్యర్థులపై ఉన్న అభిమానంతో మండలంలోని పలు గ్రామాల నుంచి రూ.లక్షల్లో బెట్టింగులకు సై అంటూ కొంతమంది ముందుకు దూకారు. ఎన్నికల అనంతరం కొంతమేర స్తబ్ధుగా ఉన్నా ఎగ్జిట్ పోల్స్ విడుదల నుంచి బెట్టింగుల పర్వం మరింత జోరందుకుంది. అయితే అధిక శాతం సర్వేలు కూటమి వైపు మొగ్గు చూపడంతో ఆ పార్టీలకు అనుకూలంగా ఉన్న కార్యకర్తలు, నాయకులతో పాటు సామాన్యులు సైతం జై కొడుతూ బెట్టింగులకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో అధికారపార్టీ నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకు చేసిన ఊకదంపుడు ప్రగల్భాలతో పాపం ఆ పార్టీకి చెందిన సానుభూతిపరులే బలయ్యారు. వారికి తోడు అనుకూల సర్వేల మాయ మాటలు సైతం నమ్మిన కొంతమంది అధికార పార్టీనే తిరిగి విజయం సాధిస్తుందనే అపోహతో బెట్టింగులకు దిగి జేబులు ఖాళీ చేసుకున్నారు. అందులోనూ ఆ పార్టీలో కీలకంగా వ్యవహరించే కొంతమంది ఒక్కొక్కరుగా రూ.లక్ష నుంచి రూ.20లక్షల పైబడి వరకు బెట్టింగులు పెట్టి ఆర్థికంగా నష్టపోయారు. తమ పార్టీ నాయకుల మాటలు నమ్మి మోసపోయామంటూ లోలోన మదనపడుతున్నారు. విషయం బయటకు తెలిస్తే ఎక్కడ పరువు పోతుందోననే బెంగతో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా మౌనం వహిస్తున్నట్లు తెలిసింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	156
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	274
స్కిన్‌లెస్	304
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6857
వెండి కిలో ధర	రూ. 91,200
వెండి ఒక గ్రాము	రూ. 93.20

జోరుగా మద్యం విక్రయాలు

ఉదయగిరి రూరల్, జూన్ 4: ఉదయగిరి ప్రాంతంలో మంగళవారం అనధికారిక మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అధికారులు మద్యం దుకాణాలను మూసివేశారు. అయితే మద్యం బెల్టుషాపుల నిర్వాహకులు ముందుగానే షాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి నిల్వ చేసుకొన్నారు. షాపుల మూతపడడంతో మద్యం కోసం మందుబాబులు బెల్టుషాపులను ఆశ్రయించారు. నిర్వాహకులు ఒక్కో బాటిల్‌పై రూ.100 నుంచి రూ.150లు అదనంగా నగదును తీసుకున్నారు. ప్రధానంగా కూల్‌డ్రింక్స్ దుకాణాలు, నిర్మానుష్య ప్రాంతాల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. అనధికార మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నా సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరించడంపై పలువురు విమర్శలకు తావిస్తోంది.

ప్రమాదంలో ప్రకృతి

- కలుషితం చేస్తున్న రసాయనాలు
- నిబంధనలు గాలికొదిలేస్తున్న పరిశ్రమలు
- థర్మల్ కేంద్రాలతో పెరిగిన ఉష్ణోగ్రత
- ఇబ్బడిముబ్బడిగా వాహనాలు
- మేల్కొనకుంటే పెనుముప్పే!
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

నెల్లూరు(వైద్యం), జూన్ 4 : విలాసవంతమైన జీవితం కోసం మానవులు చేసే తప్పిదాలు, పరిశ్రమలు నిబంధనలు పాటించక పోవడం వంటివి పర్యావరణానికి పెనుముప్పుగా మారుతున్నాయి. ఆధునిక సాంకేతికత, పారిశ్రామికీకరణ ముసుగులో ప్రకృతి వినాశనానికి పాల్పడు తుండటంతో ఏడాదికేడాదికి జీవుల మనుగడ ప్రశ్నార్థక మవుతోంది. ప్రభుత్వాలు కూడా ఇలాంటి విధ్వంసకాలకు కొమ్ముకాస్తూ అవినీతికి పాల్పడటంతో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోంది. పర్యావరణానికి జరుగు తున్న హాని వల్ల జంతుజాలానికి ఆహారం దొరకని పరిస్థితి దాపురిస్తోంది.

వాతావరణంలో మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, గతి తప్పిన రుతువులు, సునామీలు, వరదలు, కరువులతో జీవావరణ సమతుల్యత లోపం, నీరు, గాలి, భూమి కలుషితం కావడం ప్రజారోగ్యం ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ దెబ్బతినడానికి కారణలవుతున్నాయి. కాలుష్యం, చెట్ల నరికివేత, సహజ నిక్షేపాల వెలికితీత వంటివి భూమిని మరింతగా కుంగదీస్తున్నాయి. పర్యవసానంగా భూకంపాలు, సునామీలు విరుచుకుపడుతున్నాయి. భూమికి కవచంలా ఉన్న ఓజోన్ పొర దెబ్బతింటోంది. భూమి, నీరు, గాలి కాలుష్యానికి గురవుతూ ప్రాణాలనే హరిస్తున్నాయి. కళ్ల ముందే ఇన్ని అనర్థాలు జరుగుతున్నా మనిషిలో మార్పు రావటం లేదు. ప్రాణ వాయువును అందించే మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదు. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి 1972 నుంచి పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించింది. ఏటా జూన్ 5వతేదీన పర్యావరణ దినోత్సవం జరుపుకోవాలని తీర్మానించింది.



జిల్లాలో పరిశ్రమలు ఎక్కువే..

జిల్లాలో ఒకప్పుడు 10లోపు పరిశ్రమలు ఉండేవి. వాటిలోనూ పర్యావరణ నిబంధనలు పాటించటంతో పర్యావరణానికి పెద్దగా ముప్పు వాటిల్లలేదు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. తీర ప్రాంతం మొత్తం పరిశ్రమల హబ్‌గా మారింది. ముత్తుకూరు నుంచి రామాయ పట్నం దాకా 80 కి.మీ విస్తరించి ఉన్న తీరంలో 13 కిలోమీటర్ల పరిధిలోనే 15 థర్మల్ విద్యుత్ పరిశ్రమలు నిర్మిస్తున్నారు. వీటిలో కొన్ని ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. ఆయా పరిశ్రమల నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో 2 నుంచి 5 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగి పంటల దిగుబడి 30 శాతం తగ్గుతోంది. ఈ నేపథ్యంలో ఆక్వా పరిశ్రమమే కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. థర్మల్ విద్యుత్ కేంద్రాల వల్ల రోజుకు 2 లక్షల టన్నుల బూడిద వెదజల్లబడి తాగునీరు కలుషితం అవుతోంది. థర్మల్ కేంద్రాల వల్ల పెరిగిన వేడి వల్ల సముద్రంలోని వేల టన్నుల రొయ్యలు, చేపలు చనిపోయి మత్స్యకారులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. ఇక వాహన కాలుష్యం, ధూళి వల్ల ప్రజలు శ్వాసకోశ సంబంధ వ్యాధులకు గురవుతున్నారు. గతంలో 42 డిగ్రీలకే అల్లాడిపోయిన జిల్లా ప్రజానీకం ఈ ఏడాది వేసవిలో సుమారు 46 డిగ్రీల వరకు ఎండను చవి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీటికితోడు ఫ్రిజ్‌లు, ఏసీల వాడకం పెరగడంతో క్లోరోఫ్లోరో కార్బన్ వాతావరణంలోకి వెదజల్లబడి ఓజోన్ పొరను దెబ్బతీస్తున్నాయి. వీటికితోడు విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం కూడా ప్రకృతికి పెద్ద సమస్యగా మారుతోంది. ప్రభుత్వ చర్యలకుతోడు ప్రజలు కూడా స్వచ్ఛందంగా పర్యావరణ పరిరక్షణ బాధ్యత వహించకపోతే భవిష్యత్తులో పెను ప్రమాదాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం



జిల్లాలో ఏర్పాటు చేసిన పరిశ్రమలు తప్పని సరిగా నిబంధనలు పాటించాలి. లేదంటే శాఖాపరమైన చర్యలు తప్పవు. ప్రతి పరిశ్రమలో 30 శాతం గ్రీన్ బెల్ట్ ఉండాలి. ఇందుకోసం మొక్కలు పెంచాలి. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఒక్కరు ప్రకృతి ప్రేమికులుగా మారి మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఏ పరిశ్రమకైనా అనుమతులు ఇచ్చే సమయంలో కాలుష్య నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రజల్లోనూ పర్యావరణంపై చైతన్యం తీసుకు వచ్చేలా కృషిచేస్తున్నాం.

- సీహెచ్ రాజశేఖర్, కాలుష్య నియంత్రణశాఖ ఈఈ

వెండి నందిసేవపై ఆది దంపతుల వైభోగం



పెద్ద వెండి నంది వాహనంపై ఊరేగుతున్న మల్లికార్జునస్వామి, కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 4: మండలంలోని జొన్నవాడ ఆలయం లో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షి తాయి మంగళవారం పెద్ద వెండి నంది వాహనంపై ఊరేగు తూ భక్తులకు దర్శనమిచ్చారు. అత్యంత వైభవంగా సాగిన వెండి నందిసేవ ఊరేగింపులో స్వామి, అమ్మవార్లకు స్థానిక భక్తులు అడుగడుగునా నివేదనలు సమర్పించారు. ఉదయం గిన్నెభిక్ష గ్రామోత్సవంలో మల్లికా ర్జున స్వామికి భక్తులు బియ్యం, దక్షిణాతాంబూలం సమర్పించుకున్నారు. భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ వి గిరికృష్ణ ఉత్సవాలను పర్యవేక్షించారు.

కనువిందు చేసిన పుష్పాలంకరణ

బ్రహ్మోత్సవాలలో మంగళవారం సాయంత్రం నెల్లూరుకు చెందిన నూనె మల్లికార్జున యాదవ్ ఆలయంలోని గర్భాలయం, అంతరాలయం, ముఖ మండపం ఆలయం వెలుపల, ప్రధాన ద్వారాలకు సువాసనలు వెదజల్లే పలురకాల ప్రత్యేక పుష్పాలంకరణ భక్తులకు కనువిందు చేసింది.

బ్రహ్మోత్సవాలలో నేడు

బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం మల్లికార్జునస్వామి, కామాక్షితాయి రథోత్సవం వైభవంగా జరగనుంది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలి రానున్నారు. రాత్రి గజ సింహ వాహనోత్సవాలు జరగనున్నాయి.

సీతాలమ్మకు పొంగళ్లు

బిట్రగుంట, జూన్ 4: బోగోలు మండలం కడనూతల దళితవాడలో గ్రామదేవత సీతాలమ్మకు పొంగళ్ల కార్యక్రమాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేళతాలాలు, మంగళవాయిద్యాలు, తప్పెట్లతో ఉదయం గ్రామ సద్ది కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం గ్రామంలోని ప్రతి ఇంటింటి నుంచి మహిళలు పొంగళ్లను అమ్మవారి సన్నిధికి చేర్చి నైవేద్యంగా సమర్పించారు.

నీట్‌లో 'రత్నం' విజయం



విద్యార్థినిని అభినందిస్తున్న జీఎం, అకాడమీ సిబ్బంది

నెల్లూరు (విద్య), జూన్ 4 : డాక్టర్ కిషోర్స్ రత్నం మెడికల్ అకాడమీ విద్యార్థులు 2024 నీట్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించారని ఆ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ కృష్ణకిషోర్ తెలిపారు. నగరంలోని ఆ విద్యా సంస్థలో మంగళవారం ఏర్పాటు అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాము మెడికల్ అకాడమీ ప్రారంభించిన తొలి ఏడాదిలోనే విద్యార్థులు నీట్ ఫలితాల్లో సత్తాచాటారన్నారు. తమ విద్యార్థిని సీహెచ్ నాగసింధు 646 మార్కులు, వీ సాయినిత్యశ్రీ 626, డీ శరణ్య 556, ఏ తప్శశ్రీ 526, వై బింధు 522, ఎం తిలగవతి 476 మార్కులు సాధించారన్నారు. అత్యుత్తమ విద్యావిధానంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని, మున్ముందు మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు వాసంతి కిషోర్, రోషిణి, జీఎం రామ్మూర్తినాయుడు, ప్రిన్సిపాల్ కేవీడీ మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కోదండరామస్వామి గ్రామోత్సవం



సంగం, జూన్ 4: రామచంద్రాపురం కోదండరామస్వామిని మంగళవారం భక్తులు, గ్రామస్థులు అశ్వవాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు చేపట్టిన స్వామిఅమ్మవారికి కల్యాణంలో భక్తులు పాల్గొన్నారు.

పశువైద్యం గాల్లో దీపం

• వేధిస్తున్న వైద్యుల కొరత • పాడిరైతుల అవస్థలు

తోటపల్లిగూడూరు, జూన్ 4 : మండలంలో పశు వైద్యం గాల్లో దీపంలా మారింది. ఆసుపత్రుల్లో వైద్యుల కొరత కారణంగా పశువైద్యం అందక పాడి రైతులు అవస్థలు పడుతున్నారు. నిధుల కొరతతో పాడిరైతులకు కనీసం మందులు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామని పశు వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ ప్రధానమైంది. జిల్లాలో వ్యవసాయ ఆదాయం మొదటిగా ఆతర్వాత స్థానంలో పాడిపరిశ్రమ ఉంది. పాడి పరిశ్రమను పరిరక్షించడంలో, పశువైద్యాన్ని సమర్థవంతంగా అందించడంలో ప్రభుత్వంతో పాటు పశు సంవర్ధక శాఖ విఫలమైనట్లు విమర్శలున్నాయి. జిల్లావ్యాప్తంగా చూస్తే వైద్యుల పోస్టులు, అసిస్టెంట్ పోస్టులు, అటెండరు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. సాధారణంగా ప్రతి రెండు గ్రామాలకు పశువైద్య ఉపకేంద్రాలు ఉండాలి. మండలకేంద్రానికి ఒక ప్రధాన కేంద్రం ఉండాలి. అదేవిధంగా ఉపకేంద్రాల్లో ఒక అసిస్టెంట్ డాక్టర్, కాంపౌండర్ ఉండాలి. ప్రధాన కేంద్రంలో డాక్టర్, అసిస్టెంట్ డాక్టర్, అటెండర్, కాంపౌండర్ అందుబాటులో ఉండాలి. అయితే మండలంలో ఈ పరిస్థితి కనపడడంలేదు. 22 పంచాయతీలు ఉన్నా రెండు మాత్రమే కేంద్రాలు, మిగతావన్నీ ఉపకేంద్రాలుగా ఉన్నాయి. వైద్యుల కొరత కారణంగా కొన్ని కేంద్రాల్లో అటెండర్లు పశువైద్యం చేస్తున్నారు. కొత్తపాలెం, వెంకన్నపాలెం, విలుకానిపల్లి, కోడూరు, చింతోపు, నరుకూరు తదితర గ్రామాల్లో ప్రైవేటు వైద్యులైన గోపాలమిత్ర వైద్యులే ఆయా గ్రామాల్లో పర్యవేక్షించి పశువులకు వైద్యం చేస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో సరిపడినన్ని మందులు ఉండడం లేదు. దీంతో బయట మందులు తెచ్చుకుని వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువైద్యం అందించాలని పాడి రైతులు కోరుతున్నారు.

కలిగిరిలో దుకాణాల మూత

కలిగిరి : పోలీసుశాఖ ఆదేశాలతో పట్టణంలో మంగళవారం దుకాణాలు మూతపడ్డాయి. ఓట్లలెక్కింపు నేపథ్యంలో పోలీసులు ప్రతి దుకాణానికి వెళ్లి దుకాణాలు మూసివేసి శాంతిభద్రతలకు సహకరించాలని కోరారు. ఎస్ఐ సంతోష్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో తహసీల్దారు కార్యాలయం, కలిగిరమ్మ కూడలిలో పికెట్ ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంలో ప్రధాన రహదారి ఉదయం నుంచి నిర్మానుష్యంగా మారింది.



నిర్మానుష్యంగా ఉన్న కలిగిరి-వింజమూరు రహదారి

ఎన్‌డీసీసీబీ చైర్మన్ పదవికి కామిరెడ్డి రాజీనామా

నెల్లూరు (హరనాథపురం), జూన్ 4 : నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవికి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మంగళవారం రాజీనామా చేశారు. రాజీనామా ప్రతిని సహకారశాఖ రాష్ట్ర కమిషనర్‌కు పంపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామాచేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది.

సోమశిలలో 7.344 టీఎంసీల నీరు నిల్వ



అనంతసాగరం, జూన్ 4: సోమశిల డ్యాం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు మంగళవారానికి 7.344 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

కలగా మిగిలిన కృష్ణపట్నం బీచ్ పర్యాటక అభివృద్ధి..!


ముత్తుకూరు, జూన్ 4 : దేవతలు నిర్మించిన ఆలయంగా ప్రసిద్ధి చెందిన పురాతన సిద్ధేశ్వరాలయం. సురక్షితమైన సముద్రతీరం. మార్గ మధ్యంలో లైట్‌హౌస్. ఈ ప్రాంతాన్ని సర్వాంగసుందరంగా అభివృద్ధి చేసి పర్యాటక ప్రదేశంగా మారుస్తామని ప్రజాప్రతినిధులు గుప్పించిన హామీలు మాటలకే పరిమితమయ్యాయి. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న కృష్ణపట్నం బీచ్ పర్యాటక అభివృద్ధి కలగా మారుతోంది. ఇరవై ఏళ్లుగా కృష్ణపట్నం బీచ్‌ని పర్యాటక ప్రదేశంగా మారుస్తామని, ఈ ప్రాంతంలో పర్యటించిన ముఖ్యమంత్రులు, మంత్రులు హామీలు ఇస్తూనే ఉన్నారు. కృష్ణపట్నం సముద్ర తీరం సురక్షిత ప్రాంతంగా ప్రసిద్ధి. ఆదివారాలు, పండుగ సమయాల్లో పలు ప్రాంతాల నుంచి సందర్శకులు సముద్ర స్నానాలకు కృష్ణపట్నం తీరానికి వస్తుంటా రు. శివరాత్రి సమయంలో ప్రసిద్ధి చెందిన సిద్ధేశ్వరాలయంతోపాటు, కృష్ణపట్నం సముద్ర తీరానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. జిల్లా కేంద్రం నుంచి కేవలం 26 కిలోమీటర్ల దూరం ఉండడం, నిరంతరం బస్సు సౌకర్యం ఈప్రాంత పర్యాటక అభివృద్ధికి అవకాశాలు అధికంగా ఉన్నాయి. మరి ఎందుకనో పాలకులు కృష్ణపట్నం పర్యాటక

• హామీలకే పరిమితం

అభివృద్ధిపై సీతకన్ను వేశారు. గతంలో కృష్ణపట్నం బీచ్ పర్యాటక అభివృద్ధికి అంచనాలు సిద్ధం చేశారు. నిధులు మంజూరే ఆలస్యం అనుకునే పరిస్థితిలో అభివృద్ధి కాస్త అందలం ఎక్కింది. అప్పటి నుంచి కృష్ణపట్నం బీచ్ అభివృద్ధిని పట్టించుకునే వారు కరువయ్యారు. జిల్లాలో లైట్‌హౌస్ ఉన్న ప్రాంతాల్లో కృష్ణపట్నం తీరం ప్రధానమైంది. కృష్ణపట్నం గ్రామం వరకు ఇప్పటికే రహదారి సౌకర్యం ఉంది. గ్రామంలో నుంచి బకింగ్‌హాం కాలువ మీదుగా రెండు కిలోమీటర్లు గ్రావెల్ రోడ్డులో ప్రయాణిస్తే కృష్ణపట్నం సముద్ర తీరం చేరుకోవచ్చు. కొద్దిపాటి వసతులు కల్పించి, తీరం వద్ద సౌకర్యాలు ఏర్పాటుచేస్తే పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. తద్వారా స్థానికులకు ఉపాధి కలిగే అవకాశాలు మెరుగవుతాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి కృష్ణపట్నం బీచ్ పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కృష్ణపట్నం తీరంలో సందర్శకుల కోలాహలం (ఫైల్)



ప్రసిద్ధిగాంచిన కృష్ణపట్నంలోని మనుమ సిద్ధేశ్వరస్వామి ఆలయం

ప్రభంజనం

ఏపీ తీర్పు @ 2024

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా : నారాయణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): భారీ విజయాన్ని అందించిన నెల్లూరు నగర ప్రజలందరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఎమ్మెల్యేగా గెలుపొందాక కౌంటింగ్ కేంద్రంలో మంగళవారం ఆయన ఆర్వో వికాస్ మర్మత్ నుంచి డిక్లరేషన్ ఫారం అందుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. నగర ప్రజలు 72,489 ఓట్ల మెజా రిటీతో తనను గెలిపించడం ఆనందంగా ఉందని, నగరంలోని సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. 2014 నుంచి 2019 వరకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని, మిగిలిపోయిన వాటిని వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయకుండా వదిలేసిందన్నారు. జగన్ అరాచక పాలన కారణం గానే ఈ ఎన్నికల్లో వైసీపీని ప్రజలు 11 స్థానాలకే పరిమితం చేశారన్నారు. టీడీపీ విజయానికి కార్యకర్తలు ఎంతో శ్రమించారని, వారికి అండగా ఉండాలన్న ఉద్దేశంతోనే తన కుటుంబ సభ్యులంతా కలిసి ఏడాదికి రూ.10 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.



నెల్లూరులోని కౌంటింగ్ సెంటర్‌లో ఆర్వో నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకుంటున్న పొంగూరు నారాయణ

నగరంలో నారాయణ మంత్రం

- 70 వేల మెజారిటీతో మాజీ మంత్రి ఘన విజయం
- ఏ రౌండ్‌లోనూ పోటీ ఇవ్వలేకపోయిన వైసీపీ

నెల్లూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : అందరూ ఊహించినట్లుగానే నెల్లూరు సిటీ నియోజకవర్గంలో కూటమి జెండా రెపరెపలాడింది. టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి పొంగూరు నారాయణ 72,489 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొంది రికార్డు బద్దలు కొట్టారు. వైసీపీ అభ్యర్థి ఎండీ ఖలీల్ అహ్మద్ ఏ దశలోనూ నారాయణకు పోటీ ఇవ్వలేకపోయారు. నారాయణకు ఈవీఎంల ద్వారా 1,18,126 ఓట్లురాగా, ఖలీల్‌కు 47,613 ఓట్లు వచ్చాయి. మొత్తం 18 రౌండ్లలోనూ టీడీపీ తన ఆధిపత్యాన్ని చూపింది. ప్రతి రౌండ్‌కూ ఆధిక్యత పెరిగింది తప్ప ఎక్కడా తగ్గలేదు. ఆ ప్రాంతం, ఈ ప్రాంతం అని లేకుండా నగర నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో కూడా టీడీపీ ఆధిక్యత కనిపించింది. పోస్టల్ బ్యాలెట్‌లోనూ టీడీపీ హవా కొనసాగింది. మొత్తం 3,071 పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు గాను 2425 ఓట్లు నారాయణకు దక్కడం విశేషం. ఖలీల్‌కు 449 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మాత్రమే దక్కాయి. మొత్తంగా 69 శాతం ఓట్లను నారాయణ దక్కించుకున్నారు. సిటీ నియోజకవర్గ చరిత్రలో ఇంత మెజారిటీ ఒక రికార్డుగా చెప్పుకుంటున్నారు. గత ఎన్నికల్లో 2 వేల ఓట్లలోపు స్వల్ప తేడాతో నారాయణ ఓటమి చెందిన విషయం తెలిసిందే. అయితే గడిచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో నెల్లూరు నగరవాసులు విసిగిపోయారు. అభివృద్ధి పనుల ఊసే కనిపించలేదు. పైగా కక్షసాధింపు రాజకీయాలకు వైసీపీ పాల్పడడంతో నగరవాసులు కసిగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. 2019తో పోలిస్తే ఐదు శాతానికిపైగా పోలింగ్ శాతం పెరగడం, ఆ ఓట్లన్నీ టీడీపీకి పడడంతో భారీ మెజారిటీ దక్కింది. పొంగూరు నారాయణ తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. నెల్లూరు సిటీ నుంచి మరో కొత్త వ్యక్తి ఎమ్మెల్యేగా ఎన్నికవడం విశేషం.

పేరు : పొంగూరు నారాయణ, **జననం :** 1956 జూన్ 15, నెల్లూరు

తల్లిదండ్రులు : సుబ్బరామయ్య, సుబ్బమ్మ, **విద్యాభ్యాసం :** ఎంఎస్సీ, పీహెచ్‌డీ

రాజకీయ నేపథ్యం : చదువు పూర్తయ్యాక నెల్లూరులోని వీఆర్ కాలేజీలో పార్ట్ టైం లెక్చరర్‌గా ప్రస్థానం ప్రారంభించారు. 1979లో హరనాథపురంలో ఓ చిన్న గదిలో నారాయణ ట్యూషన్ సెంటర్‌ను మొదలుపెట్టారు. అనతికాలంలోనే అది కోచింగ్ సెంటర్‌గా అభివృద్ధి చెందింది. పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించడంతో అక్కడి నుంచి నారాయణ వెనుదిరిగి చూడలేదు. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా నారాయణ విద్యాసంస్థలు ఇప్పుడు దేశ వ్యాప్తంగా విస్తరించి ఉన్నాయి. 1998లో చంద్రబాబుతో పరిచయం నారాయణను రాజకీయాలవైపు అడుగులు వేసేలా చేసింది. తొలుత టీడీపీ సర్వే విభాగంలో పనిచేసిన నారాయణ, ఆ తర్వాత 2004-14 మధ్య కాలంలో పార్టీ అంతర్గత వ్యవహారాల్లో క్రియాశీలంగా పనిచేశారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీగా ఎంపికై చంద్రబాబు మంత్రి వర్గంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. రాజధాని అమరావతి నిర్మాణంలో కీలకంగా వ్యవహరించారు. 2019లో తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లో నారాయణ నెల్లూరు సిటీ నుంచి పోటీ చేశారు. తాజాగా ఎన్నికల్లో విజయం సాధించారు.

రూరల్‌లో కోటంరెడ్డి హ్యాట్రిక్

31 వేల మెజారిటీతో ఆదాలపై గెలుపు ● పోస్టల్ బ్యాలెట్‌లోనూ భారీ ఆధిక్యత



నెల్లూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరోసారి తన ఆధిపత్యాన్ని చాటారు. వరుసగా మూడో సారి ఎమ్మెల్యేగా గెలుపొంది రికార్డు సాధించారు. రూరల్ నియోజకవర్గంలో హ్యాట్రిక్ సాధించిన తొలి ఎమ్మెల్యే కోటంరెడ్డి కావడం విశేషం. వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిపై 34,480 వేల ఓట్ల తేడాతో విజయాన్ని అందుకున్నారు. నెల్లూరు నగరంలోని డివిజన్లతోపాటు రూరల్ మండలంలోని గ్రామాల్లో విస్తరించిన నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలు కోటంరెడ్డికి పట్టం కట్టాయి. శ్రీధర్‌రెడ్డికి ఈవీఎంల ద్వారా 1,06,587 ఓట్లు రాగా, ఆదాలకు 74,275 ఓట్లు దక్కాయి. తొలి రౌండు నుంచే శ్రీధర్‌రెడ్డి ఆధిక్యత మొదలైంది. ఆ తర్వాత ఎక్కడా కూడా ఆదాల ఆధిక్యంలోకి రాలేకపోయారు. ప్రధానంగా నెల్లూరు నగరం లోని డివిజన్లు కోటంరెడ్డికి భారీ మెజారిటీని అందించాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలకూ అందకుండా రూరల్‌లో వార్ వన్‌సైడ్‌గా కనిపించింది. పోస్టల్ బ్యాలెట్‌లో కూడా టీడీపీ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మొత్తం 5,418 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదుకాగా వాటిలో కోటంరెడ్డికి 3388 దక్కాయి. ఆదాలకు 1220 పోస్టల్ బ్యాలెట్లు దక్కగా 645 ఓట్లు తిరస్క రణకు గురికావడం విశేషం. మొత్తంగా 56.53 శాతం ఓట్లను శ్రీధర్‌రెడ్డి దక్కించుకున్నారు. నిత్యం ప్రజల్లో తిరగడం, వైసీపీ పాలక పక్షంలో ఉన్నప్పుడు కూడా ప్రజా సమస్యలపై పోరాడటం ఆయన విజయానికి ప్రధాన కారణాలుగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వైసీపీ తీరును నిరసిస్తూ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చాక శ్రీధర్‌రెడ్డి బలం మరింత పెరిగింది. అదే సమయంలో కూటమి గాలి వీయడంతో గత ఎన్నికలతో పోలిస్తే ఎక్కువ మెజారిటీని సాధించారు.

పేరు : కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, **జననం :** 1964 సెప్టెంబరు 26, సంగం మండలం పడమటిపాలెం, **తల్లిదండ్రులు :** కోటంరెడ్డి బేబిరెడ్డి, సరళమ్మ, **విద్యాభ్యాసం :** డిగ్రీ

రాజకీయ నేపథ్యం : 1977లో తొలిసారి విద్యార్థి రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1981లో విద్యార్థి సంఘం నాయకుడిగా ఎన్నికయ్యారు. 1985లో వీఆర్ కాలేజీ స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్‌గా ఎన్నికై, కాలేజీ సమస్యలపై 13 రోజుల ఆమరణ నిరాహార దీక్ష చేశారు. 1986లో ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ సభ్యుడిగా ఎన్ని కయ్యారు. ఆ తర్వాత యూత్ విభాగం ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1987 నుంచి 2014 వరకు రాజకీయాల్లో చురుగ్గా ఉంటూ అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారు. సమగ్ర సోమశిల, కండలేరు, తెలు గుగంగ ప్రాజెక్టు కోసం పోరాటం, ఆల్మట్టి ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడుతూ నెల రోజులు జిల్లాలో రథయాత్ర, రైతులకు గిట్టుబాటు ధర కోసం పోరాటం, విజయ మహల్ గేటు వద్ద బాక్స్ టైపు బ్రిడ్జి కోసం ఉద్యమం, టోల్ గేట్ ఏర్పాటుకు వ్యతి రేకంగా పోరాటం వంటివి కోటంరెడ్డి ఉద్యమాల్లో కీలకమైనవి. 2014లో వైసీపీ తరపున రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి తొలి సారి ఎమ్మెల్యేగా ఎన్నిక య్యా రు. 2019లో రెండో సారి కూడా వైసీపీ తరపున రూరల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2023లో వైసీపీ నుంచి బయటకు వచ్చి టీడీపీలో చేరి తాజా ఎన్నికల్లో ముచ్చటగా మూడో సారి కూడా ఎమ్మెల్యే పీఠం దక్కించుకున్నారు.



తన నివాసంలో కేక్ కట్ చేసి డాక్టర్ శివప్రసాద్‌కు తినిపిస్తున్న బీద రవిచంద్ర



టీడీపీ జిల్లా కార్యాలయానికి విద్యుత్ వెలుగులు



నారాయణ క్యాంపు కార్యాలయంలో పిల్లలతో కేక్ కట్ చేయిస్తున్న నారాయణ కుటుంబ సభ్యులు

గెలుపు సంబరాలు



బాణసంచా కాల్చుతున్న జనసైనికులు

నెల్లూరు(వైద్యం), జూన్ 4 : పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో తిరుగులేని ఫలితాలు రావడంతో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాల్లో మునిగాయి. కూటమిలో భాగస్వాములైన బీజేపీ, జనసేన పార్టీల కార్యాలయాల వద్ద కూడా సందడి నెలకొంది. టీడీపీ జిల్లా కార్యాలయంలో నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. పార్టీ జాతీయ కార్యదర్శి బీద రవిచంద్రకు, పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మిఠాయిలు తినిపించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యాలయంలో భారీ టెలివిజన్ స్క్రీన్ ఏర్పాటు చేయడంతో నేతలు, కార్యకర్తలు ఆ తెర మీద ఎన్నికల ఫలితాలు వీక్షిస్తూ సంబరాలు చేసుకున్నారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు నెల్లూరు పార్లమెంట్ స్థానాన్ని కూడా టీడీపీ కైవశం చేసుకోవటంపై నేతలు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే బీద రవిచంద్ర నివాసంలో కేక్‌కట్ చేసి విజయోత్సవం జరుపుకున్నారు. ఇందులో మాజీమంత్రి తాళ్లపాక రమేష్‌రెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజెర్ల వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ జెడ్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ జిల్లాలోనే అత్యధికంగా 72వేలకుపైగా మెజారీటీతో గెలుపొందడంతో నారాయణ క్యాంపు కార్యాలయంలో సంబరాలు జరిగాయి. నారాయణ సతీమణి రమాదేవి, కుమార్తెలు సింధూర, శరణి పిల్లలతో కేక్‌కట్ చేయించి అందరికీ పంచి పెట్టారు నారాయణ క్యాంపు కార్యాలయంతో పాటు, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కార్యాలయం, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కార్యాలయాల్లోనూ పెద్ద పెద్ద తెరలు ఏర్పాటు చేయడంతో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడ చేరారు. ఫలితాలు తెలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు. విజేతలకు శుభాకాంక్షలు తెలిపి సంబరాల్లో మునిగారు. నగరంలోని 47 డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ ధర్మవరపు సుజాతరావు ఆధ్వర్యంలో మహిళలు సంబరాలు చేసుకున్నారు.



ఉదయగిరిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



కందుకూరు : టీడీపీ కార్యకర్తల విజయోత్సవం

బీజేపీ కార్యాలయంలో...

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి భారీ విజయం సాధించడంతో నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయం ఎదుట నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి, ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో వరుసగా మూడోసారి ఎన్‌డీఏ కూటమి అధికారం చేపట్టనుండటం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడారని, రాజకీయాల్లో అహం ఉన్న వారికి ప్రజలు ఇలానే బుద్ధి చెబుతారన్నారు.



సంబరాలు చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు



సంగంలో మేళతాళాలతో అభిమానుల సంబరం



పొదలకూరు శివాలయంలో టెంకాయలు కొడుతున్న టీడీపీ నాయకురాలు ఆదాల సుగుణమ్మ, అభిమానులు

ఉద్యోగుల హర్షం

నెల్లూరు(హరనాథపురం), జూన్ 4 : టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభంజనంతో ఉద్యోగ వర్గాల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. తమకు స్వేచ్ఛ లభించిందంటూ వారు ఆనందపడ్డారు. కొత్త ప్రభుత్వంలో తమ ప్రయోజనాలకు పెద్ద పీటవేస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు.

రాబోవు ప్రభుత్వానికి శుభాకాంక్షలు



కొత్తగా ఏర్పాటు కాబోతున్న టీడీపీ ప్రభుత్వానికి శుభాకాంక్షలు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజ నాలను విస్మరిస్తే ఏ ప్రభుత్వానికైనా గుణపాఠం తప్పదు.. కూటమి ప్రభుత్వంలో ఉద్యోగుల ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తారని ఆశిస్తున్నాం.

- ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి

సంతోషదాయకం



టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు రాష్ట్ర వ్యాప్తంగా విజయ దుందుభి మోగించటం సంతోషదాయకం. ప్రభుత్వ ఉద్యోగులు కోల్పోయిన స్వేచ్ఛను తిరిగి పొందబోతున్నారు. ఉద్యోగులను అణచివేసిన ఏ ప్రభుత్వానికైనా గుణపాఠం తప్పదు.

- చేజర్ల సుధాకర్‌రావు, హంస జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రశాంత వాతావరణం

కూటమి ప్రభంజనంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రశాంత వాతావరణం ఏర్పడింది. ఉద్యోగులకు స్వేచ్ఛ లభిస్తుంది. కొత్తగా ఏర్పాటు కానున్న ప్రభుత్వానికి శుభాకాంక్షలు. ఉద్యోగుల ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వాలి.

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీ వెంకటరాజు, ప్రధాన కార్యదర్శి నాటకం తిరుమలయ్య

అభిమాని ఆనందం

జెండాలతో సైకిల్‌పై ఒక్కడే ర్యాలీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 4: తెలుగుదేశం పార్టీ తరఫున అతను ఎన్నికల్లో పోటీ చేయలేదు.. పార్టీలో ద్వితీయ, తృతీయ స్థాయి నాయకుడు కూడా కాదు.... పది మందిని పోగేసుకొని స్వీట్లు పంచిపెట్టి, బాణాసంచా చేసేంత డబ్బులు అతని వద్ద లేవు.... ఇవేవీ లేకపోయినా ఆ కార్యకర్తకు పార్టీ కోసం ప్రాణాలిచ్చేంత అభిమానం ఉంది. ఎన్నికల్లో టీడీపీ చరిత్రాత్మక విజయాన్ని సొంతం చేసుకోవడంతో శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన సింహాచలం అనే వ్యక్తి నెల్లూరు నగరంలో సైకిల్‌కు టీడీపీ జెండాలు కట్టుకొని ఎన్టీఆర్, బాలకృష్ణ ఫొటోలు పెట్టుకొని కళ్లద్దాలు ధరించి విక్టరీ సింబల్ చూపుతూ మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని నవాబుపేట నుంచి అయ్యప్పగుడి వరకు ఒక్కడే సైకిల్‌పై జై తెలుగుదేశం...జైజై తెలుగుదేశం అంటూ విజయోత్సవ ర్యాలీగా సాగాడు. నందమూరి తారక రామారావు అంటే ప్రాణమని, ఆయన పార్టీ స్థాపించినప్పటి నుంచి అందులోనే కొనసాగుతున్నానని సింహాచలం తెలిపాడు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన తాను ఉపాధి కోసం నెల్లూరు నగరానికి వచ్చానని, పార్టీ భారీ విజయం నమోదు చేయడంతో తనకు రూ.కోటి సంపాదించినంత ఆనందం కలుగుతోందని సంబరపడ్డాడు.

సొంత మండలంలోనే చతికిలా!

- మంత్రి కాకాణికి గట్టి దెబ్బ

పొదలకూరు, జూన్ 4 : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ ఎన్నికల్లో సొంత మండలంలోనే చతికిలపడ్డారు. 2014 ఎన్నికల్లో తన ప్రత్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై 5457 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఒక్క పొదలకూరు మండలంలోనే 5457 ఓట్లు రావడంతో అదే తన నియోజకవర్గ మెజారిటీగా నిలబడింది. అప్పట్లో కాకాణి విజయం సాధించ డంలో పొదలకూరు మండలం కీలక పాత్ర పోషించింది. తన సొంత మండలం లోని ఓటర్లు ఆదుకోకుంటే ఆ ఎన్నికల్లో కాకాణి ఓటమి చెందేవాడని పలువురు అభిప్రాయపడ్డారు. 2019 ఎన్నికల్లో మంత్రి కాకాణి తన ప్రత్యర్థి సోమిరెడ్డిపై 14వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. వీటిలో ఒక్క పొదలకూరు మండలంలోనే 4606 ఓట్లు ఆధిక్యత సాధించారు. అయితే ప్రస్తుత ఎన్నికల్లో మాత్రం కేవలం 55 ఓట్లు మాత్రమే మండలంలో మంత్రి కాకాణికి ఆధిక్యత లభించింది. మండలంలో 59,937 ఓట్లు ఉండగా 48,005 ఓట్లు పోల్ అయ్యాయి. మండ లంలోని 73 పోలింగ్ బూత్‌ల్లో ఆరు రౌండ్ల లెక్కింపులో మండలం మొత్తానికి 23,785 ఓట్లు మంత్రి కాకాణికి రాగా, టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి 23,730 ఓట్లు వచ్చాయి. అయితే గత ఎన్నికల్లో సొంత మండలం అయిన పొదలకూరు నుంచి కాకాణి అత్యధిక మెజారిటీ సాధిస్తూ వచ్చారు. గత ఎన్నికల్లో పొదలకూరు టౌన్‌లో 250 ఓట్లు టీడీపీకి ఆధిక్యం రాగా, ఈదఫా 1617 ఓట్లు టీడీపీకి ఆధిక్యం లభించింది. అయితే ఎన్నికల్లో పొదలకూరు నుంచే ఆయన పతనం ప్రారంభ మైందని రాజకీయ విశ్లేషకులు చెప్పుకొచ్చారు. మంత్రి కాకాణి ప్రధానంగా మండలంలో ప్రత్యర్థులను కేసుల్లో ఇరికించడం, ఆయన, అనుచరులు చేపట్టిన అవినీతి, అరాచకాలు, మండలంలో రూ.కోట్లలో తెల్లరాయి, ఇసుక, గ్రావెల్ దోపిడీ, దేగపూడి - బండేపల్లి కాలువ పనులు, కండలేరు లిఫ్ట్, లైనింగ్ పనులు పెండింగ్ ఇవన్నీ పొదలకూరు మండలంలో అతని మెజారిటీ తగ్గడానికి కారణాలుగా కొందరు పేర్కొంటున్నారు.



కోవూరులో తొలిగా నారీ.. జయభేరి!

- భారీ మెజార్టీతో ప్రశాంతిరెడ్డి విజయం

కోవూరు : కోవూరు నియోజకవర్గ శాసనసభ్యురాలిగా టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి 54,583 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. కౌంటింగ్ ప్రారంభమైన మొదటి రౌండ్ నుంచి సమీప ప్రత్యర్థి నల్లప రెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డిపై ఆధిక్యత కొనసాగారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం మునులపూడి నుంచి ఇందుకూరుపేట మండలం పంచాగ్నులవారి కండ్రిగ పోలింగ్‌బూత్‌ల వరకు లెక్కించిన అన్ని రౌండ్ల లోనూ మెజార్టీ కొనసాగింది, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, కొడవలూరు, విడవలూరు, ఇందు కూరుపేట మండలాల్లోని ఓటర్లు ఆమెకు బ్రహ్మరథం పట్టారు. పోస్టల్ బ్యాలెట్లలో సైతం ఆమె ఆధిక్యత సాగించారు.

● చారిత్రక రికార్డు..

కోవూరు అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పోటీచేయడం, భారీ మెజార్టీ సాధించడం చారిత్రక రికార్డుగా భావిస్తున్నారు. గత 2019 ఎన్నికలలో వైసీపీ అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డి 39,891 ఓట్ల మెజార్టీ సాధించారు. ఆయన రికార్డును అధిగమించి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి భారీ మెజార్టీ సాధించడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● సాధారణ గృహిణి శాసనసభకు...

సాధారణ గృహిణిగా జీవితం కొనసాగిస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శాసనసభలో అడుగు పెడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో భర్త రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ప్రోత్సాహంతో ఆమె తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి సభ్యురాలిగా పనిచేశారు. తిరుపతిలోని ఎస్వీ మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్ చదివే సమయంలో విద్యార్థి సంఘ ఎన్నికల్లో పోటీచేసి కార్యదర్శిగా గెలుపొందారు. అప్పటి నుంచే ఆమెకు రాజకీయాల్లో ఆసక్తి ఉన్నప్పటికీ చొరవ చూపలేకపోయారు. ధార్మిక కార్యక్రమాలకే పరిమితమయ్యారు. టీడీపీ నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలుపొందిన ఆమె భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ప్రోత్సాహంతో కోవూరు నియోజకవర్గ స్థానానికి పోటీకి దిగి విజయం సాధించారు.



● దేశ, రాష్ట్ర రాజకీయాల్లో విశిష్ట స్థానం

నెల్లూరు పార్లమెంటు స్థానం నుంచి గెలుపొందిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు నుంచి శాసనసభకు ఎన్నికైన ప్రశాంతిరెడ్డి దంపతులు దేశ, రాష్ట్ర రాజకీయాల్లో విశిష్ట స్థానాన్ని పొందే అవకాశముందని భావిస్తున్నారు. ఈ దంపతులపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. కోవూరు నుంచి ఓ మహిళ ఎన్నిక కావడం రాష్ట్ర రాజకీయాల్లో ప్రముఖ స్థానాన్ని పొందనున్నారనే సమాచారంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సూళ్లూరుపేట తొలి మహిళా ఎమ్మెల్యేగా విజయశ్రీ

తడ, జూన్ 4: సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని టీడీపీ చేజిక్కించుకుంది. ఇక్కడ నుంచి 2009లో టీడీపీ నుంచి గెలుపొందిన పరసారత్నం తరువాత జరిగిన రెండు ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. అయితే 2024 ఎన్నికల్లో టీడీపీ వ్యూహాత్మకంగా మహిళా అభ్యర్థిగా డాక్టర్ నెలవల విజయశ్రీని రంగంలోకి దించింది. ఆమె తమ సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్యపై 29,115 ఓట్ల ఆధిక్యంతో భారీ విజయాన్ని సాధించారు.

తొలి మహిళా ఎమ్మెల్యేగా గుర్తింపు...

1962లో సూళ్లూరుపేట నియోజకవర్గం ఏర్పడిన తరువాత 1983లో కాంగ్రెస్ పార్టీ నుంచి మహిళా అభ్యర్థి మైలారి లక్ష్మీకాంతమ్మ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తరువాత 2009లో అదే కాంగ్రెస్ పార్టీ నుంచి విన్నమాల సరస్వతి, అలాగే ప్రజారాజ్యం నుంచి గరిక ఈశ్వరమ్మ పోటీలో నిలిచినా ఆ ఇద్దరు కూడా ఓటమి చవిచూశారు. ఈ ఎన్నికల్లో ఆ కొరత తీరినట్లయ్యింది. ఇక్కడ టీడీపీ నుంచి పోటీ చేసిన నెలవల విజయశ్రీ ఈ దఫా విజయం సాధించి రికార్డు సృష్టించారు.

ప్రతి రౌండ్‌లోనూ మెజార్టీ...

సూళ్లూరుపేట నియోజకవర్గంలో మొత్తం 2,42,610 మంది ఓటర్లు ఉండగా, అందులో 2,01,179 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు. మంగళవారం జరిగిన కౌంటింగ్‌లో విజయశ్రీకి 1,11,048 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్యకు 81,933 ఓట్లు వచ్చాయి. దీంతో విజయశ్రీ 29,115 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 22 రౌండ్ల లెక్కింపులో 3వ రౌండ్‌లో నాయుడుపేట రూరల్‌లో వైసీపీకి కేవలం 69 ఓట్ల ఆధిక్యం లభించగా, మిగిలిన అన్ని రౌండ్లలో టీడీపీకి మెజార్టీ ఓట్లు దక్కాయి. చివరకు కిలివేటి సంజీవయ్య సొంత మండలం తడలో టీడీపీకి సుమారు 2,200 పైచిలుకు మెజార్టీ గమనార్హం. అలాగే సూళ్లూరుపేట పట్టణం, మండలంలో టీడీపీకి సుమారు 10వేలకు పైగా ఆధిక్యం రావడం మెజార్టీకి దోహదపడింది. ఇక్కడ టీడీపీలో సీనియర్ నాయకుడిగా ఉంటూ అప్పట్లో చక్రం తిప్పిన వేనాటి రామచంద్రారెడ్డి చివరి నిమిషంలో టీడీపీని వీడి వైసీపీలో చేరినా చివరకు ఆయన సొంత మండలం దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల్లో కూడా ప్రభావం లేకపోవడం పైగా భారీ ఆధిక్యం టీడీపీకి చేకూరడం గమనార్హం.



కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్తున్న నెలవల విజయశ్రీ

ప్రజలకు అందుబాటులో ఉంటా....

ప్రజలకు అందుబాటులో ఉంటానని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మహిళా యూనివర్శిటీలో డిక్లరేషన్ తీసుకున్న తరవాత మీడియాతో మాట్లాడారు. తనని గెలిపించినందుకు వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. తనకు అవకాశం కల్పించి టీడీపీ అధినేత చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

గూడూరు — ఏ రౌండ్‌లో ఎవరికెన్ని ఓట్లు

రౌండ్	టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఆధిక్యం (పార్టీ)
1	6056	4335	168	1721 (టీడీపీ)
2	4949	3391	191	1558 (టీడీపీ)
3	4529	2801	220	1728 (టీడీపీ)
4	6095	2775	178	3320 (టీడీపీ)
5	4468	2456	160	2012 (టీడీపీ)
6	5650	3009	154	2641 (టీడీపీ)
7	5101	4022	134	1079 (టీడీపీ)
8	4787	4335	84	452 (టీడీపీ)
9	4663	3484	140	1179 (టీడీపీ)
10	5249	4936	146	313 (టీడీపీ)
11	4298	3995	128	303 (టీడీపీ)
12	4901	4818	175	81 (టీడీపీ)
13	4611	3798	174	813 (టీడీపీ)
14	5136	4581	151	555 (టీడీపీ)
15	4581	284	151	1734 (టీడీపీ)
16	4166	3853	129	313 (టీడీపీ)
17	4395	4885	199	490 (వైసీపీ)
18	4102	3609	202	499 (టీడీపీ)
19	4510	3973	112	537 (టీడీపీ)
20	4631	4427	141	204 (టీడీపీ)
21	3966	4599	139	633 (వైసీపీ)

సూళ్లూరుపేట — ఏ రౌండ్‌లో ఎవరికెన్ని ఓట్లు

రౌండ్	టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఆధిక్యం (పార్టీ)
1	3782	3494	66	285 (టీడీపీ)
2	5070	3978	103	1092 (టీడీపీ)
3	4667	4732	130	69 (వైసీపీ)
4	5837	2795	253	3042 (వైసీపీ)
5	5898	3292	274	2607 (టీడీపీ)
6	4557	3456	166	1101 (టీడీపీ)
7	4316	4244	112	72 (టీడీపీ)
8	4692	3865	109	944 (టీడీపీ)
9	4799	3855	109	944 (టీడీపీ)
10	4777	4244	115	533 (టీడీపీ)
11	4825	4247	90	578 (టీడీపీ)
12	4147	3902	185	245 (టీడీపీ)
13	4440	3662	151	788 (టీడీపీ)
14	4529	3286	133	1243 (టీడీపీ)
15	5493	3682	178	1811(టీడీపీ)
16	6139	3935	218	2240 (వైసీపీ)
17	6070	2949	244	3130 (టీడీపీ)
18	6492	3186	219	3306 (టీడీపీ)
19	5808	3292	221	2516 (టీడీపీ)
20	5056	3961	176	1095 (టీడీపీ)
21	4709	4290	383	419 (టీడీపీ)
22	3621	3012	475	609 (టీడీపీ)

టీడీపీకి పట్టం కట్టిన గూడూరువాసులు

గూడూరు, జూన్ 4: ఈ సార్వత్రిక ఎన్నికల్లో గూడూరు నియోజకవర్గ ప్రజలు టీడీపీకి పట్టం కట్టారు. గత ఎన్నికలలో వైసీపీ వైపు మొగ్గుచూపిన ఓటర్లు ఈ దఫా కూటమి టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌ను గెలిపించారు. కూటమి ముందు వైసీపీ అధికార బలం, ధన ప్రవాహం దిగదుడుపుగా మారింది. ప్రధానంగా వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలు, అక్రమ మైనింగ్, దౌర్జన్యాలతో ప్రజలు విసిగిపోయి టీడీపీకి పట్టకట్టారు. ప్రలోభాలకు గురిచేసినా... వలంటీర్ల ద్వారా బెదిరింపులకు గురి చేసినా ప్రజలు కూటమికి నిశ్శబ్ద ఓటింగ్ వేశారు. ఈ ఎన్నికలలో 294 బూత్‌లలో 1,93,458 ఓట్లు పోల్ అయ్యాయి. ఈవీఎంలలో ఓట్లను లెక్కించి ప్రకటించిన ఫలితాలలో టీడీపీకి 1,00,844 ఓట్లు రాగా వైసీపీకి 80,929 ఓట్లు, కాంగ్రెస్‌కు 3,276 ఓట్లు, నోటా 3,119 ఓట్లు వచ్చాయి. దీంతో వైసీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్‌పై టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ 19,915 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. దీంతో నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆనందోత్సవాల్లో ఉన్నారు. ఫలితాలు వెల్లడికావడంతో ఉత్కంఠతకు తెరపడింది.

19 రౌండ్లలో టీడీపీదే పైచేయి...

గూడూరు అర్బన్: గూడూరు నియోజకవర్గానికి సంబంధించి 294 బూత్‌లు ఉండగా 14 టేబుళ్ల... 21 రౌండ్లు లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. మొదటి రౌండ్ నుంచి 16వ రౌండ్ వరకు టీడీపీ ఆధిక్యాన్ని నిలబెట్టుకోగా, 17వ, 21వ రౌండ్లలో మాత్రమే వైసీపీ స్వల్ప మెజార్టీని సాధించింది. 18, 19, 20 రౌండ్లలో టీడీపీ మెజారిటీ సాధించింది. దీంతో మొత్తం 21 రౌండ్లలో 19 రౌండ్లలో టీడీపీ ఆధిపత్యాన్ని కొనసాగించింది.

కూటమి విజయంతో టీడీపీ సంబరాలు

బాలాయపల్లి: మండల కేంద్రంలోని రామాలయంలో కూటమి గెలుపుపై టీడీపీ నాయకులు ప్రత్యేక పూజులు చేసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బాణసంచా కాల్చారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, నాయకులు రాయి సత్యంనాయుడు, టి.ప్రసాదనాయుడు, డి.కోటేశ్వరావు, చిత్తూరు ఈశ్వరయ్య, బాబు రెడ్డి, కొమ్మి గెరటయ్య నాయుడు, పెంచలయ్య, ఎం.క్రిష్ణ, మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.



బాలాయపల్లెలో టీడీపీ నాయకుల విజయోత్సవ ర్యాలీ

గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికలలో టీడీపీకే అధిక ఓటు

	2014	2019	2024
మొత్తం ఓట్లు	2,15,174	2,36,496	2,45,205
పోలైన ఓట్లు	1,66,582	1,82,626	1,93,458
టీడీపీ	71,282	63,610	1,00,844
వైసీపీ	80,433	1,08,893	80,929
కాంగ్రెస్	9,637	1,234	3,276
నోటా	892	2,885	3,119

పోస్టల్‌బ్యాలెట్ ఓట్లు....

గూడూరు నియోజకవర్గంలో 2,836 పోస్టల్‌బ్యాలెట్ ఓట్లు ఉండగా అందులో టీడీపీకి 1,831 ఓట్లు రాగా వైసీపీకి 554 ఓట్లు వచ్చాయి. 372 ఓట్లు చెల్లనవిగా నమోదయ్యాయి. దీంతో పోస్టల్‌బ్యాలెట్ ఓట్లలలో టీడీపీ 1,277 ఓట్లు మెజారిటీని సాధించింది. టీడీపీకి ఈవీఎంల ద్వారా 19,915 ఓట్లు మెజారిటీ రావడంతో పోస్టల్‌బ్యాలెట్ ద్వారా 1,277 మెజారిటీ రావడంతో మొత్తం టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ 21,192 ఓట్లు మెజారిటీతో గెలుపొందారు.

అయ్యో... హ్యాట్రిక్ చేజారిందే!



కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట, జూన్ 4: ఒక్కసారి గెలిస్తే ఆనందం... రెండో సారి మహానందం... మరీ మూడో సారి అవకాశం అంటే అలివిగాని ఆనందం... కానీ ఆ ఆనందానికి వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య దూరమయ్యారు. ఎలాగంటారా తొలిసారి రాజకీయ రంగ ప్రవేశం చేసి 2014లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కిలివేటి సంజీవయ్య 3,726 ఓట్లతో గెలుపొందారు. రెండోసారి 2019లో సుమారు 61,292 వేల భారీ ఆధిక్యతతో రాష్ట్రంలో మూడో భారీ మెజార్టీని నమోదు చేశారు. ఇంకేముంది హ్యాట్రిక్ తనదే అంటూ ధీమాగా ఉన్నారు. గతంలో ఎప్పుడో అంటే 1967, 1972, 1978 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పిట్ల వెంకటసుబ్బయ్య హ్యాట్రిక్ విజయాన్ని ఈ నియోజకవర్గంలో నమోదు చేశారు. ఆ తరువాత 1994, 1999 ఎన్నికల్లో పరసారత్నం రెండుసార్లు విజయం సాధించి మూడో సారి 2004లో విజయం ముందు బొక్కబోర్లాపడి హ్యాట్రిక్ చేజార్చుకున్నారు. ఇన్నాళ్లకు మళ్లీ కిలివేటి సంజీవయ్యకు ఆ అవకాశం రాగా టీడీపీ సునామీ ముందు ఆయన ఆశలు గాలిలో కలసిపోయాయి. అయ్యో సంజీవయ్య హ్యాట్రిక్ చేజారిపోయిందా అంటూ జనం మాట్లాడుకోవడం కన్పించింది.

వెంకటగిరి — ఏ రౌండ్‌లో ఎవరికెన్ని ఓట్లు

రౌండ్	టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఆధిక్యం (పార్టీ)
1	4717	4443	901	274 (టీడీపీ)
2	4881	3925	98	956 (టీడీపీ)
3	5335	4350	69	985 (టీడీపీ)
4	4034	4732	64	698 (వైసీపీ)
5	3801	3545	153	256 (టీడీపీ)
6	3866	3880	96	14 (వైసీపీ)
7	4753	5047	67	294 (వైసీపీ)
8	4885	4669	93	216 (టీడీపీ)
9	4348	3859	56	489 (టీడీపీ)
10	4158	4445	97	287 (వైసీపీ)
11	4471	3854	66	617 (టీడీపీ)
12	4584	3578	44	1006 (టీడీపీ)
13	4727	3744	84	983 (టీడీపీ)
14	5576	4232	112	1340 (టీడీపీ)
15	4941	3796	76	1145 (టీడీపీ)
16	4358	4631	81	273 (వైసీపీ)
17	4065	3392	62	673 (టీడీపీ)
18	6461	3515	105	2946 (టీడీపీ)
19	6405	3546	176	2859 (టీడీపీ)
20	5864	3855	107	2009 (టీడీపీ)
21	4693	4639	89	54 (టీడీపీ)
22	1794	1581	33	213(టీడీపీ)

ఈ విజయం ప్రజలదే: ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 4: ఈ ఎన్నికల్లో తన విజయం నియోజకవర్గ ప్రజలందరిదీ అని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం తిరుపతిలో కౌటింగ్ అనంతరం ఆయన మాట్లాడుతూ.. తన విజయం కోసం కూటమి నాయకులతో పాటు నియోజకవర్గంలోని పేదలందరూ ఎంతో కష్టపడి పనిచేశారన్నారు. ప్రధానంగా కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నేరవేరుస్తారని ప్రజలు నమ్మి టీడీపీని గెలిపించారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చకపోగా అక్రమమైనింగ్, నాసి రకం మద్యం, ఇసుక అక్రమ రవాణాతో వేలకోట్ల అవినీతికి పాల్పడిందని ప్రజలు నమ్మారన్నారు. వైసీపీ నాయకులు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నగదు పంపిణీ చేసినా వైసీపీ పాలనతో విసిగి పోయిన ప్రజలు టీడీపీ పక్షాన నిలిచారన్నారు. తాను ఇచ్చిన హామీ మేరకు గూడూరు నియోజకవర్గాన్ని, నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవ ర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. తన విజయానికి ఎంతో కృషి చేసిన టీడీపీ సీనియర్ నాయకుడు, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ సహా నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

భారీ ఓటమి మూటకట్టుకున్న వైసీపీ


● దౌర్జన్యాలు.. దందాలు.. వెన్నుపోటులే కారణం!

తడ, జూన్ 4: వైసీపీ కంచుకోట సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఆ పార్టీ భారీ ఓటమిని చవిచూసింది. నియోజకవర్గం మొత్తంలో ఒక్క దొరవారిసత్రం మండలంలో నామమాత్రపు మెజార్టీ తప్ప... ఎక్కడా ఆ పార్టీని ప్రజలు ఆదరించలేదు. 2014 ఎన్నికల్లో వైసీపీ 3,726 ఓట్ల స్వల్ప ఆధిక్యతతో సమీప టీడీపీపై విజయం సాధించగా, 2019 ఎన్నికల నాటికి ఆ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని కంచుకోటగా మార్చుకుంది. సుమారు 61,292 ఓట్ల భారీ ఆధిక్యతతో విజయాన్ని నమోదు చేసింది. అయితే హ్యాట్రిక్ కొట్టాలనుకున్న వైసీపీ ఆశ ఈ ఎన్నికల్లో నేరవేరలేదు. ఇందుకు ఆ పార్టీ నాయకుల దౌర్జన్యాలు, అక్రమ దందాలతోపాటు గ్రూపు రాజకీయాలు తదితర కారణాలతో భారీ ఓటమిని వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య మూటకట్టుకున్నారు. వైసీపీ నాయకుల దౌర్జన్యాలు, అక్రమ దందాలు, గంజాయి విక్రయాలతో జనం విసిగిపోయారు. నామినేషన్ల సమయంలో సైతం నాయకులు బాహాబాహీకి దిగిన సంఘటనలున్నాయి. వీటికితోడు ప్రభుత్వ వ్యతిరేక ఓటు తోడవడంతో ఓటమి తప్పలేదు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

చిల్లకూరు, జూన్ 4: మండలంలోని వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు మంగళవారం ఉదయం విజయవాడ నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో ముందు వెళుతున్న లారీని ఢీకొంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న రాజస్థాన్‌కు చెందిన చోటురామ్(35) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్నిగూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నేత్రదానం సామాజిక బాధ్యత



కొండయ్య (ఫైల్‌ఫొటో)

గూడూరు, జూన్ 4: నేత్రదానం సామాజిక బాధ్యతగా గుర్తించాలని సునీత సేవా సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు అన్నారు. కుమ్మరవీధికి చెందిన పేటేటి కొండయ్య(89) అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో తమ సంస్థ అభ్యర్థన మేరకు వారి కుటుంబసభ్యులు నేత్రదానానికి సహకరించారన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి, కొండయ్య కుంటుంబసభ్యులు ఉన్నారు.

టీడీపీ శ్రేణుల సంబరాలు







పెళ్లకూరు, చిట్టమూరు, సూళ్లూరుపెటలో కూటమి నాయకుల సంబరాలు

పెళ్లకూరు/ ఓజిలి/ సూళ్లూరుపేట/ నాయుడుపేట/ కోట/ వాకాడు, జూన్ 4 : టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో మండలంలో మెజార్టీ సాధించి టీడీపీ అభ్యర్థి విజయశ్రీ విజయ ఢంకా మోగించారని టీడీపీ సీనియర్ నాయకులు పేరం రమేష్‌నాయుడు, మధుసూదన నాయుడు అన్నారు. పెళ్లకూరులో మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలతో విసిగిపోయిన ప్రజలు భారీ ఎత్తున పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టి టీడీపీ అభ్యర్థిని గెలిపించారన్నారు. టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ గెలుపు నేపథ్యంలో ఓజిలి మండల టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.కూటమి అభ్యర్థులు విజయం సాధించడంతో సూళ్లూరుపేటలో జనసేన కార్యాలయం వద్ద మంగళవారం సంబరాలు చేసుకొన్నారు. జనసేన నాయకులు పొన్నా కాటయ్య, పట్టణ టీడీపీ కార్యదర్శి ఏజీ కిషోర్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ ఆలయంలో కూటమని విజయంపై టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుబేరు మణి టీడీపీ విజయం కోసం ప్రత్యేక పూజలు చేశారు. రామాలయం, విజయగణతి, వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు చేశారు.వాకాడు మండలంలో ఈ సారి టీడీపీకి మెజారిటీ ఓట్లు పడడంపై కేక్‌లను కట్‌చేసి బాణసంచా పేలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. కొండాపురం పంచాయతీలో టి.మోహన్‌నాయుడు, ఎం.వేణునాయుడు, గోపీనాయుడు, కమలాకర్‌నాయుడు, కాంచన్ గ్రామదేవతకు పొట్టేళ్లను సమర్పించి వనభోజనం చేశారు. యరగాటిపల్లి పంచాయతీలో పంత్రాంగం అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో , తిరుమూరు పంచాయతీలో కుంచం దయాకర్ ఆధ్వర్యంలో, దుగరాజపట్నం పంచాయతీలో దోశకాయల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. కోట మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. తిన్నెలపూడిలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి ఆధ్వర్యంలో కోటమ్మ అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కర్‌రెడ్డి, ఎం.మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: గ్రామ దేవత పోలేరమ్మ ఆలయం వద్ద 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కూటమి విజయం సాధించడంతో మంగళవారం రాత్రి కాపురాయల్స్ ఆధ్వర్యంలో పోలేరమ్మ గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గిండి సతీష్, కర్రా యశ్వంత్, దిలీప్, గుణ, చరణ్, చిన్నా తదితరులు ఉన్నారు.

డక్కిలి: వెంకటగిరి నియోకవర్గ టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ భారీ మెజారిటితో విజయం సాధించడంతో డక్కిలి మండంలో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకొన్నారు. మాటుమడుగులో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కెక్ కట్‌చేసి పంచిపెట్టారు. డక్కిలిలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏ.రామచంద్రయ్య నాయుడు ఆధ్వర్యంలో టపాసులు కాల్చారు.

వెంకటగిరిలో చరిత్ర తిరగ రాసిన రామకృష్ణ



కురుగొండ్ల రామకృష్ణకు స్వాగతం పలుకుతున్న నాయకులు

- పోలైన ఓట్లు : 1,96,991
- టీడీపీ అభ్యర్థికి వచ్చిన ఓట్లు :1,27,714
- వైసీపీ అభ్యర్థికి వచ్చిన ఓట్లు : 81,262
- కాంగ్రెస్ అభ్యర్థికి వచ్చిన ఓట్లు :1916
- నోటాకు వచ్చిన ఓట్లు : 3016
- ఇతరులకు : 2058
- టీడీపీ మెజార్టీ : 15,455

వెంకటగిరి, జూన్ 4: వెంకటగిరిలో ఇప్పటివరకు మూడు సార్లు ఎమ్మెల్యేగా ఒకే వ్యక్తి ఎన్నికకాలేదు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి వెంకటగిరి నుంచి రెండు సార్లు పోటీ చేసినా ఒక్క సారి మాత్రమే గెలుపొందారు. నల్లపరెడ్డి చంద్రశేఖర రెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నేదురుమల్లి రాజ్యలక్ష్మి, వెంకటగిరి రాజా లాంటి ఉద్దండులు వెంకటగిరి నుంచి శాసనసభ్యులుగా ఎన్నికైనా మూడోసారి గెలిసిన సందర్భాలు లేవు. ఆ రికార్డును ఈ ఎన్నికల్లో కురుగొండ్ల రామకృష్ణ సొంతం చేసుకొన్నారు. ఈ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి వర్గం కూడా రామకృష్ణకు పనిచేయడం ఈయనకు కలిసొచ్చింది. ఇంకా జనసేన, బీజేపీ శ్రేణులు కూడా ఈ ఎన్నికల్లో పనిచేయడంతోపాటు వెంకటగిరిలో వైసీపీ వైఫల్యాలు, పోలీసుస్టేషన్‌లో ప్రజలకు న్యాయం జరక్కపోవడం, భూకబ్జాలు, మైనింగ్ అక్రమాలు దెబ్బతీశాయి.

వైసీపీ పాలన చూసి ప్రజలే తీర్పునిచ్చారు

రాష్ట్రంలో వైసీపీ పాలన చూసి ప్రజలే తీర్పునిచ్చారని వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ అన్నారు. మహిళా యూనివర్శిటీలో డిక్లరేషన్ తీసుకున్న తరువాత ఆయన మీడియాతో మాట్లాడుతూ... అరాచకాలు, దౌర్జన్యాలు, భూకబ్జాలతో ప్రజలు విసిగి పోయి కూటమికి ఓట్లు వేశారన్నారు. ఇకపై సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తామన్నారు.

నా విజయం వెంకటగిరి ప్రజలకు అంకితం: కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి/ డక్కిలి, జూన్ 4: తన విజయాన్ని వెంకటగిరి నియోకవర్గ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు కురుగొండ్ల రామకృష్ణ చెప్పారు. కౌంటింగ్ అనంతరం ఆయన ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ... వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు తాను రుణపడి ఉంటానన్నారు. వెంకటగిరి నియోజకవర్గ అభివృద్దే తన ఊపిరిగా పని చేస్తానన్నారు. తన తండ్రిని గెలిపించిన వెంకటగిరి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటామని రామకృష్ణ కుమార్తె లక్ష్మీసాయిప్రియ అన్నారు.

మిన్నంటిన సంబరాలు

కురుగొండ్ల విజయం సాధించడంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో టీడీపీ శ్రేణులు సంబరాలు అంబరాన్నంటాయి. టీడీపీ శ్రేణులు పోలేరమ్మ గుడి వద్ద 101 కొబ్బరి కాయలు కొట్టారు. ఇక అన్ని మండల కేంద్రాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి ఆనంద వ్యక్తం చేశారు.







కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న లక్ష్మక్కకండ్రిగవాసులు - వెంకటగిరి పోలేరమ్మగుడి వద్ద టెంకాయలు కొడుతున్న టీడీపీ కార్యకర్తలు- తిరుమూరులో టీడీపీ నాయకుల సంబరాలు